SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

చినయజ్ఞనారాయణశర్మ, భమిడిపాటి

శూరబొబ్బిలి

చెన్నపురి, 1922

Record no. 272

Cinayajñanārāyaṇaśarma, Bhamiḍipāṭi

Śūrabobbili

Cennapuri, 1922

Record no. 272

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

చినయజ్ఞనారాయణశర్మ, భమిడిపాటి.

శూరబొబ్బిలి / భమిడిపాటి చినయజ్ఞనారాయణశర్మగారిచే విరచితము.- చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1922.

2, 2, 128 p. ;19 cm.

Library's copy imperfect: all after p.128 wanting

Record no. 272

Cinayajñanārāyaṇaśarma, Bhamiḍipāṭi.

Śūrabobbili / Bhamiḍipāṭi Cinayajñanārāyaṇaśarmagāricē viracitamu.- Cennapuri : Vāvilla Rāmasvāmiśāstrulu aṃḍ Sans, 1922

2, 2, 128 p. ;19 cm.

Library's copy imperfect: all after p.128 wanting

Record no. 272

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB   Date filming began:

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
నాటకము న-89
సంఖ్య: 6326

నాటకాలు
న-89 463

2351

శ్రీ రస్తు.

ఓం నమో మార్తాండగురువరబ్రహ్మణే.

శూరబొబ్బిలి

భమిడిపాటి. చినయజ్ఞనారాయణశర్మగారిచే

విరచితము.

463

220

2-89

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారి

వావిళ్లప్రెస్సున ముద్రించి ప్రకటింపఁబడియె.

1922.

All Rights Reserved.

894.8132
CHI-5

ఈగ్రంథముద్రణాధికారస్వాతంత్ర్యము
వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్‌సన్స్‌వారి కిచ్చినాను.

భ. చినయజ్ఞనారాయణశర్మ.

పాత్రములు.

1-వ అంకము.

విజయరామరాజు	హైదరుజంగు
జగన్నాథరాజు	నాగోజీరావు
వెంకారెడ్డి	హుస్సేను
బూసీదొర	

2-వ అంకము.

రంగారావు	ధర్మారావు
వెంగళరావు	హుస్సేను
వెంకయ్య	విజయరామరాజు
బుచ్చన్న	హైదరుజంగు
పాపారాయఁడు	బూసీదొర
చారుఁడు	మార్టిను

3-వ అంకము.

వెంకయ్య	ధర్మారావు
హైదరుజంగు	వెంకయ్య
విజయరామరాజు	బుచ్చన్న
హుస్సేను	నరసింహారాయఁడు
కిద్దీబిలాలు	వేగువాఁడు
[illegible]దూఖాను	హసనల్లీఖాను
రంగారావు	మల్లమ్మదేవి
వెంగళరావు	చినరంగారావు

పాత్రములు.

4-వ అంకము.

మల్లమ్మదేవి	జానా
వెంకటలక్ష్మి	బూసిదొర
చినరంగారావు	విజయరామరాజు
కమల	హైదరుజంగు
వెంకయ్య	నాగోజీరావు
హుస్సేను	రంగారావు
మారపరాజు	వెంగళరావు
యాకూబ్	

5-వ అంకము.

హైదరుజంగు	పాపారాయఁడు
విజయరామరాజు	వెంకయ్య
వెంగళరావు	బూసిదొర
బూసిదొర	చినరంగారావు

పీఠిక.

ఈనాటకము నాయిరవదిరెండవయేట రచియించిన దగుటచే నిం దనేకముగా తప్పులుండుననుట నిర్వివాదాంశము. పాండిత్య ప్రకర్ష నటుండనిచ్చి చరిత్రాంశభాగమునందు నాకు చేతనగు నంతవఱకు నిజము గ్రహియించి యిది కూర్చితిని. కథానుగుణ్యముగ మూలవ్యతిరేకము లేకుండ తగుపాటి కల్పన లక్కడక్కడ కలవు. ఈచరిత్రమునందు పలువురకు పలుయభిప్రాయభేదములు లేక పోలేదు. అవన్నియు నిట పేర్కొని నాయభిప్రాయానుసారముగ గ్రంథసాక్ష్యముగ ఖండించుచు వచ్చునరికి అదియే యింత గ్రంథమగును. సమయ మనుకూలించినచో అట్టిచరిత్ర విమర్శనా గ్రంథరచనభాగ్యము నాకబ్బుఁగాక. ఈ గ్రంథరచనయందు నాకు దిట్టకవి నారాయణకవికృత రంగరాయవిలాసంబును బొబ్బిలి మహారాజులుంగారి బొబ్బిలిచరిత్రంబును ఆర్మిదొరగారు వ్రాసిన గెజటీయరులోని వ్రాఁతలును నాకు సహాయపడినవి.

ఈనాటకము 1915 సం॥ లోనే విరచింపఁబడినది; కాని లోకముఁ జూచుభాగ్య మింతవఱకు దానికి లేకపోయినది. 64 పుటలు 1918 లో ముద్రింపించితిని కాని కారణాంతరములచే దాని నట్లే నిలుపుచేయవలసివచ్చెను. ఇటీవల నాకోర్కె ననుసరించి శ్రీ వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్సువారు ముద్రణావ్యయముభరించి, ప్రచురించుట కియ్యకొనుటచే యిప్పు

టికేని గ్రంథనాశనము కాక, యింకను నిలుచుభాగ్యము లభించి నది. ఇంకను మహోత్కృష్టగ్రంథంబులుఁ బ్రచురించి వన్నెఁ దక్కియున్న నాంధ్రవాణి నలంకరించుభాగ్యము వారికి లభించుఁ గాక యని కోరుచు వారీగ్రంథముఁ బ్రచురించినందులకుఁగా నా నమస్కృతు లర్పించుచున్నాను.

ఈగ్రంథముద్రణమందు మిగుల సహాయపడి అచ్చుతప్పులును, నాతప్పులును సవరించిన మాగురువులును పూజ్యులు నగు బ్రహ్మశ్రీ పండిత పురాణం సూర్యనారాయణతీర్థులవారికి నా సవినయనమస్కారము లర్పించుచున్నాను. అచ్చునందుగాని, కథాభాగమందుగాని లేదా, పాండితియందుగాని దొరలిన తప్పులను నాకెఱిఁగించినచో నమస్కారపూర్వకముగా నవి గ్రహించుచు ఈ గ్రంథమునకు రెండవముద్రణాభాగ్య ముండెనేని యందు సవరించు కొందును.

మాడుగుల.
23-3-1922.

ఇట్లు విన్నవించువిధేయుఁడు,
చినయజ్ఞనారాయణశర్మ.

2351
257 నా

శ్రీరస్తు.

ఓంనమో మార్తండగురుపరబ్రహ్మణే.

శూ ర బో బ్బి లి.

నాంది

శా. ఆర్యావర్తపటమ్మునం దహితగాత్రాసృఙ్మషిఁ ధైర్యగాం
భీర్యౌదార్యవిశుద్ధలేఖిని నిజాభిఖ్యల్ విచిత్రించి రే
ధైర్యాహార్యులు కృష్ణరాయపృథివీధాత్రీట్ శివాజీప్రతా
పార్యోత్తంసులు వారికీర్తిశశి మిమ్మత్యంతముఁ బ్రోచుతన్.

సీ. రాజసింహాదిసద్రాజపుత్త్రులఁ గడు
పారఁ గాంచినయట్టివీరమాత,
తిక్కనామాత్యాదిధీసచివుల నెల్ల
గారాబమునఁ గన్నధీరచిత్త,
శబ్దశాసనముఖ్యసత్కవీశుల నోము
పంటగాఁ గన్నవిద్వాంసురాలు,
అఖిలకళాపూర్ణ లౌపుత్త్రికుల నెంద
అనో కాంచినట్టిగారాలకూచి,

తే. గీ. మొల్లదుర్గావతీసతి మొదలు గల్గు,
ముద్దుఁగూఁతులఁ గాంచినముద్దరాలు,
భరతమాత గుణోపేత కరుణచేతఁ,
బూజ్యు లగుసభ్యులను సదా బ్రోచుఁగాత. ౧

ఉ. స్తోత్ర మొనర్పఁగా నెది వసుంధర నొప్పిద మేది కల్గినన్
వృత్రవిరోధి చెంత నసియింపఁగఁ బాత్రత కల్గు దేనిచే
శత్రుకులంబు నాశ మయి చాల యశం బొడఁగూడు నట్టిదా
క్షాత్రము మాసభాసదుల సాకునుగావుత మంగళక్షమై. 3

[నాంద్యంతమున సూత్రధారుఁడు పుష్పాంజలి సమర్పించి]

సూత్రధారుఁడు.—ఇంకను కాలవిలంబ మెందులకు? మారిషా! ఇటకొకసారి వచ్చెదవా?

మారిషుఁడు.—(ప్రవేశించి) వచ్చితి నాజ్ఞాపింపుము బావా!

సూత్ర.—మారిషా! నేఁడు మన మీసభవారియెదుటను "బొబ్బిలిచరిత్ర మాడవలయు" నని సభాసదులచే నియమింపఁబడితిమిక దా! వలయు పాత్రముల జతపఱిచి యుంచితివా?

మారి.—(సానూయముగ) దానిదుంప తెగ; ఆబొబ్బిలిసంగ్రామమే యాడవలయు నని మీరు నియోగింపవలయునా! మన కీజన్మమునఁ దురకగోల వదలదు కాఁబోలును!

సూత్ర.—రసద్వయమిశ్రిత మగునీగాథయందుఁ దురకలసంభాషణ మంత శ్రుతికటువుగ నుండదుసుమా!

మారి.—ఏమియుండకపోయినను బొబ్బిలివీరుల వీరవాదార్భటులచే నా చెవులు గింగురుగింగురు మనవా! బావా! మీరే ఈనాటక మాడు కొనుఁడు. నే నీయూరు విడిచియే పోయెదను.

సూత్ర.—భీరుఁడా! అంత నాటకములలోని కేకలు వినియే భయపడువాఁడవు పాత్రలఁ గొననేల సిద్ధ మయ్యెదవు?

మారి.—ఏమో! ఎఱుఁగక చేసినతప్పబ్బా! ఇది; శృంగారనాటకముల లోని పాత్రములనైన నెట్లో యీడ్చుకొని వచ్చితిని కాని, యిది నా తరమా! ఇంక నా కేవేషమును ఈయ నక్కఱ లేదు లే!

సూత్ర.—మూర్ఖుఁడా! ఇప్పుడు మునుపటివలె శృంగారకావ్యనాటకాదులు కల్పితగాథలు మొదలగునవి నవనాగరకసదస్యుల మెప్పునకుఁ బాత్రములు కావని యెఱుఁగవా! కాల మెప్పటికిని ఒక్కలాగుననే యుండు ననుకొంటివా?

మారి.—(తనలో) ఇఁక నీతద్దినము నాకెట్లును తప్పెడిజాడ కన్పట్టలేదు. ముందు విజయరామరాజుగారికి మాత్రము వేంగళరాయనితోఁ గయ్యమాడక తీఱినదా? (ప్రకాశముగ) బావా! అయినచో బొబ్బిలియుద్ధ మాడవలయు నంటివి కదా! దానిని విరచించినవా రెవరు?

సూత్ర.—మారిషా! అట్లు దారికి వచ్చి నాప్రయత్నముల కనుకూలుఁడవు కమ్ము.

సీ. శారదాపావనోదారతీరస్థలీ
భ్రాజితమాష్టులగ్రామవాసి,
భాషానుశాసనాపరకుండలీంద్రమా
ర్తాండసద్గురుపదాబ్జానువర్తి,
సరసజనాహ్లాదభరితనిర్దుష్టస
మ్యక్కవితోర్వరునిర్మాణకర్త,
కవిసార్వభౌమాంధ్రకవివీరసూర్యనా
రాయణతీర్థశిష్యాయితుండు,

తే. గీ. భమిడిపాట్యన్వయోద్భవ విమలకీర్తి
దీధితిస్నాపితాఖిలదిక్శశాంక,
సోమయాజిసుతుండు విశుద్ధయశుఁడు
యజ్ఞనారాయణాఖ్యుఁ డీయ్యది రచించె. ౪

మారి.—బావా! తెలియక యడుగుచుంటిని. ఈగాథ ననుసరించిన నాటకము లిదివఱకే యుండఁగా నీతఁడుకూడ నిదియే వ్రాయుటకుఁ గత మెయ్యదియో తెలియునా?

సూత్ర.—మారిషా! ఒకనాఁడు నాతో నాకవియే స్వయముగ ముచ్చటించియుండుటం జేసి నాకా సంగతి కొంత తెలియును.

చ. కవి కభిమాన మైనయది గ్రంథము కావునఁ జేతనైన వా
స్తవము గ్రహించి దానిఁ బెలుచన్ విరచించెను నాటకమ్ముగా
నెవరొ లిఖించి రంచు మది నెంచుచు నీతఁడు మాననేల? నీ
భువిఁ బెఱపుత్త్రు లున్నఁ దనపుత్త్రునికై జనకుండు కోరఁడే? ౫

మారి.—బావా! అయినచో నే నిప్పట్ల నేమి సేయవలయును? లోనికిం బోయి పాత్రముల సమకూర్తునా?

సూత్ర.—అటులే చేయుము. ఇదివఱకే రాత్రి చాల నతిక్రమించినది. ఇంక జాగొనరింపక నాటక మారంభింపవలయును. (సభవంకఁ జూచి) రసగ్రహణపరాయణు లగు నో సదస్యులారా!

మ. కృతిలోఁ గాని ప్రదర్శనంబునను గానీ దోషము ల్గల్గ స
న్మతి నైఁపందగు; నీరు పాలిడఁగ హంసశ్రేష్ఠ మానీటి నే
గతివర్జించి పయస్సుఁ ద్రావునొ యటుల్గా నొప్పు లున్నెనిసం
తత మున్నంత సమున్వహింపుఁడ దెకాదా మిమ్ము నర్థించెదన్. ౬

ఇది ప్రస్తావన.

శ్రీరస్తు.

ఓంనమో మార్తండగురుపరబ్రహ్మణే.

శూర బొబ్బిలి.

ప్రథమాంకము.

రంగము—గుడారము.

[విజయరామరాజు, జగన్నాథరాజును ఆసీను లయి ప్రవేశింతురు.]

విజ.—ఓమంత్రిపుంగవా! జగన్నాథరాయా! మనరాజ్యపరిపాలనంబున కెల్ల నాతంకంబుఁ గల్గించుచుండినయాబొబ్బిలివారిప్రతాపానలం బెప్పటికేని, మామక బాహాసి ధారచే నాఱిపోయి, నాకు ముదంబొడఁగూడునా? ఎప్పటికేని నేను సంతోషంబుఁ గను కాలము వచ్చునా?

జగ.—మహారాజా! ఊఱడిల్లుఁడు. మానవుల కసాధ్య మగుపని యేదియు లేదుకదా!

విజ.—ఊఱడిల్లక నే నేమిచేయఁగలను? కాని వారలచరిత్రంబు తలఁచుకొనినంతనే, మనంబున నెంతయూరటఁ గలుగఁజేసికొందమన్నను వారలపరాక్రమంబులే జ్ఞప్తికి వచ్చి, చేయి పెట్టి కలఁచినట్లు చేయుచున్నవి

తే. గీ. నిదుర వచ్చునె కంటికి? సుదతిపొందు
ముచ్చట యొసంగునే? అన్న మిచ్చ యగునె?
మానవంతున కెందేనిఁ గాని శత్రుఁ
డొకఁడు తనయంతబలవంతుఁ డున్నయపుడు. ౧

జగ.—భూలోకదేవేంద్రా! రణరంగంబున వీరవిహారంబు సలిపి, జన్యంబుల మన్యధరాకాంతుల నోడిచిపుచ్చి, సకలభూపాలోజ్జ్వల మకుట స్థాపిత మాణిక్యమరీచులు దేవరపాదపంకేరుహమ్ములకు నివాళు లొసంగ వసుంధరావలయంబు నిరంకుశలీలఁ బరిపాలించుదేవర కింకేమికొదవ? ఏలినవా రొకింత యోపికఁ బూని యుంటిరేని బొబ్బిలిసహిత మల్పకాలములో దిబ్బ యొనరింపలేరా?

విజ.—అటులే చేయవచ్చును, కాని—

సీ. వితతప్రతాపనిర్జితసకలక్ష్మా
నాయకుం డగురంగరాయుబలము,
నిరుపమధైర్యమందరమహీధరతుల్యుఁ
డైన వేంగళరాయునమితశక్తి,
పరిపంథిరాజముష్కరసైన్యతిమిరమా
ర్తాండపాపారాయుధైర్యగరిమ,
సంగరరంగవిక్షతసర్వవైరిదా
మెర్లధర్మారాయుమించుదర్ప,

తే. గీ. మలఘుధైర్యుండు చెలికానికులశశాంకుఁ
డైన వేంకయదోఃగ్రప్రతాపానలంబు
తలఁచుకొనినంత మన మెల్లఁ గలఁగఁదొడఁగె
నకట! ఇందుల కేముపాయమ్ము మంత్రి! ౯

జగ.—ధీరోదాత్తు లగు నేలినవారికే యిట్టివిచారమా?

ఉ. ఇంతదురంతచింత మది నీగతి వందుర నేల? మేదినీ
కాంత! వలంతులైనరిపుకాండము నింతకుమున్న తాఁకి దు
ర్దాంతపరాక్రమమ్మునఁ గృతాంతుని చెంతకు నంపలేదెయో
దుంతలఁబద్మనాయకులఁ ద్రుంచుట కింతటివంత యేటికిన్?—

విజ.—జగన్నాథరాయ!

ఉ. నిక్కపుశూరులైనధరణీవరు లెల్లరుఁ గేలు మోడ్చి నా
చక్కనిపాదపద్మములసాగిలిమ్రొక్కఁగ నన్నుసుంతయున్
లెక్కకుఁ దేక బెండుగ గణించుచు బొబ్బిలిపద్మనాయకుల్
ప్రుక్కఁగఁజేయుచుండిరెదలోఁ గలశాఁకులరీతి శ్రీహరీ! ౧౦

జగ.—ధరాపురందరా! మాటిమాటికిఁ బరిపంథిబలంబులఁగూర్చి తలంచుచు వాపోయుచుండుటకన్న నెటులేని వారలఁ గడతేర్చునుపాయమాలోచించినచో బాగుగ నుండునుగదా!

విజ.—అదియే యేనుఁగూడ యోజించుచుంటిని.

క. ఎటులైన నాదురాత్ములఁ
బటుతరరణరంగమందుఁ బట్టి వధింపన్
దిటము వహియింపనలె మ
చ్చటులోగ్రకరాసిచేఁ బ్రజల్ నుతియింపన్. ౧౧

ఇదివఱ కేడెనిమిదిసారులు మనవారు బొబ్బిలిప్రాంతములఁ గొల్లలాడ నంపినను కృతకృత్యులు కాకుండఁగనే బొబ్బిలివారిచేఁ బరాజితులైరి. ఈ సారి యటు సేయక, యెంతబలమ్ముఁ గూర్చిన వారి నెదుర్కొని యోడింపవచ్చునో, ఆరణం బెంతకాలమువఱ కగునో, అందుల కగుసాధన సామగ్రి యెంత యుండవలయునో, సేకరించి పిదప రణభేరి మ్రోఁగింపవలయును. అంతదనుక మనయభిప్రాయం బొరుల కభేద్యముగ నుంపవలయును. కాదేని శత్రుపక్షమువారుకూడ యుద్ధమునకు సన్నద్ధు లగుదురు.

జగ.—దేవా! తమయభిప్రాయం బెంతశ్లాఘనీయముగ నున్నది! మిమ్ముంబోలు శూరశిఖామణులు తలపెట్టినచో నిదియొక లెక్కయే?

క. బొబ్బిలియె కాదు, లోక
మ్మబ్బురముగ వచ్చి యుద్ధమందు నిలిచినన్

తబ్బిబ్బు సేయఁ జాలిన
గబ్బిమగలు మీర లిట్లు కలఁగుట మేలే? ౧౩

విజ.—కాని యంతటిమహాభాగ్యము నాకెపుడు లభించునో యనిమాత్రము మనంబు తత్తరపడుచున్నది.

ఉ. ఎప్పుడు రంగరాయపృథివీశ్వరు సంగరరంగమందు నేఁ
జొప్పిలు వేడ్కనొంచిరిపుసూదనుఁ బాపయఁ ద్రుంచి వేంగళున్
ముప్పుఘటిల్లఁ జేసి నృపముఖ్యుఁడ నంచును గీర్తిఁ గాంతునో
అప్పుడు నామనోవ్యథ సమస్తముతీఱును మంత్రిపుంగవా!

జగ.—దేవా! దాని కేమికాని యిప్పుడీరాణ్మహేంద్రవరమునకు భేటీకి రమ్మని కబురంపుటలో వారియభిప్రాయ మేమి? మఱియు.—

క. సాహబుఁట! యాతఁ డెవ్వం
డో హైదరుజంగునాముఁ డుత్తాలధను
ర్బాహులతో రా నేటికి?
నూహింపఁగ నేమికార్య మున్నదొ! యిచటన్. ౧౪

నవాబుగారిచే నియమితుఁడే యీహైదరని తలంత మన్ననో!

మ. పటుబాహాబలనిర్జితారి యగుచు నాప్తైనాయకుం డాహవ ప్రా
త్కట తేజోనిధి యైనబూసిదొర యొక్కండై పయినాసాహసో
ద్భటసేనానులతోడ వచ్చెడినిమిత్తమ్మేమి యై యుండు ని
చ్చటి కూహింపఁగఁ దోఁచదాయె నృపవంశశ్రేష్ఠ! సుంతేని యున్. ౧౫

మ. వసుధాధీశుననుజ్ఞపై నిట జమాబందీ యొనర్పంగ బూ
సిసహాయుండుగ వెంటఁ బెట్టుకొని వచ్చెం బోలునం చెంచనే

ల సహాయేచ్ఛ పఠాణినేతలకు నెల్లన్ రాజులుంగూడఁ గై
వసమై లొంగి చరించి వేళలకుఁ గప్పమ్మెల్లఁ జెల్లింపఁగన్.

విజ.—ఓయమాత్యా! వినియుంటివి కదా! గోలకొండరాజ్యంబు నెల్ల విక్రమలీలఁ బాలించు "సలబత్ జంగుఁ" డనుతురుష్కసార్వభౌముని, ఆర్యావర్తంబునఁ గొంతప్రదేశంబు బాహుబలంబున నిర్జించినపరాసులప్రతినిధి యగుడూప్లేదొరను. పరాసువారిబాహుబలంబును దర్పంబును గనుఁగొని తురుష్కసార్వభౌముండు వారలతోఁ గలసి యుండుట శ్రేయోదాయకం బని యోజించి తనదేశమందలిసామంతనరపాలురయెల్లరు లణంచుటకును వలయుతఱిఁ దనకు బాసటగ వచ్చుటకును ఒడంబడికలు జరపికొని కంభము చెరువు మొదలు శ్రీజగన్నాథమువఱకును గలదేశంబునందలిసర్వాధికారంబులును దొరల కొసంగి యుండుటచే నారాజులయొద్దఁ గప్పములఁ గొని తెచ్చుటకయి యీబూసిదొరను నియమించిరి. మఱియు,

తే. గీ. తనకు దేశంబు క్రొత్త యై తనరుకతన
నెల్లవృత్తాంతముల వచియించుకొఱకు
సచివుఁ జేసిరి హైదరుజంగు నగుట
వార లిప్పుడు వచ్చియున్నా రిచటికి. ౧౬

జగ.—అయినచో జమాబందీ యొనర్చుటకు వారు రావచ్చును కాని, యీరీతిగా సకలసేనాసమేతులై రానేల?

విజ.—ధిషణాసముద్రుఁడ వగునీవు సమయమునకు మంచియుపాయముఁ దోఁపింపఁ జేసితివి. సకలసేనాపరివృతు లగునీదొరలసాయముం గొని నాయభీప్సితము నెఱవేర్చికొనియెదఁ గాక!

ఉ. మోదముమీఱ నెక్కుడుచమూతతితోఁ జనుదెంచుచున్న యీ
హైదరుజంగుముఖ్యయవనాదుల నారసి తోడుగొంచునన్

వేదనఁ బెట్టుచున్న యవినీతుల సంగరరంగమందు వి
చ్ఛేదము సేయువాఁడ నిఁకఁ జింతిల నేటికి? మంత్రిసత్తమా!

జగ.—దేవా! అప్రతిమానబుద్ధివిశేషభాసురులగు దేవరయాలోచన దుర్గ్రాహ్యంబే, కాని, యకారణముగ బొబ్బిలివారితోఁ గయ్యముఁ దెచ్చిపెట్టుకొనుట కాపరాసువా రంగీకరింతురో, లేదో, యనిమాత్రము సందేహించుచున్నాను.

విజ.—మంత్రీ! ఆవిచారణ మంత మాననీయము కాదు. ఏమంటివా! "ధనమూల మిదం జగత్" అనియున్న దేకనుక వారి కింతరొక్కముఁ గ్రుమ్మరించినచో సర్వకార్యమ్ములును సానుకూలమ్ములగును.

జగ.—ఆతురకవాని నాశాసముద్రమున ముంచనగును కాని, ప్రాజ్ఞతావిశేషముగలయాపరాసువాని నేమిసేయనగును? అది దుస్సాధమేమో కదా!

విజ.—అమాత్యవర్యా! ఎంతెంతటివారిబుద్ధివిశేషంబులుఁగూడ మనకు దురూహంబులు కావు. ఇం దొక్కవిశేషము కల దాకర్ణింపుము.

తే. గీ. సత్యసంధు నొగి నసత్యసంధుఁ జేయు
ననృతశీలుని సత్యసంధునిగఁ జేయుఁ
జెలిఁ బగతుఁ జేయుఁ బగతునిఁ జెలిఁ బొనర్చు
ధనము సేయని దేది? యీధరణియందు. ౧౯

జగ.—ఏలినవా రానతిచ్చినది నిశ్చయమే కాని, మనము లంచ మిచ్చిన మాట బొబ్బిలివారికిఁ దెలిసి, వారుకూడ నేమేని యొసంగెద మని చెప్పినచో, నీదొరలే మనల వంచింతురేమో? అట్లైన కార్యము మఱింత దుర్ఘట మగునుజుఁడీ!

విజ.—మనపక్షము వీరు పూనియున్న వారనియెట్లు తెలియనయ్యెడిని? తెయుఁగాక! తొలుత మనవాగ్జాలమునం దగుల్కొని మనకార్య మొనరింతు" మని ప్రతినఁ బూనినవారు ప్రతిపక్షకార్య మెన్నఁటికిని పూనఁజాలరు. మఱియు,—

మ. ధన మొక్కించుక యిచ్చి "మద్రిపుల నుద్ఘాటించి తద్రా
జ్యమున్ । గొని నాకిచ్చినతత్క్షణమ్మ కయిఁ జేకూర్తున్
ధన మ్మెంతయో" । యని యాశాజలరాశి వారి దిగఁ
ద్రోయన్ దప్పకుండంగ నా । పని సర్వమ్మును సానుకూల
మగు లేవన్ జేయ రే యాదొరల్. ౨౦

దొరగారీపాటికిఁ గచ్చేరీ తీర్చియుందురు. వారికొఱకై తెచ్చినసామగ్రి యంతయు వారి కంపియున్నావుకదా! ఇంకను మనము వారలదరి కేఁగుట కేల యోజింపవలయును?

జగ.—దేవరా! వారిసావకాశ సమయముఁ దెలిసికొని రమ్మని మనసేవకు నటకంపియున్నాను. వాఁడు వార్త తెచ్చినతోడనే తమ రచటికి దయచేయ వచ్చును.

వెంకారెడ్డి.—(ప్రవేశించి) భూలోకదేవేంద్రా! విజయోఽస్తు. విజయోఽస్తు. తాము వచ్చి దొరగారిదర్శన మభిలషించుచున్నా రని హైదరుజంగుబహద్దరువారితో మనవిసేయఁగా దొరగారు కచ్చేరీ తీర్చియున్నారనియు, ఇది మంచి సమయ మనియు, వైళంబ తా మచ్చోటికి విచ్చేయవలయు ననియు సెలవిచ్చియున్నారు.

జ.—మంత్రివరా! ఇదియే కడు మంచితరుణమఁట! రమ్ము వారిని సందర్శింపఁబోవుదము.

(నిష్క్రమించుచున్నారు.)

రంగము-కచ్చేరి.

[బూసిదొర, హైదరుజంగు, నాగోజీరావును కూర్చుండి ప్రవేశింతురు.]

బూసిదొర.—హైదరూ! ఈవేఁడిపోట్లు నెన్నినాళ్లిట్లేఁక మనము పయనము సాగింపవలయు? నీ వేల పోయి జమాబందీపనులను కొఱఁత లేకుండఁజేసికొని రారాదు?

హైద.—దొర్గారూ! హంది లష్కర్ గిష్కర్ హింఖ హిడ్డానించి ఛల్నేకు హరాము హన్ని దేశాల్ రాజోంకు ఛేట్కి హిడ్డాకి అవ్ తాఖీదుల్ పంపేమ్; మన్ము హిడ్డానించి ఖదల్ డాన్కి జర్గుర్ కూచ్ బీనై.

బూసి.—ఎవరెవరికి తాఖీదు లంపియున్నావు? ఎవరెవరు వచ్చిరి?

హైద.—నాగోజీసాబ్! ధొర్గార్కి హంతా హిత్రం హిత్రం సేసి బొ

నాగో.—చిత్తము (కాగితము చూచి) పిఠాపురము, ఖాసింకోట, కిమిడి, నారాయణపట్టణము, సత్యవరము, విజయనగరము మొదలగు జమీనుల రాజులందఱకును ఎవరెవ రెంతంత పేష్కషు చెల్లింపవలయునో వివరము వ్రాయుచు, తాఖీదు లంపియున్నాము. అందఱును వచ్చి తామీయవలసిన పైకము చెల్లించి రసీదు లందియున్నారు. విజయనగరము వారు స్వయముగ దయచేసియున్నారు.

బూసి.—వారేల తమకప్పము చెల్లింపక జాగొనరించినారు?

నాగో.—వారు తమకష్టనష్టములఁగూర్చి తమతో స్వయముగ ముచటింప సెలవందియున్నారు.

హుస్సేను.—(ప్రవేశించి) హుజూర్! యిజ్యనగ్రదేశాంమే యేల్తా రాజా హుందీలేదూ! హోదూ దర్శనాన్కి ఆయా మన్వి సెయ్ బోల్తాడ్.

బూసి.—వారిని లోనికి రమ్మనుము. (హుస్సేను నిష్క్రమించును.)

విజయరామరాజు.—(ప్రవేశించి తనలో) కారుమబ్బులఁ దలపించునల్లని బిఱుసుగడ్డములుగల యాకఱుతురకయే హైదరుజంగు కావచ్చు—ఈతఁడే బూసిదొర యయి యుండనోపు-(పైకి) సలాము మూసాబూసిదొరవారికి.

బూసి.—సలాము విజయనగరపు జెకిమీనికి.

విజ.—సలాము హైదరుజంగు బహద్దరువారికి.

హైద.—సలామాలేఖుమ్ రాజాజీ! తుంబీ ఆతఖ్తూఫర్ బైఠో.

విజ.—సాహాబులు చెప్పినట్లు చేసెదను. (ఆసీనుఁడగును.)

బూసి.—ఏమోయి ఱేఁడా! ఎందుచేత మీదగ్గఱనుండి పంద్రెండేండ్లు పేష్కషు చెల్లక యున్నది? ఇప్పుడేని దెచ్చితివేమో ముందుగఁ జెల్లింపుము.

విజ.—పరాసుసార్వభౌమా! పేష్కసున కేమి? అంతయు నొకతృటిలోనే చెల్లించెదను కాని,

హైద.—హేంమియ్యా! ఖానీ యేఘానీ సెప్తాది ఘుద్ధు ధాటి హేంతా ధిన్ము హైంది హింకా యెన్కాయేసి కూర్చున్నావ్ క్యాబోల్తావ్.

విజ.—దేవా! పంటకారులు పండక ప్రజల కమితనష్ట మాపాదించుచుండుటచేతను, మాచుట్టుంగల పాళెగాండ్రొనరించెడి యక్రమంపుటల్లరులచేతను ఇంతయాలస్య మైనది. ఇఁకముందు సక్రమముగనే చెల్లింపఁగలవాఁడను.

హైద.—మాఖీ సర్కార్ హిఙ్ఖా హుకుం నీఖీ మాలుమ్వోయ్.

గేయము. యెవ్రెవ్రూ పేస్కాస్ హివ్కాపోతార్ మాఖీ
హళ్లాళ్కిపట్కోని సంపెయ్యాడం, హళ్కి సంపెయ్యాడమ్,
యెవ్వెవ్రూ గడ్బడ్మే హేప్గ్రా సేస్తుంటాడో
యేఆద్మీపీఖాకీ నర్కొయ్యాడం, ఆడ్కినర్కొయ్యాడమ్,

లూటీలు సేసేటిఝూటాకోర్లందర్ని
యేటేటు కొక్కణ్ణి యేసెయ్యాడం, ఆడ్కి యేసెయ్యాడమ్,
మామాట లచ్ఛెమ్మె సెయ్కున్న రాజాల్కి
మాదెబ్బా సూపించి మాటెయ్యాడం, ఆడ్కి మాటెయ్యాడమ్.

విజ.—మీ కంతటియధికారము కలదని మాకిదివఱకు తెలియకపోలేదు కాని మీ రారీతిఁ జేయుచుండుట లేదనిమాత్రమే నెఱుఁగుదును మీపాళెగాఁడు మారాజ్యమందల్లరులు చేయించి మాఁకహితు లీయవలసి నపన్ను మాకు రాకుండఁజేయుటచేఁగదా! మీకప్పము చెల్లింప నింత తడవైనది. వారే మాకుఁ గ్రమరీతిని పైకము చెల్లించుచుండినచో నేను మాత్రమేల మీకుఁ గొదవఁ బెట్టియుందును?

హైద.—హేం రాజాజీ! మీది సిస్తు హెవ్డూ రాకుండా సేస్తాడ్ హోడ్కీమ్దిక్కి నీవు కైకూ లడాయ్‌కి మొర్గి సాఫ్‌సఫాయ్ సెయ్‌వూ?

హుస్సేను.—(ప్రవేశించి) ధొర్గార్కి టిఫెన్ తైమ్ హైంది. హఖ్డాఖి దయ్ సెయ్యాలా మన్వి.

బూసీ.—హైదరూ! ఈయొకవిూనిలగ్గస్తులఁ గనుఁగొనుము. నేనుఁగూడ నిప్పుడే వచ్చెదను. (హుస్సేనుసహితముగ నిష్క్రమించును.)

విజ.—సాయేబుగారూ! వెనుక షేరుమహమ్మదుఖానువారు దయచేసి బొబ్బిలివారిపౌరుషమునకు మెచ్చి వారికి రాజాము జాగీరుగ నొసఁగి యున్నారుకదా! నాఁటినుండియు వారు కన్నుగానక సంచరించు చున్నారు. మారాజ్యమునం దెల్లపు డల్లరులఁ జేయుచునేయుందురు.

హైద.—హది యిఖ్డూ మాఖీ హెంన్కు హయ్యా! ధాన్కి ధీన్కి హేంటి హుంది. నీది సెల్లించ్వాలా పేష్కస్‌మాటా హేంటి సెప్తావ్?

విజ.—అయ్యా! చెప్పుట కేమున్నది?

హైదరుజంగుసాయేబుగారూ! ఆ బొబ్బిలివారు మిమ్ములను సరకు చేయరు. మీరు చేయుదస్తులోనికి వారు రారు.

ఉ. రావుకులప్రభూతుఁడు పరాక్రమనిర్జితసర్వవైరిగ
ర్వావిలచిత్తుఁ డంచితదురాగ్రహదుర్మదదోర్బలుండు తద్
భూవిభుఁడెంతధన్యుఁడో! మిముఁగనయితమ్మునుబూరికింగొనం
డావల నేమిచెప్ప యవనాధిప! వానియదృష్టసంపదన్. ౨౫

మఱియు మీరు బొబ్బిలి యనినచో సామాన్యముగా నూహించు చున్నారు కాఁబోలును? అట్లెంతమాత్ర మెంచఁజనదు.

హైద.—క్యా రాజా! మీదీ భారత్ కితాబ్ మే పాంఢ్వాసాబ్ బీబీ హుందీ లేవ్; దాంది మొగ్డూ బీమ్డూ హోడూ; హోడ్డిఖంటే సత్వా హెక్వా హైతుంది హోయ్; మీదీ సెప్తావ్; భొబ్లీరాజాఖి;

విజ.-అదిగో! ఆభీమునంతటివాఁడే వాండ్రలోఁగూడ నొక్కఁ డున్నాఁడు.

హైద.—హోడ్డీనామ్ బోలో!

విజ.—అతనిపేరు తాండ్రపాపారాయఁడు. వానిపేరు వినినచోఁ బరిపంథి రాజగజంబులకు సింహస్వప్నమే?

శా. అద్రుల్ తల్లడిలున్ గజవ్రజము హాహాకారముల్ సేయు, మేల్
భద్రాశ్వమ్ములు భీతి హేష లిడుఁ, గంపమ్మందు భూచక్రము
త్క్షుద్రాహంకృతి వీడు వైరితతి, సంక్షోభించుఁ దారాపథ
మ్ముద్రిక్తాగ్రహుఁడైనపాపయకుధాహుంకారముల్విన్నచోన్

హైద.—హారే! తాండ్రాపాపా పేరూ సెప్తావ్! భొబ్లీహోడీదగ్గ్రా హింకా యెవ్డూయెవ్డూ వున్నాడ్ బోలోమియ్యా!

విజ.—మీ రడుగుచున్నారు కావునఁ జెప్పుచుండుట భావ్యము కాదు. ఆ రంగావనీపాలకుం డన్నచో సామాన్యుండు కాఁడు.

ఉ. భండనభీముఁ డార్తజనవత్సలుఁ డంచితసాహసాహవ్రో
ద్దండపరాక్రముండు రిపుతండధరాధరకాండఖండనా

ఖండలుఁ డెల్లలోకము ముఖాముఖి గెల్వఁగఁ జాలురాజమా
ర్తండుఁడురంగరాణ్ణృపశశాంకుఁడు హైదరుజంగుసాయెబా!

హైద.—హంతా బడావస్తాద్ బిడ్డా హుందీ వోయ్ రంగ్రావ్ ! మాదీ హుందీ లేవ్ సిద్దీబిలావ్ ! హాడిక్ హెక్వాసత్వా హోయ్ వీడూ !

విజ.—అయ్యా ! అతనిబలపరాక్రమంబులు మీర లేమి యెఱుంగుదురు ?

క. బీరము, శౌర్యము, ధీరత,
యారూఢిగఁ బిన్ననాఁట నతనికి దాదుల్
క్షీరములఁ గూర్చి యిచ్చిరి,
గారవమున లేకయున్నఁ గలుగునె యిట్టుల్ ? ౨౮

హైద.—హింకా హాఙ్డా యెవ్వడాయెవ్వడా హుస్నాడ్ బోలో !

విజ.—(తనలో) వీనికోపభూరుహబీజ మిప్పుడిప్పుడే మొలక లెత్తుచున్నది. ఇంక మద్వచనరచనాదోహదంబున దాని వృద్ధినొందించి శాఖోపశాఖలుగఁ బరిణమింపఁజేసెదఁగాక ! (ప్రకాశముగ) హైదరు జంగుసాయేబుగారూ ! ఆ బొబ్బిలిగడీయందున్న యెల్లర పరాక్రమంబులు నున్నవున్నట్లు చెప్పినచోఁ బొగడ్తగను, అసూయకలవాఁడ ననియుఁ దలంతురేమో యని సందేహించెదఁగాని,—

ఉ. రంగనృపాలసోదరుఁ డరాతిశిరస్థకిరీటభాసితో
త్తుంగమణీమరీచిపదతోయజుఁ డీఁటియ చేతఁ బూని తా
సంగరభూమి నిల్చునెడఁ జాలునె? యీపదునాల్గులోకముల్
భంగము నొందదేరిపుబలంబు భవాదృశులొక్క లెక్కయే?

హైద.—హంట్టియార్డ హోడూ యెవ్వడా వోయ్.

విజ.—ఆతనిపేరు వేంగళరాయఁడు. వారిమేనమామ యగు దామెర్ల ధర్మారాయఁ డనునొక నృపపుంగవుఁ డున్నాఁడు. వయస్సుచే నాతఁడు ముదుసలియే యైనను యుద్ధరంగమునమాత్ర మాతఁడు తరుణుఁడే.

శా. మర్మమ్ముల్ విదళించు ఖడ్గధరుఁడై మాత్సర్య మేపారఁగా
ధర్మారాయఁడొకండె యుద్ధమున నౌద్ధత్యమ్ముఁ జూపించుచు
న్మైర్మిన్నిల్చినపక్షమందు సకలోర్వీనాయకుల్గూడఁ దా
మోర్మిన్వీడి నమోనమో స్తనరె? వేయుం జెప్పనిం కేటికిన్.

హైద.—రాజామియ్యా! హెందుక్ హట్టా పిర్కిసెప్తావ్ మాఖి హింకా హాంద్లో హెవూరి హెవూరి వున్నార్; హోళ్లందర్కి బోలో.

విజ.—తురుష్కాగ్రణీ!' అందలి పరాక్రమవంతుల వేర్వేఱుగఁ జెప్పనేల ?

సీ. గబ్బిసింగపుగున్న యుబ్బు పోద్రొబ్బుబా
హాబలశాలి వేంకయ్య యొకఁడు
ఎక్కటికయ్యాన ముక్కంటినేనిఁ ద్రుం
పఁగఁ జాలునట్టిరామయ్య యొకఁడు
మత్తేభముల మదోద్వృత్తిఁ జొత్తిల మొత్తు
సాహసగుణుఁడు బుచ్చన్న యొకఁడు
గాండీవిగతి వైరికాండమ్ముఁ జెండును
ద్దండుఁ డౌనరసరాయం డొకండు

తే. గీ. మఱియు నినుగంటి నరసింహమనుజనాథుఁ
డవులఁ గాకర్లపూడి వేంకావనీశుఁ
డాదిగలజోదు లెందఱో యానృపాలు
నెపుడు సేవించుచుండెద రేమిచెప్ప ? ౩౧

ఇఁక సైనికులభంగియు, దళవాయులసంగతియుఁ జెప్పనక్కఱలేదు. దఱును నొకరికొక రీడుతివియనిపోటుమానిసులే ; వేయేటికి ?

గీ. అచటఁ బుట్టినకోమటి యైన వీరుఁ
డచట జనిఁ గన్నపసిపాపఁ డైనశూరుఁ

డచట నున్నట్టిమార్గాల మైన హారియె
వేయునేల ? తురుష్కభూవిభువరేణ్యా ! ౩౨

హైద.—హార్దీ భల్మా హుంటే మాఖీ యేం లేఖ్ హోతే మాఖీ యేం. మాఖీ నీవు సెల్లించవల్సింది పేష్‌ఖస్ మాటా హేంటి బోల్తావ్. హాడ్డీభల్మా మీదీ సత్వా మీదీమీదీ సూస్కాండి. మాఖీ క్యాజరూరత్ వోయ్.

విజ.—నేను తమతో విన్నవించుకొనియెడిది సాంతముగా విని మఱియు నన్నుఁ గప్పము సంగతి యడుగుఁడు.

హైద.—హారే సైతాణ్ పిశాసీ నీదీ గోసా సెప్పవోయ్ యింటామ్.

విజ.—మనము మనప్రభువు లగుతురుష్కులకుఁ బండ్రెండేండ్లనుండి కప్పము చెల్లింపలేదనియు, ఆసొమ్ము వసూలుచేయుటకయి నవాబుగారి పంపున మంత్రులు స్వయముగ దయచేసినా రనియు, మనల ఖేటీకి రావలసినదిగాఁ దాఖీదు లంపినారనియు, నేను వారికి వార పంపఁగా వారు నాకు మరల నంపినవార్త యిది:—

ఉ. ఎవ్వఁడు మీనవాబు మఱి యేమిది కప్పముఁ గట్టుఁడంచుమ
మ్మివ్విధిఁ బృచ్ఛ సేయుటకు నెవ్వఁడ వీవు తలంప వింతబల్
రవ్వ యిదేల? మేమయి పరాసులఖేటికిరాము మీరు పొం
డవ్వల కేము శూరుల మటంచుఁ దలంపఁగ లేవె ? భూపతీ!

హైద.—(క్రోధరక్తారుణ నేత్రుఁడై) అరే! దుర్మార్గ్ ! రంగారివ్ ! ఆజ్‌తక్ హమారాగులామ్ హోకర్; తేరే ఆంఖ్ శిర్‌ఫర్ ఛడాహువారే! క్యా! క్యా! క్యాబోలేహై! కౌన్ నవాబ్ ! అవుర్ కౌన్ హైదర్; హైరే! థోడా రహో! థోడా రహో ! ఇస్ వ త్రాంత్ హమారానబాబుజీకు బరాబర్ మాలుమ్ కరాకర్, తేరా భోబ్లీ సబ్ ఆగ్‌సే నాశ్ నహీంకరేతో మేరానామ్ హైదర్‌జంగ్ నహీంహై; క్యా! క్యా! భొబ్లీరంగ్డూ హేంటీ హేంటీ సెప్పేడ్

"నవాబ్ కోన్ ! మాదీ యిర్డూ హుంది. హార్ది ఖేటీకి మేంరాం" బోలేగా! మాదీ ఫరంగిమూకా హుంటే హాడ్కి హంత హల్లచ్చేం హుంది. మాదీ నవాబ్‌గార్కి మన్విబోలి, హాడ్డీ హుండ్లే భొబ్లిఖిల్లా హంతా భూడ్దెభుంగా సేయిస్తామ్ మాదీ తడాఖా దేఖో! హిది తుర్కహాడ్డిదెబ్బ హాడ్కి మాలుమ్‌నహీ ! మై అభీ బోల్తా!

గేయము. హీరాభొబ్లీహాడ్కి మీరంతా షూడంగ-
షారీరంతో పట్టి షాదీ హైతామ్,
ఘుండార్ ముగంలాటి తొండార్ పాపాపట్టి
ఘుండేలు సీరించి బొండా హేస్తామ్,
భగ్గూన భొబ్లీఖి హగ్గిలో పెట్టించి
భుగ్గీఖి సేయించి ఘాయుంటామ్,
హిఖ్కాడ హున్నట్టిషఖ్ఖానజీర్లాకి
ముఖ్ఖాలకి ఖోసి ముద్దాసేస్తామ్. ౩౪

విజ.—యవనసార్వభౌమా ! మీబలపరాక్రమంబు లే నెఱుంగనివి కావు కాని నాదొక్కమనవి. మీ రిప్పుడు చెప్పినచొప్పున బొబ్బిలిని జయించి యాపురమ్మున మమ్మభిషిక్తులఁ జేసినచో ఆనాఁడే నేను మీకీయవలసిన కప్పము బొబ్బిలినుండి వసూలుకావలసినదియుఁగూడ తమకు దాఖలు చేసెదను. బొబ్బిలివారి నన్ననో, తమ రూరక పొమ్మన నక్కఱలేదు. అచటికి సమీపముననే కలపాలకొండ మన్నెము వారి కొసంగవచ్చును. ఏవిధమైన చిక్కులును లేకుండనే ప్రతిసంవత్సరము మీకుఁ గప్పము వసూలగుచుండుట కిది మంచియుపాయము. మాకు వైరులుగ నుండిన బొబ్బిలివారి బాధలనుండి మమ్ముఁ దప్పించిన ట్లగును. మీకుఁ గ్రమముగఁ గప్పము వసూలగుచుండును.

హైద.—(యోజించుచు నూరకుండును.)

విజ.—(తనలో) వీఁ డిప్పుడిప్పుడే నామాయావాగురలోఁ దగుల్కొను చున్నాఁడు. వీనికి లంచ మిచ్చెద నంటినేని నాకార్యము సానుకూలము కాఁగలదు.

తే. గీ. మొదట నామాయమాటల మొలకలెత్తి
పిదప రిపువర్ణనముచేత వృద్ధిఁ గాంచి,
నట్టియీతని తీవ్రకోపావనిజము
పూచి ఫలియింప నాకోర్కె పూర్తి యగును. ౩౫

(ప్రకాశముగ) సాయేబుగారూ! ఇం దింతవిశేషముగ యోజింపఁ దగు విషయముకూడఁ గనుపట్టదు. బొబ్బిలివారికి మీ రేమయిన నపకారముఁ జేయుచున్నారా? వారియొద్దనుండి తీసికొనినదానికి బదులుగ వారి కాపాలకొండమన్నెము మరల నిచ్చుచునేయున్నారు. ఇంకిది వారి కెట్లపకార మగును? (చెవిలో) ఈబొబ్బిలి సింహాసనమున నన్నభిషిక్తులఁ జేసితిరేని యెవరికిని దెలియనీకుండ మీకుఁ బంద్రెండులక్షల రూప్యంబు లిచ్చెదను. ఆశ్రితున కీమాత్ర ముపకారము చేయుట వింత కాదు. మీయాజ్ఞలను లక్ష్యముసేయనివారలను దండించుట మీకు విధాయక కృత్యమే కాన మీ రట్లు చేసినచోఁ బయియధికారులుకూడ నోరు మెదల్పఁజాలరు, నా కత్యంతోపకారము చేసినట్లగును.

హైద.—(సంతసముతో) రాజాజీ! నీవు మాఖీ యిస్తావ్ బోల్తా బారాలాక్ రుపియాఁ హిఁ హిఫ్డా నగ్దూ యిస్తావ్ లేక్‌పోతే మంచిసావ్ కారమే జామిన్ యిస్తావ్ బోలో! మైబోల్తా; తుమ్‌కూ హాభొబ్లీమే తఖ్తూ హుందీశేవ్ సింగాసన్! ధానికి నీఖీ యెక్కిస్తావ్! మఱి మాదీ సేస్తావ్‌పని బోల్తా యిను.

పంచచామరము.

లడాయిలోన భొబ్లిహాణ్ణి లఛ్ఛ్మసెయ్యకుండనా
గడీని హడ్విహడ్వి సేసి ఖాల్చి భూడ్దె సేస్తమేం

బడాయినై గడీని నీఖు పట్ము ఖట్టుతాము దేఖ్
బడాజిసాబు! క్యాబి బోల్త! పర్వనై తు బోలొ బోల్.

విజ.—చెప్పుట కేమున్నది? మే మెన్నఁడేని యొక్కమాటవారమే కాని యిన్నిమాటల వారము కాము.

ఉ. ఆర్తజనప్రసన్నుఁ డగునాహరిపాదము లాన; మీర లా
మార్తురఁ గెల్చి యాపురము మాకు నొసంగిన యాక్షణంబ
చే! కూర్తును మీధన మ్మవని క్రుంగిన విష్ణుపథమ్ము వంగినన్
ధూర్తతకాదు మీయెదుటఁ దొల్లివచించిన దెల్ల హైదరూ!

మీకు నామాటలయం దొకవేళ నమ్మకము తగులకపోయినచోఁ గొంత రొక్కము ప్రస్తుత మిచ్చెద. మిగిలినది మాకు బొబ్బిలి యభిషేకము జరిగినప్పు డొసంగెదను. మఱి మీరు మాకు బొబ్బిలి యొసంగెద మన్నందుల కేమిజామీను!

హైద.—హిజ్యారాజా! మాదీ నవాబ్‌వంశమ్మే యేక్ ఠీక్‌బాత్ బోల్తా; బద్మాష్‌మాటా మాఖీ సంపేక్నా రాదు. మాదీ పమ్మాణం దైభం మీదయేసి నీతుయం సెస్తామ్.

క. వొఖిశే బాత్ మై బోల్తా,
నఖొ జూటాబాతు మాఖి నాదీబాత్ స
ఛ్ఛ ఖోదా సాచ్ఛిగ దేఖ్ మా,
ది ఖొరాన్ సాచ్ఛిగ యినండి దీన్‌రాజాజీ. ౩౬

గేయము. హల్లా దైభం మాఖీ హవ్తారం హైనార్
హారు సూస్తార్ మేము హంటాం ధీన్ని
ఖిల్లాభొబ్లీ సాబ్‌సే గిర్గిర్గిర్ కొట్టేసి
ఖేల్‌కర్తా! హాభొబ్లి మీఖీ యిస్తామ్

మళ్లీ బద్మాష్ మాటా మాఖీ బోల్తా నహీ
మామాట నిశ్చయం మారాజ్ సునో
హిల్లిద్గో కైజార్మే యేస్కొని సెప్తామ్
యీరాభొబ్లీ మిాఖీ హిచ్చీ యేస్తామ్. ౩౯

ఖరార్ ఖరార్ ఖరార్.

మాదీ కైజార్ పట్టి నిశ్చయం సెప్తామ్ మాఖీ భొబ్లీఖి కొట్టి మిాఖీ యిచ్చిదేస్తామ్. ఝూటాబాత్ నహీ (చూచుట నటించి) హల్లర్గో! బూసీదొర్గార్ హిక్డాకి హాతాహైతున్నార్ హార్త్రోటి హిది మొర్గి లడాయీకి మేరా సిబ్బంది తయ్యార్ సెయ్‌వాలా.

బూసిదొర.—(ప్రవేశించి) సాయెబా! ఈపుడమిాఁదు మన కీయవల యుకప్పమునుగుఱించి యేమి చెప్పియున్నాఁడు?

హైద.—సర్కార్! హిజ్యారాజా బోల్తావ్ మాదీ బూమ్లూ గీమ్లూ మే అచ్ఛా పంట నహీ! హప్పటికి మాదీ ఖిప్పం మాం ఖట్వాలా హుందీ హంటే, భొబ్లీ హేల్తా హుండ్లే బడేవస్తాద్ గంగ్రావ్! హాడూ వచ్చి మాదీ శిస్తు దస్తూ ఖానిద్దు హాడూ బడా పొరుస్సాలీమే హున్నాడ్ అంటాడ్ సాబ్.

బూసి.—బొబ్బిలివారీయవలసినపన్ను చెల్లకపోయిన మానెఁగాక! తానీయవలసినకప్ప మేల చెల్లింపఁగూడదు? ఆబొబ్బిలికి మనమే వేఱుగ కబురంపి పన్ను వసూలు చేయుదము.

హైద.—భొబ్లీహాడూ హాడ్డీ సామ్కు హివాకి పోద్దం ఖాక, హిజ్యనగ్ర దేవంమే ఫితూరీ మొర్గి రైతుహాళ్లూవుండ్లే హాళ్కి సెప్పి హారాజాఖీ సామ్కు హైవనూల్ సేస్తాడ్! మతి మంది భేటీకి ఆవ్‌మే మన్కు ఖబ్రూ సేస్తే హాడూ హాల్లచ్ఛం సెప్పి హిక్డాకి ఆతాహై! హిజ్యారాజా ఖబ్రూ సేస్తే ఆడూ బోల్తా "అరే! కోన్ రే బూసీ! కోన్ రే హై

దర్! హాళ్లధగ్రాకి మాం కైకూ ఆతా? హాళ్కి జర్గుర్తే హుంటే హాళ్కి రమ్మన్" అంటాడ్ సాబ్!

బూసి.—అయినచో దీనినిగుఱించి నీవేమి యోజించుచుంటివి?

హైద.—సర్కార్! నాఖీ హాక్టీ తోస్తాహుంది; యీహిజ్యారాజాఖి లష్కర్ గిమ్కర్‌మే భలే ఘోష్టి హుంది. యిది హాహాంమే మన్కు తీస్కొని, భొబ్లి పోయి హాడ్డి ఖొట్టి యీడ్కి హిస్తే, యిత్‌గాడూ బోల్తా భొబ్లీమిాదా రావాల్సింది హిజ్యనగ్రంమే రావాల్సింది హంతా పేష్కస్ మాఖీ యిస్తావ్ బోల్తా హాభొబ్లీరాజాఖి పాలొక్కండమన్నెష్టే జావ్ హుకుం దేదియ్యా భొబ్లీహాడూ మన్కి హాల్లచ్ఛం సెప్పి హుజార్‌భేటీకి ఆతాహై హాండ్కి హెట్లాగా 'హాణ్డీ ఖొట్కి తప్పు హీరాజాహాహాంమే మన్కు భొబ్లి ఖొట్కపోతే మన్కి సాలా సిబ్బంది మర్గయా హైతుంది. (చెవిలో రహస్యముగ) యీహిజ్యనగ్రం హాడూ హాభొబ్లీహాడూ యిద్రూ హేకం హై మన్మిద్కి లట్ పట్ కీ సెస్తే మన్కి సాలా ఖిష్టం హైతుంది. హీళ్లయిద్దర్కి లోపల్ జట్టీల్మే హున్నాయ్ హాయ్యి మన్కి సాలా వుపయోగం. హంతాసామ్కు హాక్టేసారి నబాబ్‌హారీఖజానామె మన్కు సెల్లిస్తే మన్కి సాలాన జ్రానా యిస్తార్

బూసి.—(ఆలోచించి) సరియే ముందుగ నాబొబ్బిలిరంగారాయని మమ్ముఁ గనిమికోటమకాములోఁ గలసికొనవలసిన దని కబురంపుము.

హైద.—యేళ్ని హార్ది హుకుమ్. (తెరపడును.)

శ్రీ రస్తు.

ఓంనమో మార్తాండగురుపరబ్రహ్మణే.

శూర బొబ్బిలి

ద్వితీయాంకము.

రంగము-రంగారాయనికొలువుకూటము.

[రంగారావు, వేంగళరావు, ధర్మారావు, వేంకయ్య, బుచ్చన్న-యుందురు.]

రంగా.—మామా! ఇంక వివాహముహూర్తము పదిదినము లున్నదికదా! మీ రిట్లుపేక్షించినచో నప్పుడు కార్యము మఱింత కష్టముగ నుండునే! వారుగూరివా రుండుట కెచ్చటెచ్చట విడిదు లేర్పఱిచినారు?

ధర్మా.—వారి కనుకూల మగు తెఱఁగునఁ గొందఱకు ధర్మసత్రంబునను, మఱికొందఱకు సంస్కృతపాఠశాలయందును, ఇంకఁగొందఱకు వేదాధ్యయనమందిరంబునను బస లేర్పాటు గావింపనెంచితి. అవి చాలక పోయినచో గోపాలస్వామివారియాలయముకూడ విడిదిచేయుదును.

రంగా.—దమ్మయ్యగారూ! నా కదేమికారణముననో కాని, ఇది యంత యుత్సాహజనకముగ నుండక మఱియొకమాదిరిగ నున్నది. నామనమది యేమో కీడునే శంకించుచున్నది. మన మెవ్వరి కేదేని యపకారము చేసియుండముకదా!

ఉ. పెద్దల భక్తిఁ గన్గొననొ? పిన్నలఁ గూరిమిఁ జూడనో? హరిన్
దద్దయుఁ గొల్వనో? ఖలుల దండనవెట్టనొ? భూసురావళిన్
గొద్దిగఁ జూచినాఁడనొ? యనుంగులనోమనొ? ఎందుచేత ని
ట్లుద్దవిడిన్ దపించెడి నయో! హృదయంబు ప్రతిక్షణంబహా!

ధర్మా.—గోపాలకృష్ణా! ఈ వివాహప్రయత్నముల యలజడిచే నీమన మిట్లు తొందరపడుచున్నది కాని యొండేమియుఁ గాదు. ఇంతకును నీ వెవ రెఱుఁగనిపనిఁ జేసితివి? ఇంచుక విశ్రాంతిఁ జెందిన సర్వము కుదుటఁ బడఁగలదు.

రంగా.—మామా! కారణ మేమయి యుండునో తెలియదు కాని.—

క. వామాక్షి మాటిమాటికి
నేమో యదురం దొడంగె నేయశుభముల
య్యో! మూఁడునొ? బొబ్బిలిపురి
కేమేనియు వన్నె చెడునొ? ఎటు లెఱుఁగ నగున్? ౨

మఱియు హృదయము గందరగోళ పడుటతోఁబాటు వామాక్షి యశుభము సూచించుచున్నది. ఒకవేళ నాకుఁ గీడు మూఁడినచో నా యీముద్దులతమ్ముని నెవ్వ రాదరింతురు?

వేంగ.—అన్నయ్య దొరా! ఇట్లధీరాలాపము లాడెద రేల? ఇది ధీరగుణ మగునే?

మ. జనముల్ భీతిల సర్వలోకములు నాశంబైన వారాసు లె
ల్లను నొక్కుమ్మడి నింకిపోయినను లీలన్ దారకల్ డుల్లి యా
యినచంద్రుల గతితప్పినన్ బృథివిలో నేమైన శ్రీరంగరాడ్
జనపాలాగ్రణి కాలిగోటికయినన్ శంకింపఁగా నేటికిన్? ౩

సేవకుఁడు.—(ప్రవేశించి) మహారాజా! చామర్లకోటనుండి యొకచారుఁడు వచ్చి దేవరదర్శన మభిలషించుచున్నాఁడు.

రంగా.—నిరాటంకముగఁ బ్రవేశపెట్టుము. (సేవకుఁడు నిష్క్రమించును.)

చారుఁడు.—(ప్రవేశించి) దేవా! విజయ మగుఁగాక! మొన్నటిదినమున శీలాద్రి రాయనింగారిని దమభేటీకి రమ్మని పరాసులయొద్దనుండి వార్త రాఁగా వారు రాజమహేంద్రవరము దయచేసిరి. అందేమి విశేషములఁ గనిపెట్టియున్నారో నాకుఁ దెలియదు కాని, వారక్కడనుండి వచ్చి

తమ కలిత్వరితమ్ముగ నీకమ్మ నందిమ్మని చెప్పి నన్నంపియున్నారు. ఇదే వారనిచ్చినజాబు. (కమ్మనిచ్చుచున్నాఁడు.)

రంగా.—వెంకయ్యగారూ! ఆజాబందికొని యందేమున్నదో చదువుఁడు. ఇంతసత్వరగతి నన్నగారియొద్దనుండి జాబు వచ్చుట చూడఁగా నేదియో యవశ్యకారణ ముండితీఱవలయును.

వేంక.—(జాబందికొని చదువును.) "శ్రీమద్గోపాల చరణారవింద సేవామకరంద బంభరాయమాణ మానసులును, శ్రీపద్మనాయక వంశనాయకమణులును అగు శ్రీరావు గోపాలకృష్ణ రంగారావుబహద్దరువారికి:— అన్న నీలాద్రిరాయఁ డాశీర్వచన పురస్సరంబుగ వ్రాయులేఖార్థములు.

ఈనడుమ జమాబందీ యొనరించుటకయి, నవాబుగారిచే నియమితుండయిన బూసిదొర వచ్చి రాజమహేంద్రవరంబున విడిసియున్నాఁ డని నీవును వినియేయుందువు!

రంగా.—అగును. ఆ బూసిదొర భేటీకి పోవలయు ననియు, పోయి మన కష్టసుఖములు చెప్పి మన మీవలయు కప్పము మాపుచేయించుకొందమనియు, వారు మాపుచేయనిచోఁ గొలఁదిసేనలతో నున్నవారలతో యుద్ధము సేయుట సుకరము కనుక సమరము చేయ మనలఁగూడ రమ్మనియు మొన్న విజయరామరాజు కబురంపియున్నాఁడు. అదియుఁగాక మనలను దమభేటీకి రమ్మని యీనడుమ వార్తఁగూడ నంపియున్నారు. ఆబూసియే యీబూసి కాఁబోలును? సరియే! ఆ పయి సంగతులఁ జదువుఁడు.

వెంక.—"పరంగివా రమితసైన్యముతో వచ్చియున్నా రని విని మీసహజవిరోధి యగు విజయరామరాజు కొంతపరివారముతో రాజమహేంద్రవరమున విడిసియున్న బూసిదొరను దర్శించి యాతనిమంత్రియు దుర్నీతివర్తినుండును లంచగొండియు నగు హైదరుజంగును గలసికొని వారల కేమిదుర్మంత్రములు బోధించినాఁడో కాని,—

వేంగ.—(కోపముతో) ఔరౌరా! రాజకులార్ణవబడబానలమా! పిఱికి పందా! మీవంశమ్మునకెల్ల నపయశోదాయకం బగుపనిఁ జేసితివి కదరా?

క. మాపై ననికి వెడలలే
కీపగిదిని తురకఁ జేరి యెటొ కొండియముల్
వే పలికి వాని నిట్టులు
మాపయి కెత్తింపఁ జూతె? మానవపశువా! ౪

నీవు వేయేండ్లు తలక్రిందుగఁ దపస్సు చేసినను, మఱికొన్ని జన్మము లెత్తినను బొబ్బిలివారిని గెలుచుపాటి సామర్థ్యం బాతమ్మిచూలి నీ మొగంబున వ్రాయఁడురా! నీవిట్లనూయచేఁ జావక యేల గింజుకొనియెదవు?

రంగా.—తమ్మయ్యా! నిదుడుకుఁదనముచే బ్రదుకఁజాలకున్నావోయి వారినిఁ బూర్ణముగా నాయుత్తరమేని చదువనీయకున్నావుగదా!

వెంక.—"బోధించినాఁడో కాని, ఆ పరాసువారందఱును మీపయిఁ గడు కోపము నూని మిమ్మెదురింప నెంచుచున్నా రనుమాట నిశ్చయము. ఆరాజేమో హైదరున కమితధనము లంచ మిచ్చెద నని పల్కెనఁట! ఆతురకయు బొబ్బిలి గెల్చి వాని కిచ్చెద నని కత్తిఁ గొట్టి ప్రమాణము చేసినట్లు తెలియవచ్చినది."

రంగా.—తమ్ముఁడా! వేంగళరాయఁడా! సదస్యులారా!

శా. బద్ధస్పర్ధకదాత్ముఁ డావిజయభూపాలుండు మాపైని తోఁ
గ్రుద్ధత్వాంచితమానసుం డగుటచేఁ గొండెమ్ములం జెప్ప స
న్నద్ధంబౌ నిజవాహినిం గొనుచు నన్యాయమ్ముగా నీదొరల్
సిద్ధమ్మైయని సేయ నెంచిరఁట! ఇస్సీ! వింటిరే వింతలన్. ౫

వేంగ.—అన్నయ్యగారూ! అన్నిఁటి కేమిగాని,—

ఉ. పౌరుషశాలు లీవెలమవారని లెస్సనెఱింగియున్న భూ
దారుఁడు రామరాజెటులు తా మనపై నని సేయ నెంచెనో
యారయరాదు మున్ను తనకైనపరాభవనామకాగ్ని చ
ల్లారెనొ? బొండెదత్ప్రతిఫలమ్ముగ నీగతి సేయనెంచెనో? ౬

రంగా.—ఏమీ! మనప్రతిపక్షుఁ డగువానిమాయమాటలు విని సత్యాసత్యములు విమర్శింపక యాశూరులు మనపై నుద్రేకింపనెంచిరో? వారల బలంబులబలంబులు విని యీరంగారాయఁడు భీతిపడు నని యెంచిరి కాఁబోలును? పోలు!

చ జనములు భీతిఁ జెందఁగ రసాతలవారిధు లేకమైనఁ గ్ర
న్నన సతి తమ్ములాప్తులు వినాశము నొందిననైన సద్యశో
ధను లగు రావువంశజులు ధర్మవిరుద్ధము లైనకార్యముల్
కనిసహియింతు రేయుసురు కంఠమునంగలయంతకాలమున్.

బుచ్చ.—ఆవిజయరామరాజు మనలఁగూడఁ దన్నుంబోలె భీరువు లని యూహించి యుంటచే నిట్లు చేసియుండును. కానిచో నిట్టి పిఱికిపని సేయునా!

మ. బలవంతుం డగునేని శత్రువులఁ గూల్పన్వచ్చుఁ గాదేని వా
రలతో మిత్రత నుండవచ్చు ఋజుమార్గస్థితులుండంగ నీ
కులవిధ్వంసకరుండు వారలను గన్గోఁబోయి మాపైన ని
ట్టులుకొండెమ్ములువల్క నేమిటికిదుష్టుండా ప్తమాత్సర్యుఁడై

రంగా.—ఎట్లుగా దైవము నిర్ణయించియున్నాఁడో అట్లు కాకమానదు కదా!

శా. కానిమ్మేటికిఁ గాదనన్వలయు? సంగ్రామమ్మునన్ వైరిరా
ణ్ణానాశస్త్రవితాననైపుణియు మన్నైజపుణ్యముం గానన్నా

నానాఁడావిజయప్రభుండు మదియాస్తోకబాహాబల
మ్మెన్నన్ లెస్సనెఱుంగఁగాఁగలఁడుసుండీ! పెక్కులిం కేటికిన్?

వెంకయ్యగారూ! ఆజాబు తుదముట్టఁ జదువుఁడు.

వేంక.—"దీనింగూర్చి మీరు బాగుగ యోజించి వలయుప్రయత్నముల నుండవలయు. ముం దేమిజరుగఁబోవునదియుఁ దెలియఁజేసెదను.

చామర్లకోట, } మీ హితాభిలాషి,
జనవరి 1757. } నీలాద్రిరాయనింగారు.

రంగా.—ఓయీ! నీ విఁకఁ జామర్లకోట కరిగి అన్నయ్యదొరగారితో "మీరు కావించినమహోపకారంబు నెన్నటికిని మఱవ మనియు, సామమునఁ గార్య మెటులేని సాధించెద" మనియు మనవిసేయుము. బుచ్చన్నగారూ! ఆతనికిం దగుబహుమతు లొసఁగి సత్కరింపుఁడు.

బుచ్చ.— చారుని సంభావించి మరల ప్రవేశించును.)

రంగా.—వెంకయ్యగారూ! మీ రొకసారి పోయి బావయ్యగారిని బిలిచి కొనివచ్చెదరా! అందఱముఁగూడి కార్యము నిర్ణయింతము.

వెంక.—చిత్తము. (నిష్క్రమించును.)

రంగా.—అన్నలారా! వింటిరి కదా! అన్నగారు దయాపూర్వకముగ మన కనిచినకమ్మ. సమయము వేచి వేచి మన మందఱ మప్రమత్తుల మయి యుండి వివాహప్రయత్నము లొనరించుకొనుతఱి వలను కనిపెట్టి మనవైరి యగు విజయరామరాజెట్టియపాయముఁ దెచ్చిపెట్టినాఁడో! కృతఘ్నుకానికాయపరివృతులగు నాపరాసువారితో యుద్ధమునకే డీకొంటిమా యుద్ధాగ్నిలోఁబడి మన మెల్లరము మలమల మాఁడుదుమేమో? ఇందుల కుపాయ మేమి?

వేంక.—అన్నయ్యగారూ! మీ రేటి కిట్లాడెదరు? మీయాజ్ఞఁ బాలించుచున్న మే మందఱముఁగూడ నేమైతిమని యింత వెలితిగ యోజించు

చుంటిరి? ఆవిజయరాముఁడా హైదరుబూసులనే కాక మఱియొక వేయికోట్లమందినిఁగూడ కూర్చికొని రానిండు.

మ. వెలమల్ నానెవరంచు నెంచితిరి? దోర్వీర్యప్రతాపానల
జ్వాలనజ్వాలలసర్వలోకములు గాల్పన్ లేరె? యేనొక్కఁడన్
గలనన్ హైదరుబూసుల న్గెడపి వీఁక న్మత్ప్రతాపంబు నా
జలజాతాప్త హిమాంశుతారకముగా స్థాపించెదన్ సోదరా!

అట్టివారనేకు లుండ నిఁక విజయమునుగూర్చి శంకింప నేటికి? విజయ సూచకంబుగ రణభేరి మ్రోయించి సర్వసేనలనుసమరసన్నద్ధముగఁ జేయక యింక నీజాగేల? ఈయోజ యోజన లేల?

ఆ. వె. వెలమవారి చెంప్రవే ట్లజెంగినవాఁడు
విజయరాముఁ డొకఁడె వీరి గెలుతు
నంచు నచ్చినట్టి హైదరు బూసియు
నెఱుఁగఁగలరు వెలమయీఁటెపోటు. ౧౧

శర్మ.—అల్లుఁడా! యుద్ధము యుద్ధమని పలువరించెద వేల? అదియు నచిరకాలములో డాయనున్నదేమో కదా! సామ దాన భేదోపాయంబుల నిది చక్కఁబఱుపవలె నని ఈయెల్లరియుద్దేశ మగుచుండ నీ విట్లు యుద్ధమున కుఱికెద వేల?

వేంగ.—(ఈర్ష్యతో) మీయభిప్రాయ మెప్పుడును సామమువంకకే పెనఁగులాడు చుండును గాని యుద్ధమునకు ముందంజవేయునా? మన యెడల నింత మహాద్రోహము సేయ సమకట్టిన యానీచునియెడల సామ మనుసరింపవలెనేమి?

చ. ఎపుడు లభించుఁ గాలమని యెంచుచు వేళ లభించినంత నా
కపటనృపాలుఁడాదొరలఁ గైవసమున్ బొనరించి యిట్టులా
లపుఁబని కుద్యమించితమలష్కరుతోడ్కొని వచ్చుచుండ నె
య్యపుఁబసచూపనుంటిరిబళా! కడునబ్బురమయ్యెనియ్యెడన్

నృపాపళదుండగు నావిజయరామునిదురాలోచన విని, వల్లెయని తల యూఁచి బొబ్బిలపయి డీకొనెంచిన యాముష్కరతురుష్కాధములతో నింకను సంధి ననుసంధింపవలయునేమి?

(తెరలోఁ బాపారాయఁడు.)

శా. దండన్దండిమగండు వేంగళుఁడు ప్రోద్దండక్రియన్నాయమై
యుండన్భండనభూమిమెండుకొని యుద్ధోత్సాహమేపార బ్ర
హ్మాండమ్మెల్లను గుండపిండిగను జేయంజాలుపాపయ్య యిం
దుండన్గొండరిరామరాజునికిఁ దానూహించెనే మాపయిన్

పాపారాయఁడు.—(పటాక్షేపముగఁ దెరఁ జిమ్మికొని అగ్రహముతోఁ బరవళ్లు ద్రొక్కుచుఁ బ్రవేశించి విజయరాముఁ డెదుటనున్నట్టు లక్షించుచు.) ఓరీ ద్విపాదపశువా! విజయరామహతకా!

స్రగ్ధర

జంగున్ గింగున్ దురుష్కుల్ జతనపఱిచివె సంగరమ్మాచరింతే?
ఖంగాళీ! దుష్టచిత్తా! కలుషహృదయ! దుష్కృత్మ! తంత్రాభిలాషీ!
రంగారాయక్షితీశాగ్రణియన నెఱుఁగన్ రాదురా? మంచిదే! యే
భంగిన్ మత్ఖడ్గధారార్భటికి నిలిచెదో? వచ్చిచూతున్ దురాత్మా!

వేంగ.— బావా! చూచితివా! దురాత్ముండగు విజయరామరాజు చేయుచున్న దుస్తంత్రము! తా నందినపరాభవంబునకు చావక యెవ్వరినో బూసిదొరను, హైదరుజంగుసాహేబును దోడుకొని మనపైకి యుద్ధమునకు వెడలునాఁడఁట!

పాపా.— నిజప్రతాపానలంబునఁ బరిపంథిసేనాసాగరంబు నింకింపఁజాలుపాపారాయఁ డిందున్నాఁ డన్నమాట యావిజయరాముఁ డప్పుడే మఱచిపోయినాఁడు కాఁబోలు! తగుదుమని వారలకు బాసట రానెంచిన యాతురకలును దూదేకులును, ఇంక మఱెంతప్రదర్శితమహా

నలంబునకు శలభంబులు కాఁగలవు. ఏఁడీ! ముందాబలగర్వితుం డెం దున్నాఁడో నాకు చూపింపుఁడు. ఏనొక్కరుండన ఛురికామాత్ర సహాయుండనై వానిగర్వంబు సర్వంబు ఖర్వంబు గావించి మీకు నేత్ర పర్వం బొనరించెద

రంగా.—ఓ వీరపుంగవులారా! శాంతింపుఁడు. శాంతింపుఁడు. మీకోప మూలంబున మాయాలోచనల కంతరాయము కల్పించుచున్నారే!

క. కర్జ మెటు సేయనగునో?
తర్జనభర్జనలు సేయఁదగు నని పిలువన్
వర్జితశాంతుల రై యిటు
గర్జించుట లెస్సయే? వికాసము వలదే? ౧౯

పాపా.—బావా! బ్రాహ్మణులకువలె మాకుఁగూడ శాంతిపన్నము లుప దేశించెద వేల?

ఉ. హైదరొకండె కాదు జగమంతయు నాలము సేయవచ్చినన్
కాదన నేల? వారిబలగర్వము సర్వము రూపుమాపి భూ
మీదయి తుర్భవత్పదసమీపమునం బడవైవఁ జాలనే?
మీదయ యింతయుండిన నమేయపరాక్రమ! రంగరాణ్ణృపా!

రంగా.— బావా! వారు మనపైకి దండువెడల నున్నారనుమాటమాత్ర మేమినిశ్చయము! అక్కడఁ బ్రవర్తిల్లినసంగతి నన్నగా రెఱింగినంత వఱకు వ్రాసిపంపినారు. అంతమాత్రమున వారలకృతనిశ్చయము స్థిరీక రించుట కెట్లు వలనయ్యెడిని? మన మేమిసేయవలసినదియు నిర్ణయించి కొనుటకు నిన్నుఁ బిలువనంప నీవిట్లు కాండతాండవ మాడ మొదలిడితివి. ఇట్లుగ తొందరపడుట యుచిత మగునే?

పాపా.— బావా! విజయమగుఁగాక! అరిసేనలు మనలం దాఁకనున్న వని వినినంత జనించినయలుకచే నేనేమియో యంటిని. అందులకయి యిందలివా రెల్ల మన్నింతురుగాక:— బావా! నావలన కాఁదగు కార్య మేదియో యానతీయ వేఁడెద.—

సేవకుఁడు.— దేవా! ఎవ్వఁడో యొకతురకజవాను హైదరుజంగుదగ్గఱ నుండి దేవర కేదియో వర్తఁ దెచ్చినాఁడఁట!

రంగా.— నిరాటంకముగఁ బ్రవేశపెట్టుము.

పాపా.— బావా! విజయరాముఁ డిచ్చినలంచముచే నోరు మెదల్పఁ జాలని యాహైదరు మన కేటి కిప్పుడు వార్తనంపవలయు? ఇదియొక కృత్రిమ మేమో!

వేంక.—కానిమ్ము! ఏల కాకపోవలయును? ఏకృత్రిమము పచరించినను వారు మనల నేమి చేయఁగలరు?

ధర్మా.— వా రంపినసందేశము సాంతముగా వినినచో నంతయు మనకే తెల్లమగును.

తురకజవాను. (ప్రవేశించి) సలామ్! బొబ్బిలియేలే రంగ్రావ్ బహద్దరువారికి! మాదీ యేల్నాహోడూ హుంది బూసీధోర్! హోర్ది మీఖీ యీతాఖీ ద్ నే హిచ్చిరమ్మన్ బోలే! హిద్గో సాబ్! తాఖీద్ మే దేఖో! (తాఖీదు నొసఁగును.)

రంగా.— వెంకయ్యగారూ! దానియం దేమున్నదో చదువుఁడు.

వేంక.— (తాఖీ దందుకొని చదివి) ఘరియే; బూసిదొరగారిని స్వయముగ ఖాసింకోటము కాములోఁ గలసికొనవలసినదని తాఖీ దంపియున్నారు.

రంగా.— ఓయీ! వచ్చి వారిదర్శనము చేయుదు మని మనవిచేయుము నీవు కడుఁ మంచివానివలెఁ గన్పట్టుచున్నావు. నీకు బహుమతి యొసం గెదము. విజయరాముఁ డిప్పు డెచ్చట నున్నాఁడో చెప్పఁగలవా?

తుర.—హోడూ హిజ్యారాజామే మాదీ హైదర్ జంగ్‌తో ఖల్సి వుం టాడ్; హోరూ హంతా మంత్రాంగం షెప్తార్

రంగా.— అయినచో మీదొరలయాలోచన మేదియో తెలియునా

తుర.— మాఖీ తెల్వాద్ ఖానీ మీఖి మార్నేకు లడాయీఖి సెప్తామ్ హో శోస్న సేస్తార్ హుంది సాబ్; హోడూ హుందీ లేదూ హైదర్; హాచ్చా పుండాకోర్ బద్మాష్ వుంది. హోడ్కి రాజావాలామే బారా లాక్ రుఫియా లంఛం హిచ్నాడ్; హంతా పుఖార్.

రంగా.— బుచ్చన్నగారూ! మీ రీతని సబహుమానముగఁ బంపిరండు కర్తవ్యము నిర్ణయింతము. (బుచ్చన్న తురకసహితముగ నిష్క్రమించి తిరుగ ప్రవేశించును.)

రంగా.—అయ్యలారా! ఇప్పుడు మన కన్నయ్యదొరగా రంపినవార్తయును, బూసీదొరగా రంపినతాఖీదును వినియున్నారుకదా! ఇటుపైని మన మేమిసేయవలయును?

ధర్మా.— గోపాలకృష్ణా! దుర్ఘటమైన యిట్టిరాజకీయ వ్యవహారములు తటస్థించినపుడు మిగుల యోజించి యేదేనిఁ జేయవలయును కాని; తొందరపడి యేది చేసిన నది విషమముగ బరిణమించును. మనము బాహుబలము కలవారమే యైనను; మాయాయుద్ధకుశలు లగుపరాసువారితోఁ బోరుతఱి జయంబు మనకో ప్రత్యర్థులకో నిర్ణయింపఁజాలము అట్టియెడ నీకార్యము సామముననే చక్కఁబఱచికొనవలయును బూసీదొర వ్రాసినచొప్పున నతనిభేటీకిఁ బోయినచో సర్వము నిర్వహింపఁగల మని నాయభిప్రాయము.

వేంక.— అట్లయినచో మంచిదియే కాని; లంచగొండియగు హైదరు విజయరామునిచేఁ బ్రేరితుఁడయి మనల నేమేని యవమానపఱచునేమో?

బుచ్చ.—వెంకయ్యగారియూహ కూడ త్రోసిపుచ్చుటకు వీలులేదు. అందుచేతనే గదా! వారి తొలివర్తమానమునకు మనము రాజమహేంద్రవరమునకుఁ బోలేదు. న్యాయాన్యాయములు, యుక్తాయుక్తములు ధనైకపక్షపాతుల కుండునా?

పాపా.— (కోపముతో) ఏమేమి! నిజప్రతాపకల్పాంతాంబరచుంబిత జాజ్వల్యమాన జ్వాలాసమావృతశిఖిదంద హ్యమాన మత్తప్రతిపంథిసర్వసేనావార శుష్కేంధనుం డగురంగమహీపాలునకే యవమానమా? అట్లొనరించివాఁ డేచెఱువునీరు త్రాగఁగలఁడు?

శా. ఔరా! యెంతటిమాటలాడెదరు? నాకాధీశుఁడౌఁగాక! వి
స్ఫారోగ్రస్ఫుటబాహుదర్పవిజితప్రత్యర్థి యైనట్టి రం

గారాయప్రభుమౌళి వచ్చినను చుల్కంజేయునే? అట్టుల
వ్వారలుప్పొచినవారిప్రాణములునిల్వంజాలునే బొంబెలో॥

ధర్మా.— అంతదనుకఁ బోనేల? సామమునఁ గార్యము నిర్వహింపనెంచువారి కిది కర్తవ్యము కాదు. ముందుగ నాదొరలయొద్దకు మనము పోవలయు.

వేంక.—మీరు దొరలనుటచే జ్ఞప్తికి వచ్చినది. మనరాయనింగారినిగూర్చి విశదముగ నెఱిఁగిన కుముందరుదొరగారు మన కిప్పట్లు సాయము చేయలేరా? వారుకూడ దొరలేకదా!

రంగా.—అగును. కుముందరుదొరగారు మన కిప్పట్లు సాహాయ్యము చేసిరేని తీరుదురు. వారిదగ్గఱకు ముందుగ మనము రాయబార మంపుదమా?

వేంక.— పంపవచ్చును కాని; ఆరాయబారపువిశేషము లేమని?

ధర్మా.— ఏమున్నది? ఇచ్చటిసంగతు లన్నియు ఉన్నవున్నట్లు నివేదించి మనలనుగూర్చి బూసీదొరగారికి వ్రాసి యుద్ధమాఁపవలయునని.

రంగా.—ఇదియే కడు మంచియుపాయము. బుచ్చన్నగారూ! మీరొకసారి నమ్ముంగూర్చి శ్రమఁ దీసికొని బందరుపురమునకుం జని కుముందరుదొరగారిని జూచి మనసంగతి నివేదించి వచ్చెదరా? మరలి వచ్చుతఱి మీరు స్వయముగ బూసీదొరగారియొద్దకుఁ బోయి వాస్తవముఁ దెల్పి రండు. సర్వవిధముల యుద్ధమాఁప యత్నింపుఁడు.

బుచ్చ.—దేవా! మీసందేశముఁ గొని పోవుటచే నే నిన్నాళ్లకు ధన్యుఁడనైతిని. కుముందరుదొరగారి కాబూసీదొర స్నేహితుఁడును శిష్యప్రాయుఁడునఁట! ఇఁక సంధి పొసఁగుట కేమిలోటు?

రంగా.— ఎంతసొమ్ము వలసినను తృణప్రాయముగ నిచ్చెద మని చెప్పియెందులకును వెనుకఁదీయకుఁడు.

బుచ్చ.— చిత్తము - (నిష్క్రమించును.)

ధర్మా.— రాయబార మంపితి మని మన మిపు డేమఱి యుండఁజనదు అన్నిసన్నాహములమీఁద నుండినచో బాగుగా నుండును.

రంగా.— ఇప్పట్లఁ జేయవలసిన సన్నాహము లేమి! సేనలన్నియు సిద్ధముగనే యున్నవి కదా!

ధర్మా.— అట్లుకాదు. వారొకవేళ మనవర్తమానము చేరకమున్న బొబ్బిలి ముట్టడింప నెంచిరేని మన మానదుమం బడి ప్రగ్గవలసినవార మగుదుము. కావున కొంతసేనం దోడొసంగి పాపారాయని రాజాముకడ నుంచినచో మనకు మున్ముందు వార్త తెలియుటయేకాక వారి నచ్చటనే యడ్డగింపవచ్చును.

రంగా.— బావగారి నిపుడె విడిచిపుచ్చుటకు మన మొప్పకున్నది. శత్రుసేనామధ్యంబున వారొక్కరు.— (అర్ధోక్తిలో)

పాపా.— (తిరస్కారసూచక మగుకోపముతో)

శా. బావా! ఎంతటిమాటలాడితివి? పాపారాయఁడన్నఁ స్వతే
జోవైశ్వానరుఁ డంచు నెంచవకటా! క్షుద్రాత్ములౌ వీరిదా
లా వెన్నంగ నదెంత? రుద్రుఁడయినన్లక్ష్యమ్మె? వీక్షింతునే
నీవాజిమ్ముల తేజ మెంతటిదియో? యేలా! యిటుల్శంకిలన్?

క. దాడిఁ జనువేళ నేన
వ్వారల వడిఁ దాఁకి వారిబల మారసి వే
మారిమసంగినమచ్చున
నారిపులం జంపువాఁడ నవనీనాథా! ౧౮

రంగా.— ఇది కడు లెస్సగ నున్నది. ప్రకృత మిట్లు జరిగించి యవసర మగుతతి నిచ్చవచ్చినట్లు చేయవచ్చును. నేఁటికిఁ గొల్వు చాలింతము.

(తెర దిగును.)

[రంగము బూసిదొరడేరా]

బూసి - హైదరుజంగు - విజయరామరాజు నుందురు.

బూసి.— ఏమోయి విజయరామరాజా! అప్పుడే బొబ్బిలివారి నిందు రమ్మనికబురంపి చాలదినములైనది కాని యింకను వారిందు వచ్చినజాడఁ గానరాలేదు. నీ వనినది నిక్కమయి యుండునాయేమి?

విజ.— ఏ నెన్నఁడయిన సర్కారువారితో ననృతము మనవిసేయుదునా? మీవార్తలే దండుగలు కాని; వా రెన్నఁటికిని మీ భేటీకి రారనుమాట నిశ్చయము.

హైద.— వారూ భలేషిపాయీలుగదా! మందీభేటిక్కె వారు ఆతా హైతే భొబ్లీఖి హమ్మానం హైతుంది సాఖీ తోస్తాది. రాజాజీ తమా క్యాబోల్తావ్?

విజ.— ఎవరు చెప్పుట కేమున్నది? మీరును వచ్చుచున్నా రనువార్త వినినంతనే వారుకూడ యుద్ధసన్నద్ధు లగుచుందురు. యుద్ధరంగమున మిమ్ముల్లను గలసికొనవలయు ననియే కదా! వారియభిమతము.

బూసి.— ఓఁడా! మాటిమాటికి వాఁడు మాతోఁ గయ్యము సేయఁగలఁ డని చెప్పుచున్నావు. వాని కంతబలము కలదని నీవు దిగులుపడియెద వేమో కాని; మా కది యొకలెక్కయే! మాపొగగురిడుగొట్టములు ముట్టించినచో బొబ్బిలి యంతయు నొకనిముసములో దిబ్బయయి పోదా! నీ కింకను మాగుండుదెబ్బ తెలియదు కాఁబోలును?

విజ.— మీగుండుదెబ్బలకన్న వారియీఁటెపోటులే యెక్కుడని వారూహించుచున్నారు.

హుస్సేను.— (ప్రవేశించి) హుజూర్! మచ్లిబందర్ వుంది లేదూ! హాఁడానించి మీదీభాయీసాబ్ కుముందర్ దొర్గారిథగ్గా— కోఁరే! మార్తెన్, మార్తెన్ భాయీ ఆయా.

హైద.— (తనలో) మార్తెన్ ఆయా? హంతా ధూరంనించి కుముందర్ దోస్ హిక్డాకి పంప్డాన్కి క్యాజరూరత్? హమ్కు మాలుంనహీ! హిది యిన్నాథగ్రానించీ పేరాదిల్ హంతా లొటుక్కు లొటుక్కు ఖొటుక్కుంటా హుంది.

విజ.— (తనలో) బొబ్బిలిరాయుం డీకుముందరుదొరకుఁ గడుఁ గూర్చు స్నేహితుండు. వారలప్రేరణచే నేమేని యీమార్తెను వచ్చియుండఁడు కదా!

గీ. కటకటా! మత్ప్రియత్న భంగమ్మొనర్ప
వచ్చెఁగాఁబోలు మార్టెనుఁ డిచ్చటకును
కాకయుండిన బందరుగ్రామవాసి
యితని నిచటకుఁ బంపింప హేతువేమి? ౨౦

ఆరంగారాయని కిది తెలిసి కుముందరుదొరకు వర్తమాన మంపియుండ నోపు. ఈసందేశము వినినపిదప బూసిదొరయభిప్రాయము మార్చికొను నేమో! ఇందుల కేదేని యొకప్రతిక్రియ యాలోచింపవలయు.

బూసి.— ఏమీ! మాచెలికాఁడగుకుముందరుదొరయొద్దనుండి మార్టెను వచ్చియున్నాఁడా! వానిని లోనికి రానిమ్ము- (హైదరుతో) అయ్యా! మీగుడారములకు మీరు పొండు. మేము వారితోమాటలాడవలయును.

(హైదరు విజయరాముల నిష్క్రమణము.)

మార్టెను - బుచ్చన్నల ప్రవేశము.

మార్టెను - బుచ్చన్న.—సలామ్! బూసీదొరగారికి.

బూసి.— (సలామందుకొని) మార్టెన్! ఆకుర్చీపయిని కూరుచుండుము. నీతో వచ్చినయతనింగూర్చి నాకుఁ దెలియదు. వారి నాకుర్చీపయిని గూర్చుండఁబెట్టుము.

మార్టెను.—(ఆసీనుఁడయి) బుచ్చన్నగారూ! మీ రాకుర్చీపయిని గూరుచుండుఁడు.

బుచ్చ.— (ఆసీనుఁ డగుచున్నాఁడు.)

బూసి.— మార్టెన్! మాచెలికాఁడు కుముందరుదొరగారచ్చట సేమముగ నున్నారా? నిన్నింత తొందరగ నాయండ కంపనేల? అచ్చట మఱేమియు వింతలు లేవుకదా!

మార్టె.—కావలసినన్ని వింతలు కలవు. దొరగారు మొదలగువారందఱును సేమముగ నున్నారు. మీకీజాబిచ్చి గమ్మని నన్నంపియున్నారు.

(జాబందిచ్చును.)

బూసి.— (తీసికొని చదివికొనకయే) మమ్మటకు రమ్మని యీజాబు వారు వ్రత్తెంచినట్లు తోఁచుచున్నది. ఈజమాబందీపని అంతయు చేసికొని యక్కడకు వచ్చెద మని చెప్పుము.

మార్టె.— మిమ్ములను జూచుటకంటెను తొందరకార్య మింకను వేఱొకటి కలదు. అది యంతయు నిందు వ్రాయించినారు. ఈకమ్మఁదిలకించినచో మీకే యంతయు వెల్లడియగును.

బూసి.— (జాబు చదివి ఆశ్చర్యనిమగ్నుఁడయి) అబ్బా! ఎంత మోసము జరిగినది! ఈవిజయరాముని మాట లన్నియు నానేమో యని నమ్మి బొబ్బిలికేనిపయి దాడివెడలుటకు, మేము మందుగుండుసామాను సేకరించుచున్నాము. ఈయెకిమీనియొద్ద మిగుల లంచముఁగొని యీనక్కజిత్తులమారియగుహైదరు నాతో నెట్టుగ బొంకుచున్నాఁడు? బొబ్బిలి-విజయనగరములకుఁ గలప్రాంతపగల నీఁగ నెంచి విజయరాముఁడీమోసము చేయనెంచినాఁడో?

మార్టె.— మీరు వారివలనో నప్పుడే పడిపోయినట్లు తోఁచుచున్నది. ఆ బొబ్బిలియెకిమీని మీ రొకసారి చూచినచో వాని మంచినడత యంతయు మీకే వెల్లడియగును. వీరి నాబొబ్బిలిరాయఁ డంపియున్నాఁడు. అంతయుఁ దమతో మనవిచేయఁగలరు.

బూసి.— అయ్యా! బొబ్బిలియెకిమీఁడేల తనంత మాదగ్గఱకు వచ్చి చెప్పికొనక యిట్లు కుముందరుదొరగారిమూలమునఁ దెలియఁబఱిచినాఁడు?

బుచ్చ.— దేవా! పరాసుసార్వభౌమా! విజయరాముని మాయావాగురలో బంధింపఁబడిన మీరు తమ్మేమేని యవమానపఱతురేమో యనుభీతిచే వారు స్వయముగ రాలేదు మన్నింపవలయు. వారు తమతో మనవిచేయు మనినసందేశ మిది.

క. చిరతరమునుండి మే మీ
సరకారు గ్రహించినాము జాగీరుగ, దే

వరవారు వేఱు చూచుట
పరమాధర్మంబు బుద్ధి భావింపంగన్. ౨౧

అదియునుంగాక:—

చ. పితరులవంటివారు మముఁ బెంచినవారలు మీరె యిట్లసూ
యతవహియింప నాయమగునా? పగవారము కాముగా! భవ
న్నతమును మాళిఁదాలిచి క్రమమ్ముగ వర్తిలువారమెల్ల సం
గతులును మీకె తెల్లముగఁ గన్గొననా నొకయింత తాళినన్.

మఱియు:—

శా. మాకున్ వైరిగనున్న యావిజయరామక్ష్మావరుండేమియో
మీకున్ జెప్పినయంతమాత్రమున నెమ్మిన్ వానినమ్మంగనౌ
నా! కౌటిల్యధురీణుఁడాతఁడు మమున్ మన్నింపఁగా నొప్పున
య్యా! కామందులవారితో నెదురఁగా నాశింతురే యెప్పుడున్

బూసి.— అయినచో మీ రీయవలయు కప్పమేల చెల్లింపలేదు? ఏల యింత జాగొనరించితిరి?

బుచ్చ.— దేవా! మే మీయవలయు సొమ్మంతయుఁ దామె ముందఱ మకామునకు దయచేసినపుడు దమ్మిడియేని కొరవలేకుండ చెల్లింపఁగలవారము. పేష్కసుఁ జెల్లింపలేదని తా మిట్లు కినుకఁ బూనఁ జెల్లునా?

బూసి.— తుముందరుదొరగారు మాకెందు చాల మేలుచేసియున్నారు. వారు మాకిట్లు జాబు వ్రాసియుండకపోయినచో మే మెంతయేని కొలాలాచరించియుందుము. తుంటరియగు నా విజయరామునినుడు లగునేమో యని నమ్మి బొబ్బిలిపయి దాడివెడల నుంకించితిమి. మార్టెన్! వారింకే మేని చెప్పియున్నారా?

మార్టె.— ఏమి చెప్పుట కేమున్నది? బొబ్బిలిపయికి దండు వెడలవల దనియు, వారు చాల మంచివా రనియు, ఇది యంతయు విజయరాముని పన్నుగడ యనియును చెప్పుమనినారు.

బూసి— మార్టెన్! నీవు వెంటనే పోయి దొరగారితో "మే మొనరించిన దంతయుఁ దప్పనియు, మీరంపినకమ్మఁ దిలకించి దాడివెడల మానితి మనియు నుడువుము. నే నొకవేళ బొబ్బిలి కేఁగినను జమాబందీకయి వెడలెదను కాని యని చేయను. హైదర్జను జీవాట్లు వైచి ఘంద లించెద"నని చెప్పుము. బుచ్చన్నగారూ! మీరుకూడ మీ రాయనియొద్ద కరిగి యని మానితి మని చెప్పుఁడు. మిమ్మింత కలవరపఱచినందులకయి మమ్ము మన్నింపవలయు ననుఁడు. ఇంకెందు మసలక వడిఁ బోండు. వెంటనే కప్పముమాత్రము చెల్లింపుఁడు.

బుచ్చ.— చిత్తము మా కిదియే వరప్రసాదము. (మార్టెను - బుచ్చన్న నిష్క్రమింతురు.)

బూసి.— సేవకా! విజయరామరాజును, హైదరును బిలిచికొనిరమ్ము.

[హైదరు-విజయరాముల ప్రవేశము.]

హైద.—(తనలో) బద్మాష్ రంగ్రావ్ మాఖి ఖబ్రూ సెయ్యాక, తుముందర్ కి సెప్పి బుస్సీదొర్గార్కి మామీద ఘుస్సా తెఫ్యాండ్! అచ్ఛా అచ్ఛా! బుస్సీమే ఘుస్సా ఫిస్సా ఏక్ సణంలో తారీఫ్ సేసి, భొబ్లి మీద్కి థండూ యెల్కాపోతె మాఖీ పిది మంత్రాంగం హేంద్కు? సత్తర్ బుస్సీలుక్కు, శత్ తుముందర్కు ఖుల్పి భోమ్లా హోటా సెయ్యాక పోతే హామ్ హైదర్ జంగ్ నహీహై.

బూసి.— (కోపముతో) టాటోటుకాఁడా! నీ కీయొకిమీఁ డెంత లంచ మిచ్చియున్నాఁడు? అది జేబులో వైచికొని మాతో దబ్బరఁ బలికి మోసము చేయనెంచుచున్నావా? నీ విట్లు చేసినందులకు నిన్నేమి చేయింపవలయు? ఔరా! మోసము!

హైద.— హల్లా హల్లా! మేం హేటీ సేసేమ్ సాబ్! మేం తమ్తోటీ హేంద్కు హాబ్ధం సెప్తామ్. మాఖీ యేటి తెల్సు?

బూసి.— నోరు మూసికొనుము. ఇంకను కొండెమ్ములు చెప్పనెంచుచున్నావా? నీతలఁ దఱిగించివేసెద నుండుము. గొనములయిక్కయగు

నాబొబ్బిలిరాయఁడు తనకప్ప మెప్పు డడిగిన నప్పుడే చెల్లింప సిద్ధముగ నున్నాఁడే! అటువంటివానిపయిని చాడీలు చెప్పి మా కలుక రెట్టింతువా! మాయలాఁ డగునీ తేనిమంచివాఁ డందువా! ఇది యంతయు మా చెలికాఁడు మాకు వ్రాసి పంపలేదా?

తురకజవాను.—ఏడ్చుచు ప్రవేశించి) మాఖీ భొల్లిఖి హెందుక్ పంప్నార్ సాబ్! హాభొల్లీహాడూ మాదీఖిప్ హాంతా షిగ్గాయేస్నాడ్!

బూసి.— ఏటి కిట్లల్లరి చేసెదవు? నీ కేమైనది?

తుర.— హుజూర్! మీది ఫర్మానామే యేసోకని మాఖీ భొల్లి పోయి హోర్ని రమ్మంటే హాడ్డీ తమ్మూ హుంది యెంగారాఘ్ము సెప్తార్ బడే లాటీకి పట్కోని "బుస్సీ హెవ్వు? హాడూ రమ్మంటే మాఖీ యెంక్ వస్తావ్! మీదీబుస్సీ ఝూటాకోర్! బద్మాష్‌వుంది. హాడ్కి సేతా హైతే లడాయికి రమ్మన్!" హాంటూ ఘుండూ పట్కోని సిగ్గా గొట్టేడ్ సాబ్!

బూసి.—హైదరూ! వీఁడేమి యిట్లనుచున్నాఁడు? అతఁడు కడు మంచివాఁ డని చెప్పుచు మనయొద్దకు కుముందరుదొర కమ్మ వ్రాసినాఁడే! తిరుగ నిట్లు చేసినాఁడేమి? వానికి తెలివి లేదా?

విజ.— మాటలు కడు మెత్తగనే చెప్పుచుందురు కాని క్రియాసమయము పట్ల వారు మిమ్ముఁ దిరస్కరించుచునే యుందురు! నా కెందుల కీయక్కఱకు మాలినగొడవ?

బుస్సి.—తరువాత చూచుకొనవచ్చును. ముందు బొబ్బిలిపయికి దాడి వెడలుటకు సామగ్రి జతనపఱుపుము.

హైద.—సర్కార్! మాదీ బద్మాష్‌మాటా సెప్నార్! మేము బద్మాష్ వుంది- మాకీయుద్దం గిద్దంవద్దు. తమ్‌దీ నౌక్రీఖి సలామ్. మాదీబాత్ హుజూర్కి ఇనుక్కం లేఖ్ పోతే లుచ్ఛానౌక్రీ! మాఖీ యెందుక్! మాఖీ సెల్వు యిండి. మాం పోతాం. (పోఁబోవును.)

బుస్సి.—వానిమాటల నమ్మి నిన్న నినఁదుల్లకు నీవపుడే పోయెద నని చెప్పుచున్నావే! చాలు. చాల కోపము చూపితివి. దాడి వెడలుట కన్నియు జతనపఱుపుము.

హైద.— హేల్నిహార్ది హుకుం హైతే భొబ్లీ హూక్కవణంలో సాఫ్ సఫాయ్ సేసివేస్తామ్.

బూసి.— సరియే! నేను డేరాలోనికిఁ బోయెదను. (నిష్క్రమించును.)

విజ.— సాయుబేంద్రా! మీ రీజవానునకు లంచ మిచ్చి చెప్పించినమాటల చేత నేసుఁడీ! బొబ్బిలిపయి మరల దొరగారి కంత యలుక పుట్టినది. అదిరా! మీబుద్ధివిశేష మెంతయేని యిచ్చట కొనియాడఁదగియున్నది.

హైద.— హీజ్యారాజా! మన్కిమాటల్కి హిది సమ్యం కాదు. మన్మ హేల్సం సెప్తే దొర్గార్కి మళ్లా హేంటి తోస్తాదో! రస్తు గిస్తూ దరో బస్తూ తయ్యార్ సేస్తామ్; అవ్‌మే భయ్యా! (నిష్క్రమింతురు.)

శ్రీరస్తు.

ఓంనమో మార్తండగురుపరబ్రహ్మణే.

శూర బొబ్బిలి.

తృతీయాంకము.

రంగము - పురోపాంతము.

[చెలికాని వెంకయ్య ప్రవేశించుచున్నాఁడు.]

వెంక.— ఆహా! ఇన్నినాళ్లకు నాజన్మము పావనమైనది. ఒక్క నాజన్మమే యన నేటికి? మావంశకర్తల జన్మములెల్లఁ బావనములైనవి. మా రాజ్యపు టెల్లయగు దేవుపల్లికిఁ బరాసువారు సపరివారముగ వచ్చినారను వర్తమానము మాప్రభువులు విని వారిని సబహుమానంబుగ నెదుర్కొని కార్యంపుతొందర లేకుండినచో నిప్పుడు జరుగుచున్న వేంగళరాయని వివాహమున కొకపరి తోడుకొని రమ్మని నాకానతిచ్చియున్నారు. ఇంక నేను వారిభేటీకిఁ బోయెదఁగాక:— కాని, సర్వకాలంబులందును మత్తుపదార్థంబులఁ గుత్తుకబంటిగ మెసవి మైమఱచి యుండు నాహైదరుజంగునకు నాసందేశ మెఱింగింపవలయు నన్నఁ గొంకు వొడముచున్నది. ఒడలు తెలియక యుండువాతురక నాకేమైన యవమానము సేయ యత్నింపఁడు కదా!— యత్నించుఁగాక! కరవాల సహాయుఁడనై యున్న నన్నాతురక కాదా పురారి యడ్డినమాత్రమేమి సేయఁగలఁడు? పొరపడితిని. మొన్ననే కదా! బుచ్చన్నగారు వచ్చి పరాసులతో మనకు యుద్ధమనవసరమనియు వారుఁగూడ సామమే యనుసం

ధించుచున్నారనియు బూసిదొర చెప్పినట్లు వచించె. అట్టియెడ వారు నన్నవమానింప నేల యత్నింతురు?— ఇంకను విజయరామరాజు వీరలతో నేలవచ్చుచున్నాఁడో? అదికూడ నాలోచింపవలసినవిషయమే కదా! పయికి యుద్ధమునకు రామని వార్త నంపి లోలోన నైమేనికుట్రలు పన్నుచు యుద్ధప్రయత్నము చేయుచుందురా! వారి ప్రయత్నములనన్నింటి నిప్పుడే లీల నేని కనుఁగొనవలయు. ఇంకే నాలస్యమొనరింపక వారలభేటీకిం బోయెదఁగాక:— (నిష్క్రమించుచున్నాఁడు.)

రంగము - హైదరుడేరా

[హైదరు-విజయరాములు కూర్చుండి ప్రవేశించుచున్నారు.]

హైద.— హిజ్యారాజా! నీవ్ మాఖీ యిస్తావ్ ఖరార్ బోలో! బారా లాక్ రుఫియామే హింకా హాపుడ్డా యిస్తావ్ మాఖీ బోలో!

విజ.— పదివేలరూపాయీలు మీ కీవఱకే యిచ్చియుంటిని కదా! కొదవ సైకమంతయు బొబ్బిలి మా కొసంగినప్పు డిచ్చెదను.

హైద.— రాజాజీ! మన్కు భొబ్లీమీద్కి ధండా యెల్తాంసంత్తి హింకా రంగ్డికి తెలుస్తాసై. హాంచేత మన్కు హోర్ని షుల్బంగా సఫాయ్ సెయ్యాచ్చు.

విజ.— మీ రాలోచించి చేసినది వ్యర్థమై చనునా?

హుస్సేను.— (ప్రవేశించి) సర్కార్ సాబ్! హెవ్రో భొబ్లీరంగ్రావ్ ధర్గానించి యేక్ షైల్మాన్ వుంటాడ్ హుజూర్ భేట్కి ఆయా!

హైద.— హిజ్యారాజా! హెవ్రూవోయ్ హోడూ!

విజ.— లోనికి రానిండు! అతనితో సంభాషించినపిదప అంతయు మీకే తెల్లము కాఁగలదు.

హైద.— హోణ్లీ యిఖ్ డాకి రమ్మన్.

వెంకయ్య.— (ప్రవేశించి తనలో) అదిగో! దురాత్ముఁడగు నావిజయరామునిఁ జూచినప్పటినుండియు నాశరీరమున శాంతరస మిముడక కోప

ము వెల్లుబ్బుచున్నది. ఏమిచేయుటకును ఇది సమయము కాదు. కాపని నేను నిర్వర్తించికొనియెదఁగాక! (పైకి) హైదరుజంగుబహద్దూరువారికి సలాములు.

హైద.— హెవ్రూవోయ్ నివ్వు! బలెషివాయీ రంగ్డూరాశ్ ధగా భంట్వా యేటి? కైకూ నీవు హీఖ్డాకి వఛ్ఛావ్?

వేంక.— (తనలో) అవురా! ఈకఱకుతురక నన్నెంత బిట్టుగ నవమానించినాఁడు? ఏనిడినసలా మందుకొనకుండిన మానెఁగాక! మాప్రతిపక్షుఁడగు విజయరాముఁ డాసీనుఁడై యున్నతఁడే వారియెదుట నన్ను నిలువఁబడఁజేయుచున్నాఁడు. "కార్యార్థినః కుతో గర్వః" యనుట కార్యార్థినగు నే నిప్పట్ల ననుసరింపఁ దగినమార్గముననే ప్రవర్తించెదఁగాక! (బహిరంగముగ) సాహేబుగారూ! మీ రూహించినట్లు నే నా రంగారాయనిం గారి సేనానాయకులలో నొక్కరుండనగు వేంకయ పేరిటివాఁడ! మాప్రభువర్యుండు తమభేటికిం బంపియుండుటచే వచ్చితి. సెలవైనచోఁ గార్యము నివేదించికొనియెద:—

హైద.—మీది యెల్మాజమీందార్కీ మేల్‌వస్తాద్ మియ్యా! హొర్ది భల్మా ఖిల్మా హెక్వావుంటుంది తోస్తుంది. మాది భేట్కీ హొరూష్వయుం హొండ్కు వస్తార్?

వేంక.—తమ రెప్పుడు రమ్మని కబురంపిన నాక్షణమ వారు వచ్చుటకు సర్వవిధముల యత్నించుచునే యుందురు.

గీ. పాలనము సేయు సర్కారువారు రమ్మ
టంచు దయ యుంచి వార్త లంపించునపుడు
రాకపోవునె? ఎంతటిరాయఁడైన
మాఱుమాట వచింపఁగ వారితరమె?

హైద—హీరాభొబ్లిహోరూ మాటల్ పైయికి పాలా తీస్గా సెప్తార్; మాఖీఅచ్ఛా మాలుమ్; మాదీ ఫర్మానామే హంద్రూ రాజ్లూ భుర్రా

మీధా యేసొక్కని మేరాభేట్కీ హొతాహైతూహుంటే మీదిరాజ్ భల్మా హెక్వా హుంది హొండ్కు రాడ్ తోస్తుంది. తుర్కవొడ్డి రాజ్జెం వొడ్కి మాలుమ్ నహీహై! మాదీ ఫిరంగిదెబ్బమచ్చు సూస్తే హొవ్డా హొచ్ఛా మాలుమ్ హైతుంది. హింకా ఖొద్దిదిన్మ హుండ్మన్ వోయ్. మేం వారిదర్శణాన్కి వస్తామ్.

వేంక - (తనలో) ఔరా! ఏమిది? ఈతఁడు మాటలాడెడి ప్రతియంశమ్మును గూడ మాకు విరుద్ధముగనే కన్పట్టుచున్నది. మరల నీవిజయరాముఁ డేమేని ధూపము వైచి యుండఁడుకదా! దైవ నిర్ణీతము నెవరేని దాఁటువారు కలరా! నేనుం దగినభంగి వీరలకుఁ బ్రత్యుత్తర మిచ్చెదఁగాక! (ప్రకాశముగ) యవనాధిపా!

మ. అపచారమ్ములుమీకునుంతయును జేయం బోముమీరిట్లుకో
పపుఁజూడ్కుల్ ప్రసరింపనేమిటికి? మాపై రంగరాడ్భర్తతా
నెపుడున్ మీకెదు రాడలేదు మిము నెంతే గౌరవస్ఫూర్తి ను
ల్లపుఁదమ్మిన్ దలపోయుచేనినిటుచుల్కంజూడఁగాఁబాడియే?

క. తలిదండ్రులు పిల్లలపై
నలుకన్ వహియింప నగునె? అటులైనను వా
రల కేది దారి? మీరే
సెలవీయన్ వలయు యవనశేఖర! యెలమిన్.

హైద — మీరు మాటల్ భలే షెమత్కారం సెప్తార్! మీదీ రాజా మామీద్కి లడాయ్కి తయ్యార్ వున్నాడ్ వింటామ్! క్యా బోల్తా?

వేంక.— రామరామ! మీ రెంతటిమాట సెలవిచ్చుచున్నారు? మాప్రభువరేణ్యుండు కలలోనైన నట్టిది యాలోచించు నని మీ రెంచకుఁడు.

వ. హరిహరి! ఎంతమాట యవనాధిప! యేలినవారితోడ సంగర మొనరింప నెట్టయినఁగాని మదీశ్వరుఁ డెంచువాఁడె? ఎ

వ్వారు వచియించినారొ! పరిపంథికులం బది సత్యమంచు ధీ
వరులగు మీరు నమ్మఁదగవా! ఎదురాడఁగ మాకుశక్యమా?

మఱియు:—

ఉ. నమ్మఁగరాని వాక్యముల నమ్మి మముం గడుఁ జుల్కసేయధ
ర్మమ్మె? హరిస్వరూపులగు రాయనిగా రిసుమంతయేని నే
రమ్మును జేయలే దది కరమ్ము నిజమ్ము మదీశ్వరుండు న్యా
యమ్మునుదప్పనట్టిసుగుణాఢ్యుఁడుహైదరుజంగుసాయెబా!

హైద.— మాఖీ హాది హాఖ్రా లేద్! మీదిరాజ్ మాదీ ముల్లాజ్ మత్కు కైకు ఆతాహై? ధాన్కి ఖార్ణం హేంటి హుంది బోలో?

వేంక.— సాహెబేంద్రా! మాశత్రుఁడగు విజయరామరాజు తమదర్శనము నకు వచ్చినాఁ డని విని మేముఁగూడ నపుడే వచ్చినచో మాయిరువుర కేమేని జగడము వచ్చునేమో యని భీతిచే రాలేదు. మన్నింపవలయు.

క. తమభేటికి వచ్చును జిత
విమతారి మదీయభూమివిభుఁ డిఁకఁ గొలుచున్
తమరు దయచేసి వారికిఁ
గ్రమ మగుగౌరవము నీయఁగలిగినయెడలన్.

విజ.— (జనాంతికముగ) చూచితిరా! అతఁడు "జితవిమతారి" యఁట! వారలకు మీరు క్రమమగు గౌరవ మీయఁగలరో లేరో యని సందేహించుచున్నారఁట! క్రమముగ మీకే యంతయు వెల్లడి యగుచున్నదికదా!

వేంక.— (తనలో) అదిగో! ఆవిజయరాముఁ డేదియో వాని చెవిలో నూఁదుచున్నాఁడు. ఇఁక మాకార్యము వ్యతిరేకముగఁ దిరుగునేమో? దైవవ్యతిరేకమునకు మనుజుఁ డేమిచేయఁగలఁడు?

హైద.— (కోపముతో) వంకాయ్! మాటామాటాసూస్తే మెత్తామెత్తా సెప్పిపని గట్టిగట్టి సేస్తావ్! మాదీ తడాఖా యిఖ్నా కొద్దిదిన్నులో సూస్తామ్ సూస్కోవోయ్! మీదీరాజా దాన్తో ఖోట్ ఖాలీసేసి పాల్కొండమన్నెమ్కె జావ్ బోలో, మీకీ ఖోల్ ఖావాల్ హేమ్?

వేంక.— సాయెబేంద్రా! ఏటిమాట లివి? మమ్ములనుఁ గోట విడిచి వేఱొకచోటికిఁ బొమ్మని చెప్పుట మీ కేమేని యుచితముగ నున్నదా?

ఉ. నేరములేనిమాపయిని నేరము మోపి వినంగరాని యీ
తీరునఁ గోపఘూర్ణితమతిన్ మముఁ బ్రోల్వెడలింప నెంచి స
ర్కారిటు పల్కుచున్ నిరపరాధుల సాధులఁ బందువంటిసం
సారముమాప నెంచుట విచారము కాదె? తురుష్కశేఖరా!

అదియునుంగాక.—

ఉ. రాయనిగారికిం దమకు రాఁజుచునుండెనె? ప్రాఁతవైరముల్
పాయక మీకు నేమయిన వారపచారము చేసినారె? ఇ
ట్లాయితమై గడీ విడిచి యవ్వల కేఁగుఁడటంచుఁ బల్కనౌ
నా! యవనేశ్వరా! ఉచితమా యిటుపల్కుట మీకు న్యాయమా.

మఱియు,

మ. ఘనుఁ డనుమాఁ చేతకు పేర్మహామ్మదు కడునొమ్మదించి మాకప్పడి
చ్చినజాగీ రిది నాఁటఁగోలె నిచటన్ స్త్రీబాలురన్ గూడి మే
మునుమావారలునున్న వారమిది మమ్మున్నేఁడుపొమ్మన్న నే
మన నౌ మిమ్ముల నెందుఁబోయెదము నాయమ్మే యిటుల్వల్కఁగన్.

హైద.— హెఖ్ఖాఖి పోతే హాఖ్ఖాఖి ఫాండి - మాఖూ జరూరత్ హై! ముందు మీదిఖోటామాత్రం ఖాలీ కావాలా!

వేంక.— సరిరయే మీ రనినట్లు జరిగినచో జరుగవచ్చును, గాని:—

క. ఏమపచారమ్ములు మీ
కేమొనరిచినాము? కోట నేటికి విడువన్?

రామలతో బాలురతో
నీమూర్ఖపుఁ బట్టు నీకు నేలా పొడమెన్ ?

హైద—(కోపముతో) హారే! మాఖీమూర్ఖ్యం గీర్ఖ్యం సెప్తావ్ బద్మాష్! మాదీ సత్యా ఫిరంగిదెబ్బ నీఖీ మాలుమ్ నహీ ?

గేయము.

మాదీ ఘుస్సా సేస్తే మంచిమంచి వాళ్లు
మల్లుల్మల్ మాడిపోతార్
మాదీదయ్యా సేస్తే మాలహాణ్ణికూడా
మంచ్ మంచ్ మంచ్ మారాజ్ సెస్తామ్.
మాదీభల్యామ్ నీఖి మాలుమ్ నైతోస్తుంది
మాదెబ్బల్ నీఖి సూప్తామ్
మీదిరాజ్కు బోలో మేమె భేట్కి హోచ్చి
మీబొబ్బిల్ ఖాల్చియేస్తామ్.

వేంక—మీ రధికారులు. అదియునుం గాక శత్రుపక్షమునందుఁ జేరియున్నావా రగుటచే మ మ్మెంత నిందించిన మాకది గౌరవహీనము కాక పైపెచ్చది గౌరవజనకమే! మఱియొకమాట:—

ఉ. పేష్కసుఁగూర్పఁగా నిటకు వేడుకవచ్చి యరాతిపల్కుబల్
దుష్కృతులెల్లనున్వినుచుదూరముగామముఁబొండటంచునీ
ముష్కరమార్గమే తమరు పూనిన మిమ్మెవరడ్డువారు? ధా
.ష్కశిఖామణీ! ఎదఁగనుంగొనుమెయ్యదిన్యాయమార్గమో?

ఉచితానుచితపరిజ్ఞానంబు కలిగి యే మొనరించిన చెడ్డపనులకుఁ బ్రతిఫలముగ మమ్ముఁ గోట వెడలింప నెంతురేమో? అట్లయినచో,—

క. సరకారుపట్ల మే మె
వ్వర మేమిటి సలిపినాము? వదలక మమ్ముం
ద్వరఁ గోట వెడల నడచుట
మరియాదగ నున్నదే? అమానుషము కదా!

హైద.—వంకాయ్! మాఖీ యెద్రూ బాత్ సెప్తావ్! నీఖి యెంతబోలో! మాఖి కూచ్ భీ జరూరత్ నై. ముఫ్తా మీదీ గడీ యిడ్చి పోండి. తర్వాత మాఖీ దయ్యావస్తే మీఖీ యిస్తామ్! లేఖ్ పోతే హీజ్వారా జాలీ యిస్తామ్! మేరా దిల్!

వేంక.—నాదొక్క మనవి కలదది సాంతముగ నాలకించి మఱియు గడీ విడిచి పొమ్మనుఁడు.

సీ. తమ కనిష్టంబైన దారి గొంటుతనాన
మానక మే మేమి మసలినామె?
సరకారువారి పేష్కసు నీయ మని చెప్పి
కొంచక మిమ్ము టాయించినామె?
ఏలినవారితో నెపుడేని యేమేని
యడ్డదిడ్డపుమాట లాడినామె?
క్రూరత వహించి దారుల దోపించి
బాటసారులఁ జిక్కుపఱచినామె?

తే-గీ. దొంగతనములు చేయింపఁ దొడఁగినామె?
బాహుదర్పంబు చూపించి ప్రబలినామె?
ఏల చోరులయట్లు మే మిల్లు విడిచి
సాగునంతటిపని వచ్చె? సామెబయ్యా!

మఱియు మీరు మమ్ముఁ గడీ విడిచి పొమ్మని చెప్పి అది గ్రహించుటయే మీముఖ్యోద్దేశమైనచో:—

ఉ. పోరికి నేల సిద్ధమయి పోవుట రండటకేను రాయనిం
గారికి నచ్చెఁగాఁ బలికి క్రచ్చుఱ నిల్వెడలింతుఁ గోట స
ర్కారు గ్రహింపఁగాఁ దగు సుఖమ్ముగనస్మదరాతిరాయఁడీ
పౌరుషహీనుఁడచ్చటకు వచ్చిన సంధిచెడున్ సమస్తమున్.

హైద.—వంక్యాయ్! మాఖీ సంటిపిల్లడ్కి సెప్పి బయ్యం సేస్తావ్ తోస్తుంది. ఆఖోటా మేమ్ తీస్కోని మేరాదిల్ యేలాసెస్తే ఆలాగ్ సేస్తామ్. కంచెన్కి దారా పోస్తామ్. నీఖీ యేంవోయ్? నీదిపనీ ఖోటా విడ్చి అల్లాఖి పోవ్ డమ్.

వేంక.—అదిగో! అదియే వలదని మాటిమాటికిని తమతో నివేదించుచున్నాను. మీకా కోట కావలసి వచ్చినచో మీరుమాత్రము గ్రహింపుఁడు. మా కభ్యంతరము లేదు.

చ. కనలుచు మమ్ము నిల్వెడలఁగా వడిపించుచు మాయరాతులన్
గొని కడుఁ బెద్దసేయుచును గోటను వానికి నీఁదలంచుటల్
చెనవవి మీకు మాకుఁ గొనసాగనికృత్యము లెన్నఁ జేనిమీ
మనమున నూహసేయుఁడవమానము సైఁపఁగలేము సాయెబా!

మానధనులును కీర్తివిశాలురును సన్మార్గసంచారులును అగు రేచర్లగోత్రోద్భవులు తుదకుఁ దెగుటకైన నొప్పుకొనియెదరు కాని యవమానము సహింపనోల్లరు. ఇది యంతయు జగద్విదితమే! కావున; ఒక్క కోట విడిచి పొమ్మనుట తక్క మఱి యేమి చెప్పినను చేయుటకు సంసిద్ధులయి యుందురు.

హైద.—హింతా ధీనంగా హిప్డు నీవ్ బోల్తావ్! మొట్టమొద్టా మాఖీ పేష్కస్ కైకూ సెల్లించక్కపోవాలా? థాన్కి హేంటికార్ణం హుంది బోలో వోయ్!

వేంక.—సాయెబేంద్రా! మీ రిట్లు మాయార్తి సమగ్రంబుగఁ దెలిసికొని మమ్ముద్ధరింతు మన్నప్పుడు మాకేల కొదవ లుండును? మాకుంగల పెం

డ్లితొందరలచేఁ గప్పము చెల్లింప నింత యాలస్య మయినది. మాకన్న ముందీరాజుమాత్ర మేమేని యిచ్చినాఁడా? అట్లనుటలో వీరిపయిఁ గొండెములు చెప్పవలయు నని నాయభిప్రాయము కాదు. దాని కేమి?

ఉ. కప్పముఁ గట్టలేదనుచుఁ గ్రౌర్యముఁ బూనఁగనొప్పునయ్య! మే
మిప్పుడె మీయనుజ్ఞయగు నేని రవంతయు నుండకుండ మా
కప్పమొసంగమా? మిగులగౌరవవృత్తిని మా ప్రభుండు "మా
తప్పుక్షమించుఁడీ" యనుచుఁ దానయి నిన్ బ్రతిమాలకుండునా?

మీరు దయఁదలఁచి మమ్మనుగ్రహింతురేని యొక్క కప్పమే కాదు.

క. దానికిఁ బదిరెట్లుగ బహు
మానము మే మిడుదుమయ్య మన్నింప నగున్
మానము గలవారికి నవ
మానము ఘటియిల్ల నెట్లు మన నగు నిలపై?

హైద.—వంకాయ్! మిమ్మల్ని రచ్చించ్వాలా హుందీ. వమ్యం మిగ్లిపోయింది. మీదీరాజాఖి షుకంగా హుండ్వాలా హుంది హంటే మాం హోక్టి సెప్తామ్. మేరాబాత్ యినోక్కో, మీదీరాజా హూచ్చి యిజ్య రాజాఖి సలామ్ సేసి మీరు హోరు రాజీనామా సేస్కోండి. హది సెయ్యక్కపోతే ఖోట యిడ్చి జావ్. హిది రెండు సెయ్యక్కపోతేమాదీ లష్కర్ మాదీషిపాయ్ హుందిలేవ్, మీదీఖొబ్లి హూచ్చి సాఫ్‌సఫాయ్ సేస్తాడు హింఖా ఝూటాబాత్ మత్ కరో.

వేంక.—సాహేబా! నేను దబ్బరమాట లాడుచున్నా నని యూహించుచున్నావో?

ఉ. దబ్బరమాటలాడఁగ నధర్మపరుండగు రామరాజు గా
నబ్బెసమేని లేద యటులాడఁగ మాకు ధరాతలంబు త

బ్బిబ్బయినన్ మృషోక్తులను, బెబ్బులులంచునుగీర్తిఁగన్నమా
బొబ్బిలివారు పల్కరు నృపుంబలెభీరులు కారు సాయెబా !

క. గౌరవహీనుఁడు విజయ
త్శ్మారమణుని నాశ్రయింపఁ జను నని చెప్పన్
నో రెట్లు వచ్చె మాభూ
దారుం డోకభీరుఁ డంచుఁ దలపోసితివో ?

కటకటా! సపుత్త్రమిత్త్రకళత్ర పరివారంబుగ మాప్రభువరేణ్యులఁ గోటవిడిచి పొమ్మన నీ కేమయిన నుచితముగఁ దోఁచినదా? అంతటి యుచితానుచితపరిజ్ఞానంబు కలిగియుండిన నీ వేటి కిట్లందువు ?

మ. ఇను నేనిన్ గడకంటఁజూడనిసతుల్ హ్రీడావతుల్ వెల్లమా
నినులవ్వారలసిగ్గుమాలియెట కేనింగోంచుఁబోఁడంచు, మీ
రన నౌనే? తమ కేమిచేసితిమి యెగ్గయ్యా రె? హాకీము లె
ట్లనినం జెల్లెనుగాక యొండొకఁడెయిట్లన్నన్ ధరంగూల్పనే ?

హైద.—వంకాయ్! నీఖి సస్తావ్ వాలా హుంది యేంటిహోయ్. హట్టా గట్టిగట్టి బద్మాష్ బాత్ బోల్తావ్.

వేంక.—హైదరుజంగుసాయేబుగారూ !

ఉ. చావఁ దెగించువారలకు సంద్రముపాదముబంటియంటమున్
వేవురు చెప్పఁగా వినవె? విశ్వము బిట్టు వడంకుఁగాక మా
రావుకులాగ్రగణ్యుఁడగు రంగమహీపతి గెల్చుదోర్బలుల్
చావన భీతిఁ జెందరు ప్రశస్తము లీవచనంబు లుర్వరన్.

ఆమాటలఁ దుది విమర్శించికొనవచ్చును కాని; నావాక్యముల నన్నిఁటిని సావధానుఁడవై వినుము.

శా. మా కత్యంతవిరోధి రాజితనిదుర్మంత్రంబు లాలించి దే
వా కార్పణ్యముఁబూని కోటవెడలింపంజూచు టన్యాయమీ

లోకుల్కాకులురవ్వసేతురుదయాలోలుండవై మా మొఱల్
నీకర్ణమ్ములఁ జేర్పుమా! యశము పోనీకుండఁ గాపాడుమా!

క. మారాయఁడు సుగుణాఢ్యుఁడు
తా రిచ్చెడియాజ్ఞలు జవదాఁటఁడు కానన్
గౌరవముగఁ గన నొప్పును
పోరుడుపం దగును సంధి పొసఁగింప నగున్.

హైద.—హిజ్యరాజాఖి సలామ్ సేసి సంధి సేస్కొమ్మన్ లేఖ్ పోతే ఖోట యిడ్చి హల్లాఖీ పొమ్మన్. హూక్టేబాత్.

వేంక.—ఈరెండునుం గూడఁ గలలోనైన జరుగనిపనులే !

ఉ. ఎంతటిదాఁక జీవనము లీమెయి నిల్చునో అంతదాఁక శ్రీ
కాంతుఁడు వచ్చి పోరినను గా దననేల? గడీని వీడ మే
మంతకు మున్న యీయధముఁడౌ విజయేశునిసంధి సేయఁగా
మంతన మాడఁబోము పలుమాటలిఁకేటికి? ఖానుసాయెబా!

ఈనాసందేశమ్ముతోపాటు నీ కించుక యుపదేశము గూడఁ జేయఁ దలఁచినాఁడ. అదియుఁ గూడ సావధానుఁడవై విందువుగాక:—

ఉ. రంగనృపుం డొకండె సమర మ్మొనరింపుచు మిమ్ము నెల్లరన్
భంగము సేయుపట్ల బలవంతుల మంచును బొంగుచున్నమీ
జంగులు ఖానులున్ దొరలు చావక నిల్వరు వాస్తవమ్ము దు
స్సంగుఁడు రాజుమాట విని చావక జీవము నిల్పనెంచుమా!

శా. బారిఁబెట్టన్ గోని వేంగళుండు రిపుభిత్ ప్రావీణ్యమున్ జూపదు
ర్వారాటోపబలమ్ముమై నెదుర నీరాయం డరాయండునై
పోఱన్ జూచునకాని కయ్యమున నిల్వన్ జాలఁ డీవిట్లు పో
రారంభింపక సంధికిష్టపడుమా! అన్యాయమున్ మానుమా!

శా. సాటోపోద్రుద్రూఢనంగఁగుంతమును రై సంధించి సోత్సాహుఁడై
యక్షీణప్రతిపక్షులన్గెడపుసై న్యాధ్యక్షుఁ డుత్‌క్షోభిత
ప్రక్షీణాఖిలదోర్బలుం డయినపాపారాయఁ డొక్కండె ర
క్తాక్షుండై మిముఁ గాంచెఁదత్‌క్షణమె సైన్యమ్ముల్ క్షయిం
చుం జుమీ !

మ. నరసారాయఁడుధర్మరాయఁడునుచిన్నా రాయఁడున్ ఘోరసం
గరభూమిన్ దమయుద్ధతిన్ నెఱప మీఖానుల్ కళాహీనులై
ధరణిన్ ద్రెళ్లెదరింతనిక్కువము మద్వాక్యమ్ములాలింపుమా
కరుణన్బెంపుమ! న్యాయబుద్ధిఁగనుమా! కయ్యమ్ముచాలింపుమా.

హైద.—సరే! హద్దిహద్ది సత్వా లడాయ్‌మే నూస్తాం హోయ్! నీఖీ సెప్పహాక్కర్ లేవ్రూ! మీఖీకాని మాఖీ హీర్లు హుందిలేవ్! మాదీ యిుర్దు మాం సెప్తామ్.

గేయము.

'లాడూమే హున్నాడ్, లట్‌పట్‌కి సెప్తాడ్
లాసూ హోర్తున్నాడ్ లచ్చెమ్మె సెద్దు,
పిల్పిల్ హోర్తున్నాడ్ బిల్లాల్ హోర్తున్నాడ
హాస్నల్లీ షుక్రుల్లా ముజ్‌పర్‌మే హున్నాడ్,
కుప్పీమ్మే హున్నాడ్ కుప్లామ్మెహున్నాడ్
జానూజాడూమార్టెన్ జంద్రాల్మే హున్నాడ్,
హైదర్‌మే హున్నాడ్ హిజ్యరాజున్నాడ్
హేమ్మియ్యా మీధగ్రా హెంక్వాహున్నారోయ్?

వేంక.— మీయొద్ద సైనికులు లేరని నేను చెప్పుచుండుటలేదు. మీకు భీతిఁ బుట్టించుటకయి మావారల నుడివియుండను లేదు. సాయేబు

గారూ! తాఁబట్టినకుందేటికి మూఁడే కాళ్లనుగతి మీ పట్టు వదలకున్నారు. మీశక్తివత్తు రనుభీతి సుంతయు మాకు లేదు. ఏల యంటిరా!

ఉ. న్యాయపథమ్ము వీడి కదన మ్మొనరింపఁగ నెన్నఁడేని మే
మాయిత మాచు రాము రిపులంద ఱహో యని కేలిసల్పఁగా
జాయలఁ గొంచుఁ గోట విడిసాగము వేయివచింపనేల? మీ
చేయఁగలంత చేసికొనఁ జెల్లును లక్ష్యము లేదు మాకిఁకన్.

హైద.—హారే! నీవు నోట్కి హోచ్చాబాత్ హంతా పేల్తావ్ బద్మాష్ రాయ్‌బారీగాడ్కి హింతపొగ్రుబోత్ హుంది. నీఖి యేం సేయిస్తామ్, సంపెయ్యిస్తామ్:—

వేంక.—ఓరీ! మూర్ఖాగ్రేసరచక్రవర్తీ! నన్నుం జంపివేయింతువురా! అదియును జూచెదఁగాక! రమ్ము.

లయగ్రాహి.

జారా! గుణదూర! వడి రార యిటు పోరుటకు,
బీర మది యున్న నిటు లేర వచియింపక ?
కారు లవి చాలును మహారణమునందు విను,
మోరి! పొనరించెద విదారితశరీరున్,
పౌరుషవిహీనునిగ నారుచిరఖడ్గవిక
టోరునటనన్ నురకభీరుఁడవు! నీవే,
రా! రణమునందు ననుఁ దారసిలఁగాఁ దగిన,
వీరుఁడ వహో! మసల కోరి! బల మున్నన్.

హైద.—అరే! దర్వాజామే కోన్ హైరే! హీవోంకాయ్‌ఖి నికాల్ దేవు సెప్పా-గంటెయ్.—

వేంక.—(కోపముతో) ఓరోరి తురుష్కాధమా! నన్ను గెంటుపాటి సామర్థ్యము మీలో నెవ్వరికున్నదో రమ్మనుము చూతము! ఔరా! విచిత్రము!

శా. గెంటింపింతునటంచుఁ బల్కితివి నన్గెంటంగ బల్దుంట యుం
దుంటన్ వింట నెఱుంగ రమ్మనుమురా! యున్నేని నైశిమ్మన
న్నంటన్దుంటరిగొంటుకాఁడ! యిదిగోనంటింతు నాదొడ్డవా
ల్నంటన్నిమ్ములమంటఁగల్ప నెదురై మార్కొమ్మురా నన్నిటన్.

హైద.— (భయముతో) కోక్ రే లాడూ! లాసూ! సిద్దీబిలాల్! మూసే సవాల్! హీడూ కాఫర్ రాయ్‌బారీమే సాలా గడ్బడ్ సెప్తున్నాడ్ సాఖే మారేఖ్ను నూస్తావ్, జల్దీ అవ్! జల్దీ ఆవ్! ధవుడో! ధవుడో! హింక మీఖి హోల్సం సెప్తే మాఖి మర్గయా హైతామ్.

(పాఱిపోవును)

వేంక.— ఓరీ! మూర్ఖా! పాఱుఁబోఁతా! ఏమేమియో ప్రతాపంబులఁ గొట్టఁబూనితి విదియేనురా నీ పౌరుషము? (రాజుదిక్కయి) ఓరీ! పూషపాట్యన్వయాంభోధిబడబానలా! విజయరామహంతకా!

క. పుట్టితివి రాచకొలమునఁ
బట్టితివి కటారి చేత బలువీరుఁడవై
గుట్టు విడి తురకకాళులు
పట్టితివా? నీతిమాలి పాఱుంబోతా!

అట్లు మా పాదముల నే పట్టితివేని నీకు బొబ్బిలి దానము చేసి యుందుమే.

చ. పరమగుణుండు రంగనరపాలునిపైఁ బగఁ బూని పూని సం
గర మొనరింపఁగా బలము కల్గమిఁ జింతిలి యెట్టకేలకున్
దురకలపాదముల్గొలిచి తొంటిపగన్ దరియింప నెంచితే
దురమున నాతనిన్ గెలువఁ దోయజనేత్రునికైన శక్యమే?

(తెరలో-ఝూటాటారాయ్‌బారీకి మారో మారో పకడో పకడో)

వేంక.—(వినుట నటించి తనలో) అదిగో! యవనబలంబులు నన్నుం బట్టుటకయి కోలాహలంబు దీపింప నీవంకకు వచ్చుచున్నవి. వీరలచేఁ జిక్కువడకుండ నిందుండి తప్పించుకొని పోయి యీయుదంతము రాయనింగారికి నివేదించెదను.

(ప్రవేశము. సిద్దీబిలాల్ లాడూఖాన్ హైదర్‌జంగ్.)

లాడూ.—బిలాల్! హీది అద్మీమే ఖర్తి మాజోర్గా తిప్తా హున్నాడ్: హింఖా హోల్సం సెయ్యాక్ హీణ్ని యెన్నాక్‌నిండి పటోక్‌వోయ్.

సిద్దీ.—హీడూ అచ్ఛావస్తాద్ హుందితోస్తుంది భాయ్ మాఖీ! మన్మ హజాగ్రత్ వుంటే పరారీ సెప్తావ్. ఆజాన్‌లాగ లటూక్ లటూక్ గెంతుతాడ్. హెప్రీమీధా పడ్తే హెప్రీఖి సంస్తాడ్ సందేఘుంహుంది దేఖ్ దేఖ్! హెంత హచ్చానా ష్టైం సెప్తుంది.

(వెంకయ్య చతురగతిఁ దప్పించికొని నిష్క్రమించును.)

లాడు.—అరే! అరే! అల్లా! అల్లా! హీడూ బద్మాష్‌పని సేస్నాడ్! ఛనంలో సెల్మీషిట్టాలాగా యెగ్రీపోనాడ్, యేంసేస్తామ్?

హైద.—హోణ్ని హెందుక్ హొడ్లిఫెట్‌నార్ హోయ్, హాడూ భలే వస్తాద్ హుంది. హీడు సస్తే భొబ్లీఖి హెంతనష్టం హైతుంది. మాఖీ సంస్థానిక్ ఖర్తి యెత్నాడ్! మాఖీ పరారీ సెప్కాపోతే హస్టేసచ్ఛి హుందుమ్.

సిద్దీ.—సర్కార్! ఖేస్రీఫిల్లాలాగ హాడూ హడ్డా నూస్తాడ్ హిడ్డా హుంటాడ్ హాదిమద్దె పరారీ సెప్తాడ్ మై క్యాకరుమ్?

లాడు.—భొబ్లిఖోటామే ముట్‌డి సెప్పి హాడిక్ సాప్‌సఫాయ్ సేస్తామ్ సర్కార్! ధొర్గారీ ఫర్మానామే రీఝా హైహొంది. హింకా హిస్టే భొబ్లీఖి హోయ్ మాచీతడాఖానూస్తామ్ సాబ్; దేఖో

(అందఱు నిష్క్రమింతురు.)

[రంగము రంగరాయని కొల్వుకూటము.]

[రంగారావు వేంగళరావు, వేంకయ్య బుచ్చన్న, నరసింహరాయఁడు, ధర్మారావు కూర్చుండి ప్రవేశింతురు.]

రంగా.—అన్నలారా! సామమునఁ గార్యము చక్కఁబడె నని యెంచనిదేమి యడ్డముగ తిరిగినది?

నర.—రాయనింగారూ! మనము చేయున దేమికలదు? దైవ మేవిధముగ సంకల్పించినాఁడో ఆవిధముగఁ గాకతీరదుకదా! ఇఁకముందు యుద్ధమునకు రారను నమ్మకముతో నజాగ్రత్తగ నుండక యుద్ధసన్నద్ధుల మగుటకూడ కొంతలోఁ గొంత మేలే!

రంగా.—ఏమిమేలో నాకేమియుఁ దెలియరాకున్నది? అస్త్రశస్త్రనికాయంబులతోఁ బోరాడుమన మాఫరంగివారి ఫిరంగులయెదుట నిలువఁగల మనునమ్మకము లేకున్నది. ధర్మయుద్ధ మయినచోఁ గదా! మనబాహుబలసంపదలఁ జూపిన సార్థక మగును. ఇట్టియధర్మయుద్ధంబున మన మేమిసేయఁగలము?

వేంక.—అన్నయ్యగారూ! మీ రిట్లూరక యధైర్యపడకుఁడు. వారలఫిరంగులు మాత్రము మనల నేమిసేయఁగలవు?

ఉ. పూవులబంతులట్టులుగఁ బూనఁగలేనె ఫిరంగిగుండ్ల నా
పై విసరంగలేనె? యవి వారలపై నుఱుమాడఁ జాలనే
కేవలకాలకాలుఁ డనఁ గేలఁ గుఠారముఁ బూని వారి మీ
రీవిధి భీతిఁ జెందఁ గత మేమొ? యెఱుంగనుగాక! సోదరా!

మఱియు,—

మ. గరిడీ ద్వాదశవత్సరమ్ము లధికోగ్రస్ఫూర్తిమై సాము ము
మ్మరవృత్తిన్ గొనినట్టిచేతులకు, నిష్టప్రక్రియన్ దొల్లి మం

దురయంబుండినసాహాయంబునకహస్తోత్థప్పన్న నాయీఁ బెకున్
సరియాకాలము దాపరించెనిదె నాసామర్థ్యముం జూపఁగన్.

రంగా.—తమ్ముఁడా! వేగిరింపకుము. ఎదిరిబలాబలంబుల నెంచుట విచారణంబు కాని, భీతి కాదుసుమా!

వేగువాఁడు.—(ప్రవేశించి) ఏలినవారాలోచింతురుకాక! ప్రపంచకమెల్ల నీనినదో యనునట్లుగఁ బరాసువారిదం డంతయు వచ్చి మనపురంబున విడిసియున్నది. లెక్కపెట్ట నలవికాని తురకసిబ్బందియుఁ ఎంతయున్నదో చెప్పఁ జాలను కాని విజయరామరాజుగారి దండును మనపురంబు చుట్టునుండి లోనివారు బయటకును బయటివారు లోనికిని పోవుటకేని వీలులేకుండఁ జేసినారు.

రంగా—ఏమీ! వారప్పుడే యిచ్చటికే వచ్చినారా? నీ వింకేమేమి కనిపెట్టితివి? ఎవ్వరెవ్వ రిచ్చట విడిసిరి?

వేగు.—విజయరామరాజుగారు తమ పౌఁజుదార్లతోఁ గూడ రాజామునకు పోవుమార్గమునందును, దానిచెంగట నెవరో తురకమంత్రియగు హైదరుజంగఁట! వానిగుడారంబును, దానిప్రక్కఁ బూసిదొరడేరాయు, నాపయి నెవరో సరదార్లఁట! హాసనల్లీఖాను, సిద్దీబిలాలు, లాడూఖాను, లానూ, ఇంక నెవరెవరో వారి పేరులు తెలియవు, వారలుం గూడ, వెన్నెలకుప్పలట్లు తమడేరాలను వాతికొని యుద్ధసన్నద్ధు లగుచున్నారు. ఏవంకఁ జూచినను వారికోలాహలంబులే! ఏప్రక్కఁ జూచినను వారి యార్భటులే! ఈసంగతి దేవరకు నివేదింప వచ్చినాఁడ. ఇఁక నాకు సెలవు. (నిష్క్రమించును.)

రంగా.—దళవాయులారా! ఇంకను వారెపుడో యుద్ధమునకు వచ్చెదరని మన మూహించుచున్నాము కాని, ఇపుడే వచ్చి మనపురంబున విడిసినారఁట! నాకుడిబుజమగు పాపయబావగారిని రాజామునం దుంచితిమి కదా! అతఁడే యిపు డిందున్న నింత తొందరపాటు లేకపోవునే.

నర.—రంగారావుగారూ! "గతం నశోచామి కృతం స్మరామి!" యనుట వారు లేరనుటకన్న వారి నిందు దప్పించునుపాయ మూహింపుఁడు. రామయగారిని వారియెడ కంపరాదా!

రంగా.—అగును. బుచ్చన్నగారూ! మనరామయ్యగారి నీకార్యము నెఱవేర్చి రమ్మనుఁడు. మనచుట్టునున్నవా రెవరికిం దెలియరాకుండ రాజామునకుఁ బోయి బావగారినిఁ జూచి యిచటివిశేషంబులఁ జెప్పి సత్వరము వారిందు వచ్చునట్లు చేయవలయును.

బుచ్చ.—ఈకార్యము రామయ్యగారికి నివేదించి వచ్చెదను.

(పోయి తిరుగ ప్రవేశించును.)

రంగా.—మామా! ఇంకేమి సేయవలయు ?

(తెరలో-దేవా ! ఎవరో హాసనల్లీ ఖానుడఁట! హైదరుపంపున వచ్చి దేవరదర్శన మభిలషించుచున్నాఁడు.)

రంగా.—తమ్ముఁడా! నీ వాసాయేబున కెదురేఁగి సబహుమానముగఁ దోడ్కొని రమ్ము.

(వేంగళరాయఁడు పోయి హాసనల్లీఖానునితోఁ బ్రవేశించును.)

హాస.—సలాము! రంగరావుబహద్దరువారికి.

రంగా.—సలామ్ ! హాసనల్లీసాయేబుగారికి. మీ రాయాసన మలంకరింతురుగాక.

హాస.—(కూరుచుండి) రాయనింగారూ! మీయతిథిసత్కారములఁ గడు నలరితిని. నన్ను బూసీదొరగారును, హయిదరుజంగుసాయేబుగారును మీయొద్దకు దూతగఁ బంపియున్నారు. వారు తమతోఁ జెప్పుమన్న సందేశము చెప్పెదను. సావధానులరై విందురుగాక !

రంగా.—సర్వవిధముల స్సావధానుఁడ నయియే యున్నాఁడను.

హాస.—మిమ్ములను మాభేటీకి రమ్మని తాఖీదు లంపఁగా, మీరు రాక నిరాకరించినారు. మఱి మేము రెండవసారి యంపినహరకాలాలను చిదు

గఁ గొట్టినారు. ఇవి యన్నియుఁ జూడ మీరు మాతో యుద్ధ మభిలషించుచున్నట్లే తోఁచుచున్నది.

రంగా.—ఆహా! ఏమీ విరుద్ధాంశములు: ఇది యంతయు విజయరామునిపన్నుగడయే యైయుండునా?

హాస.—పోని! మీ రటుచేయలే దనిరే యూహింతు మన్ననో మారాకఁగాంచి మీరూరక రణభేరి మ్రోయించుచున్నారు. మఱి నౌబతు మానుపరైతిరి. కాఁబట్టి యీక్షణమ మీరు నౌబతు చాలించి కోట ఖాలీచేసి మాకొసఁగవలయు. లేదా యుద్ధంబును సర్వబంధునాశంబు వెనువెంట నగు. పయి మీయిచ్చవచ్చినరీతిఁ జేయుఁడు. నా కేమి ప్రత్యుత్తర మిత్తురో అది వారికి నివేదించెదను.

రంగా.—సాయెబేంద్రా! మీరు చెప్పవలసినమాట లైనవికదా! వానికి మేమిచ్చెడి సమాధానముకూడ వినుఁడు. మావైరియగు విజయరామరాజు తొలుత మీయొద్దకు వచ్చియుండుటఁజేసి మీమొదటితాఖీదునకు రానించుక శంకించితిమి. మఱియు పరాసులు వచ్చి రాజమహేంద్రవరంబున నున్నారనియు, వారలతో యుద్ధ మొనరింపఁ దనకు బాసటగ రమ్మనియు విజయరామరాజు నాకు వర్తమాన మంపె. మేము దాని కంగీకరింపలేదు. బూసీదొరగారు రెండవసారి యంపినహరకాలాలను మేము [illegible]దకపోవు టట్లుండ సబహుమానంబుగఁ బంపి యుంటిమి. వా రెందులకు తద్వ్యతిరేకముగ నుడివిరో ఇదియు, విజయరామునిప్రోత్సాహ మేమో తెలియదు. ఇఁక మేము రణభేరి మ్రోయించుచుంటి మంటిరి కదా ! రెండుదినముల క్రిందట మావేంగళరాయనితోపాటు కోటలో నేఁబది వివాహములు జరిగినవి. గతరాత్రియే యూరేఁగింపు. ఆయూరేఁగింపు టుత్సవంబున వాయించెడి శుభవాద్య మది కాని, రణభేరి యెంతమాత్రమును కాదు. మీ కది నమ్మిక లేదేని మాతమ్మునిఁ గాని, యీప్రోలివంకఁగాని చూచినచో వాస్తవము తేటపడును.

హస.—(స్వగతము) ఔరా! ఈవిజయరాముఁ డెంతసాహసము చేసినాఁడు! పాపము! వీరలు వైవాహికోత్సవంబున నుండ నిదియంతయు రణసన్నాహ మని భ్రమింపఁజేసినాఁడు. (ప్రకాశముగా) తరువాత:—

రంగా.—మఱియు మేము చెప్పెడిదంతయు న్యాయబుద్ధి వితర్కించి మాకు న్యాయము దయచేయింపఁగోరెదము.

గీ. పాదుషావారొసంగ నౌబత్తు దీనిఁ
గొన్నవారము కాని మే మెన్న దొంగ
వృత్తి నార్జింపలేదు మే మేల దీని
మానవలయును? చెప్పుఁ డహీనచరిత!

అదియునుంగాక:—

శా. ఏ మీకోట బలమ్ముచే గెలువలేదే వారినీ ద్రోలి హా
కేముల్ మా కిడఁ బుచ్చుకొంటి మిచటన్ గ్రీళ్లేమివాటిల్లినన్
మేమెన్నం డిది వీడలే దిపుడ యేమీ? కోట వీడంగ నే
లా! మాకంతటి కేమివచ్చినది? పల్కన్ జెల్లు మిత్రోత్తమా!

హస.—(అంతర్గతము.) ఈనృపాలునివచోవైఖరియు ముఖవికాసంబును బట్టిచూడ నితఁడు కడు మంచివానివలెఁ గన్పట్టుచున్నాఁడు. మఱియు వితర్కించినచో నావిజయరాముఁడే దొంగవలె నున్నాఁడు. వీరిరువురకుఁగల యంతఃకలహములచే రాజు మమ్మిందులకుఁ బ్రేరేపించియుండును.

ధర్మా.—అయ్యా! సాయేబుగారూ! మీమాటలచొప్పుంబట్టి చూడ మీరు తురుష్కవంశీయులే యైనను విద్యాధికులుగఁ గన్పట్టుచున్నారు. ఎందేని లోకమం దిట్టివిపరీత ముండునా?

గీ. ఎన్నితరములనుండియో యిందె మేము
కాఁపుర మ్మున్నవారము కాని కోట
విడిచి పొమ్మంట యీనాఁటిగడియవఱకు
విని యెఱుంగము వింటిమి వీనికరుణ.

ఉ. చాలు నిఁకేమి చెప్పెద? విచారణసేయక మారిపుండు, తా
నేలినవారితోడ నెదియే వచియించిన, దాని నంతయుం
బోలఁగ సత్యమే యనుచు బుద్ధిఁ దలంతురె? మిమ్ముఁబోలు స
చ్ఛీలురు. మీరె యిట్లయినఁ జెప్పెడి దేమి? ప్రపంచకస్థితుల్.

హస.—(తనలో) ఆహా! ఈతఁ డెవఁడో నీతికోవిదునివలె నున్నాఁడు. వీని మాటలు వినుచున్నకొలఁది నమృతపుసోన లొలుకుచున్నవి. (పైకి) అయ్యలారా! ఆహైదరుజంగు పరమమూర్ఖుఁడు. వాఁ డెవరేమిచెప్పినను వినఁడు.

వెంక.—పోనిండు. వారికి మాకోటఁ గైకొనుటయే ముఖ్యోద్దేశమయినచో నట్లు సేయవచ్చును కాని,—

చ. పురహరుఁ డౌనుగాక: మముఁబోరన గెల్చినదాఁక కోట చే
కుఱదది వాస్తవమ్ము మముఁ గొట్టుచు నస్మదరాతి వానికీ
పురము నొసంగఁగాఁ బ్రతినఁ బూనినవాఁడని వింటి మున్నహై
దరు. తన కేమిధర్మ మది: తప్పనరా దధికారితప్పులన్.

వారి కంత యుద్ధమే చూడవలయునిచ్చ కలయదియేని:—

గీ. విజయనృపునకు నలువదివేలబలము
కలదు. మాకు నాలుగువేలబలము కలద.
యిరువురబలమ్ము లెదిరి సంగర మొనర్చు
బవరమును చూడుఁడీ మధ్యవర్తు లగుచు.

రంగ.—సాయెబేంద్రా! మా వెంకయగారు చెప్పినచొప్పెంతయు రమణీయముగ నున్నది. పాప మావిజయరామునకు బొబ్బిలిఁ గొనవలయు నని యాశాపిశాచము మెండుగ బాధింపుచున్నది. వారిరాచపౌరుషంబును మాపద్మనాయకకులమువారిబీరంబునుఁగూడ బారునకుఁదీర్చి తాము మధ్యవర్తులరయి చిత్తగింపుఁడు.

ఉ. ఎవ్వఁడు తా రణమ్మున జయించునొ? వానినిఁ జేరఁదీసి, మీ
రివ్వసుధాతల మ్మొసఁగుఁడీ: యటుకాక గడీని వీడి మ
మ్మివ్విధిఁ బొమ్మనంగ నగునే?యటు లాడుట మీకు న్యాయమే?
నవ్వరె యెల్లరున్: యశము నాశనమై చనదే? తొలంగినన్.

హుస.—కుట్టివాం డ్రగుటచే మీరిట్లు పలుకుచున్నారు: రాయనింగారూ! మీయభిప్రాయ మేదియో స్పష్టముగ విశదీకరింపుఁడు: నే వచ్చి చాలత డవారెను: పోవలయు.

రంగా.—అయ్యా! మీరు మాపైఁ బ్రసరింపఁజేసిన యకారణజనితకటాక్షమునకు మే మెంతయేనిఁ గృతజ్ఞులము. ఆహైదరుజంగునకు విజయరామునం డెంతయో లంచమిచ్చి యుండుటచేఁగదా! మాగడీ తీసికొని వారికొసంగ నూహించుచున్నాఁడు! కావున,

చ. అతఁ డిడుదానికన్నఁ బదియంతలసొమ్ము నబాబుగారికిన్
గొతుకకయిత్తు: నావిజయుకోటను నాకు నొసంగుఁడయ్య: స
మ్మతి యగునేని, తెల్పుఁ డనుమానము లేటికి? యాధనమ్ము ని
స్సైతమకుఁ జేర్చువాఁడఁ:గృపఁ బెంచుఁడు:వాదుడుపంగనెంచుఁడీ.

హుస.—రాయనింగారూ! మీరు మమ్ములఁ బెద్దఁ జేసి మీకష్టసుఖంబులు మాకు నివేదించి యుండుటంబట్టి నాకుఁ దోఁచిన తెఱంగు చెప్పెదను. మాహైదరుజంగనినవాఁ బరమమూర్ఖుఁడు. వానికిఁ దోఁచదు. ఒకరు చెప్పిన వినఁడు. మీ రొక్కరోజుమాత్రము కోట విడిచి పైకి పోయి యుంటిరా! ఎల్ల కార్యములఁగూడ నే సమకూర్పఁగలవాఁడను. మీనీతి వర్తనమునుఁ గూర్చి బూసిదొరగారికి చెప్పి తిరుగ మీకోట మీకిప్పించెదను. ఇఁక యుద్ధమునుగూర్చి విచారింత మన్ననో, దాదాపు రెండు లక్షలబలంబుతో నున్నవారలతో మీరు పోరఁజాల రనుట నిశ్చయము. వారిఫిరంగులయెదుట మీబాణంబులు కత్తులు నేమిపనిచేయఁగలవు? ఊరికిఁ బోయి యుంటిమని యెంచి యొకనాఁడుమాత్రము కోటవిడిచి యుండినఁజాలును.

రంగా.—సాహేబుగారూ! మీరు వచించెడి దంతయు మాసేమముకొఱకే యని తెలిసికొన్నాము. కాని,—

క. ప్రాణము లశాశ్వతమ్ములు
మానము శాశ్వతము: దాని మాని యిటుల్, సీ!
ప్రాణముల కాసఁ జేయుచు
నే నిది విడిచికొని చనుట మృష యగు సుండీ!

హుస.—అయ్యా! మీనుడులెల్ల ధర్మవర్తనములే యైనను బ్రస్తుతము సమయానుకూలముగ వర్తింపవలయునుగదా! అన్నియుఁ దెలిసియున్నతమతో నే నేమిచెప్పఁగలను: కాని,—(అర్ధోక్తిలో)

రంగా.—సత్యమే! కాని,—

మ. ఎటకేనిన్ జనుమంట: నొబతును వాయింపింపవద్దంట: బల్
కటువాక్యమ్ములు తక్కనొండుపని వీఁకన్ నేయఁగావచ్చు:నే
నిటు వాకొంటి నటంచు వేఱుగతి నూహింపంగ రా దీర తె
ప్పటికైనన్ మృతి యున్న దేకద కనన్ పాశ్చాత్యవంశోదయా!

క. పురి బిరుదు విడుచుకన్నను
మరణము కడు మేలు కాదె? మానవులకు ని
వ్వరికైనఁ దప్పునా మృతి
యరయఁగ నీనాఁడొ: రేపొ: యగు గుణధుర్యా!

సాహేబుగారూ! సలామ్: మీకుఁ గడు శ్రమ నిచ్చినారము. మావిధి యిట్లుడ్చుచుండ, మాకుఁ గయ్యము కాక, నెయ్యము సంప్రాప్త మగునా? ఇంతదనుక మాతోఁ గలసి సంభాషించినందున మీరు మాకుఁ బరమాప్తులు. మరల మీదర్శన మీజన్మంబునఁ జేసికొనుభాగ్య మున్నదో లేదో! ఎవం డెఱుఁగు? ఉంటినా ఈసింహాసన మలంకరింతు. లేదా! వీరస్వర్గ మనుభవింతు. వెంకయ్యగారూ! సాహేబుగారిని తాంబూలాది సత్కారంబుల సంభావింపుఁడు.

హూస.—అయ్యో! వెఱ్ఱిరాజా! నామాట యించుకంతయేనియు వినినాఁడవు కావేమి? వలదు సుమా! ఈవెఱ్ఱియే నీముప్పునకు హేతు వగునేమో యని భీతిల్లుచున్నాఁడ.

రంగా.—విశేషము వలదు. దుఃఖమునకుఁ గారణము.

హూస.—అల్లా! అల్లా! సలామ్; (వెంకయ్యతో నిష్క్రమణము. పునఃప్రవేశము వెంకయ్య.)

రంగా.—అయ్యలారా! ఎన్నివిధంబులఁ గయ్య మాఁగఁజూచినను ఆఁగు జాడ సుంతయేని కన్పట్టకున్నది. నౌబత్తు మాన్పించి కోట విడిచిపోయినచో సంధి కుదురు ననియు లేనిచో రంధి సిద్ధ మనియు నిష్కర్షగా తేలినది.

చ. కనికరమన్న సుంతయును గానఁగరాని దయావిహీనులం
దును గడు మోఱకుండఁట! కనుంగొన హైదరువాఁడు వెల్మమా
నినుల నెటుల్ కనుంగొనునొ? నీచత వారలమానభంగమున్
బొనరుపనెంచునో? యకట! ముప్పొడఁగూడెనిఁ కేమి సేయుదున్?

మనవెంగళరాయఁడు కాంతాజనంబులఁ గొని యెగవ్వారప్రదేశంబులకో చని వారల భద్రముగఁ గాపాడుచుండినచో బాగుగ నుండునని నాతాత్పర్యము.

వెంగ.—అన్నయ్యగారూ! మీరు నన్నిట్టి నీచకృత్యమునకు నియోగించినచో నేనేమి మనవి సేయఁగలవాఁడను? విక్రమరహితులగు పిఱికిపంద లాచరింపవలసిన తుచ్ఛకృత్యము నాచేఁ జేయింపఁబంపుచు ఆఁడువాండ్రతోఁ గూడి నన్నుంగూడ వలస వీడిపొమ్మనుట మీకు న్యాయమా?

రంగా.—కాదోయి తమ్ముఁడా! ఇప్పుడు జరుగఁబోవు సంగ్రామమందు జయం బెదిరికే కలుగునేమో యని శంకించుచున్నాఁడ! అట్టియెడ దురాత్ముఁడగు రామరాజు మనయవరోధజనంబునకు మానభంగ మొనరింపఁ బ్రయత్నింపఁడా? మఱియు నీవుఁగూడ మాతోపాటైన నిఁక విజయరామునిపైఁ బగ సాధించువా రెవరు?

వెంగ.—మీ రట్లానతిచ్చిన నే నేమి సేయఁగలను? కానిండు. మీయాజ్ఞ రాణివాసంబునకుఁ దెల్పి, వారలఁ బ్రయాణసన్నద్ధలఁ జేసివచ్చెద. వారి సంరక్షణార్థమయి పాపయగారిని నియోగించి యేఁగూడ యుద్ధరంగంబునకు వచ్చెదను. (నిష్క్రమించును.)

రంగా:—అన్నలారా! పరాసువారు మనకు సందేశ మంపియున్నారుకదా! ఇప్పుడు మనము వారికి తిరుగ సందేశ మంపక యుద్ధ మొనరించుట ధర్మవిరుద్ధ మగును. అదియుఁగాక యీహాసనల్లీఖానుఁడు మనలఁగూర్చి బూసీదొరగారితో మంచిగ నివేదించు నని తోఁచుచున్నది. అది వినిన పిదప వారలమానస మేమేని తిరుగకుండునా?

నర.—మీ రూహించినట్లుగ నొకరాయబారిని వారియండ కంపినచో మిగుల బాగుగ నుండు నని నాయభిప్రాయము.

వెంక.—కాలము గడపిన ధర్మారాయనింగారైనచోఁ జతురగతులఁ గార్యము సాధింపఁగల రని నానమ్మకము.

రంగా.—మామా! ఈసంధానకృత్యము మాహిత మభిలషించి యంగీకరింప వేఁడెదను,—

గీ. రావువంశంబు కీర్తికి తావటంచుఁ
జేసు తెచ్చితి రీర మావారి కెల్ల
నిపుడు తద్వంశమున్ నిల్ప నెంచుఁడయ్య
తమరు దూతగ నటు పోయి ధర్మరాయ!

ఎల్లయంశంబులుఁగూడఁ దమకుఁ గరతలామలకంబుల. తమచతురత నను సంధించి సంధియే పొసగింతురో, రంధియే సమకూర్తురో? తమచిత్తము.

ధర్మా.—వత్సా! దీనికయి నాతో నీ వింతగ చెప్పవలయునా? ఏ నటకుఁ బోయి సత్వరంబ వచ్చెదను. నాకు మొదలనొసంగుము. (నిష్క్రమించుచున్నాఁడు.)

వేంగళరావు.—(ప్రవేశించి) అన్నయ్యగారూ! నేను వెళ్లి తమయాజ్ఞ స్త్రీజనంబులతోఁ జెప్పఁగా, వారు తమతో నేమియో మనవి సేయవలసియున్నదని చెప్పి, వదినెగారిచ్చుటకే వచ్చుచున్నారు.

రంగా.—ఏమి! రాణివాస మిచ్చటికే వచ్చుచున్నదా? ఎంతదుర్ణయము! వాండ్ర కేమేని పిచ్చియెత్తియుండనోపు! (సభ్యుల నుద్దేశించి) సదస్యులారా! మీ రింక నిండ్లకుఁ బోయి సమరసన్నాహంబులలో నుండుఁడు. ధర్మారాయనింగారిరాయబారముసార మెఱింగి మీ కిపుడె కబు రంపెదను.

[వెంకయ్య, బుచ్చన్న-నరసారాయఁడు నిష్క్రమింతురు. చినరంగారాయు నెత్తికొని పటాక్షేపంబుగ మల్లమాంబ ప్రవేశించుచున్నది.]

రంగా.—దేవీ! నీ కేమేని మతిపోయినదా యేమి? ఘోషాగల యవరోధజంబు లిటు పలువురుగల సభారంగమునకు రాఁజెల్లునే? ఇంక నేని యీపను లుడిగి నీపని నివేదించి యింటికిఁ బొమ్ము.

మల్ల.—నాథా! క్షమింపవలయు; నా కిపుడు మీమాటలు వినుచున్న కొలఁదిని మతియే పోవుచున్నది. ఆకటా! పవిత్రపద్మనాయకవంశంబునఁ బ్రభవించి, క్షాత్రమే ధర్మముగా నింతవఱకు నిల్పికొనిన మీ కీనాఁటి కాబుద్ధి పోయి పాడురాచబుద్ధి యలవడినదేమి? మీకే గాని మాకుమాత్రము వలసవిడిచిపోవుట యవమానకరము కాదా? గడియకో గడియకో కోటలో శత్రువులు ప్రవేశించి మమ్ముల వెడలనడుప నుద్యమించుతఱి యింకను ఘోషా యని పీఁకులాడుచున్నారు. మాఘోషా యంతయు ఘోషచేసినాఁడు కదా! యీవిజయరామరాజు. మీ రందఱు యుద్ధమునందుఁబడి మ్రగ్గినపిదప మేము ఆఁలవలె బ్రదికి, కోట పరిపాలించుకొందు మని యా మమ్మెటకో పంపనెంచుచున్నారు.

ఉ. మమ్మెటకేనిఁ బంపి యవమానము కావఁదలంచినారు: క
య్యమ్మున మీరలుండ నకటా! యొటకేనియుఁబోయి మేము ప్రా
ణమ్ముల నిల్పనెంచుట ఘనమ్మగునే? యదికాక మేము మా
త్రమ్మిదిచేసినాము నగరమ్మును వీడఁగఁ బ్రాణనాయకా!

రంగా.—(నిట్టూర్పు పుచ్చి) అయ్యో! నేను దుర్మార్గుఁడను. పాపిని. ఛీ! ఈరావువంశమ్మున కంతటికి నపకీర్తిఁ దెచ్చుటకయి యుద్భవించినాఁడను.

మల్ల.—ఇది యేమిది? కడుంగడు సంతోషింపవలసినకాలము తటస్థింపఁగా నాఁడుదానివలె వాపోయుచున్నారు. పూర్వభవమున నెంత మహోత్కృష్టమయిన పుణ్యము చేసిననో కదా, ఎల్లరుఁ గొనియాడఁదగిన వీరమరణము. అందును నిట్టిసంఘాతమరణము తటస్థించుము. ఇదియా! మీ పౌరుషము. లెండు లెండు: ఎల్లరకుంగూడ సమరోత్సాహంబు కలుగునట్లు రణభేరి మ్రోయింపుఁడు. మరల రేఁపటిదినంబున నీమమ్మెల్లరఁ జూతురో చూడరో ఇప్పుడే యొక్కసారి కన్నుల కఱవు దీఱఁ జూడుఁడు. ఇదిగో! మీముద్దులకొడుకు మీవంక కెట్లు చూచుచున్నాఁడో! మీయొద్దకు వచ్చుటకు చేతులు చాఁచుచున్నాఁడు. (బాలు నుద్దేశించి) నాయనా! చూడుమోయి! మీతండ్రిగారిముఖకళ. రేఁపు మరల చూతువో చూడవో?

రంగా.—(విచారముతో) తండ్రీ! చినరంగరాయా! ముద్దులపట్టీ!

ఉ. ఎట్టిముహూర్తమందు జనియించినవాఁడవొ? ముద్దులయ్య! ని
న్నెట్టులు గమ్మటంచు లిఖియించెనె? యీవిధివ్రాలు! అయ్యయో!
పట్టుగ నాలుగేండ్లయినఁ బ్రాయము కల్గెనొ? లేదొ! పైని నీ
కెట్టియవస్థ వచ్చె? రిపు లేమియొనర్తురొ? నిన్నుఁ గాంచుచో.

అయ్యో! తండ్రీ! నీ కెంతలో నెంతగతి వచ్చినదిరా! నాయనా!

సీ. అయ్యయ్యొ యంతటివాఁడ వగుదం చతని పేరు
నిడినాఁడ నిటులంచు నెఱుఁగనైతి
జనులెన్న రాజ్యపాలన సేయు దని సంత
సించితిఁ గాని యిట్లెంచనైతి
పలువురయ్యాడిగమ్ములఁ గొందు వంచు సం
బరపడి నాఁడ నిట్లరయనైతి

నను గన్నచిన్నినాయన! నీకు నీపాట్లు
  నలువ వ్రాసె నటంచుఁ దలఁపనైతి
తే. రాచవానికో! తురకలకో! చివరకు
 నూడిగము సేయ నీ వుండువాఁడవఁటర!
 కొడుక పుట్టితి వేల? నాకడుపునందు
 కటకటా! యిట్టిపనులు సేయుటకె తండ్రి!

వేంగ.—అన్నయ్యగారూ! మీ రిట్లేడ్చుచుండిన నాకడుపు తరిగికొనిపోవుచున్నది. మమ్ములనందఱ నిట్లేడ్పించుట మీకేమేని న్యాయమా?

గీ. పురుషసింహులు ధైర్యమందరమహీధ్రు
 లట్టిమీరలె యీరీతి నడలువడఁగఁ
 జెల్లరే! వధూనికకు నేమి చెప్పఁగలను
 వలవ దుడుగుము శోకింపవలవ దన్న!

రంగా.—(దుఃఖముతో) తమ్ముఁడా! ఈముద్దుఁగూనమొగంబు చూచుచు నే నెట్లు విచార మాఁపికొనఁగలను? నాముద్దులయ్య తనకును ముసుకుమారము లగు చేతులతో నాచండాలుర కూడిగము సేయవలసివచ్చెఁగదా! చూడుమోయి మానాయన యెట్లు చూచుచున్నాఁడో! తండ్రీ! ఏల నామొగమువంక కట్లుచూచెదవు? నీకును, నాకునుఁగూడ నినాఁటితో ఋణానుబంధము తీరిపోవునా? హా కుమారా!

చ. కలువల నీసడించునునుగన్నులఁ గాంచెద వేల తండ్రి! యీ
 తులువలు నీకు నాకిటులు దూరము సేయఁగనున్నవార లె
 ట్టులిఁకను తాళుకొందును. కడుం బసిపాపఁడవైన నీకు ము
 ప్పులు ఘటియిల్లునంచుఁ దలపోసిన డెందము కొందలంపడున్.

తండ్రీ! నీవు లేకున్న మానేఁగాక! నీ వాతురకలకు బానిస వౌదువని యోజించినకొలఁది హృదయభార మమితం బగుచున్నది. తండ్రిలేనిబిడ్డఁడవగు నిన్ను వారేమి చేయుదురో! ఇదిగో! నినుఁ జంపి నేనే బిడ్డఁడు లేనితండ్రి నయ్యెదను. (బాలుని నఱుకఁబోవును.)

మల్ల.—(అపవారించి) ఆహాహా! ఈరేచెర్ల గోత్రోద్భవుల కంతకంతకు బుద్ధి పెడతలకుఁ దిరుగుచున్నది కాఁబోలు? ఏమీ వెఱ్ఱి? మనల నింతగఁ జేసిన యాదురాత్ముఁడగు విజయరామునిపైఁ బగఁ దీర్చికొనుట కేమాత్రమేని మగపురుఁ గుండనక్కఱ లేదా! ఈనాచిన్నికూనను సురక్షితముగ చామర్లకోట కంపెదను.

చినరంగా:—ఉఁఊ! నేను తామల్లకోత యెందుకెల్తాను? నేను మాత్రం యుద్ధం సెయ్యొద్దాయేంటి?

రంగా.—(బాలు నెత్తికొని ముద్దాడి) నాయనా! నీవును యుద్ధము చేసెదవఁటరా! నీయుద్ధము చూచి యానందించుట కీనిర్భాగ్యుఁడు నోచుకొనలేదు తండ్రీ!

క. నిండుగ నాల్గేండ్లేనియు
 నిండనిపసిపాపఁడవుర! నీ విట్లైనన్
 గుండెలు తరుగఁదొడంగె ని
 త్యం డోకవగతుండు కాక తండ్రియె నీకున్?

 కుమారా! దైవము మన కిప్పు డెంత ప్రతికూలుఁడై యున్నాఁడురా! అయ్యో! మనగోపాలస్వామికేని మనపయిఁ గరుణ కలుగదాయెఁ గదా!

వేంగ.—అన్నయ్యగారూ! తగుప్రయత్నములలో నుండక మీరిట్లు విచారించుచుండినచోఁ గార్యము సానుకూల మగునా? ఇప్పటికేని ముందు ప్రయత్న మాలోచింపవలదా!

రంగా.—అయ్యో! నామనము నామనమునం దుండినప్పుడు కదా! ఆలోచించుట! అది యిప్పు డిందులేక యెందో పోయియున్నది. ఇఁక నేమి యాలోచించుట? అయ్యయ్యో! చూచితివా! తమ్మయ్యా! నాగుండె లెట్లదరుచున్నవో! వామాక్షిస్పందనముకూడ నపశకునము సూచించుచున్నది. ఇదియంతయుఁ జూడ, మన కపజయ మనియే తోఁచుచున్నది. తమ్ముఁడా!

వేంగ.—అన్నయ్యగారూ! ప్రతాపశీలురగు తమ రీతిని దిగులొందుచుం
డుట యేమేని యుచితముగ నున్నదా? తమరే యిట్లగుచున్న మాకు
ధైర్యము చెప్పువా రెవరు?

మ. ధరణీచక్రము క్రుంగలే, దుడులపాతమ్మేని కాలేదు, భా
స్కరచంద్రాద్యఖిలగ్రహావళియు సంచారమ్ముఁ దప్పంగలే,
దొరగన్ లేదు నభస్తలమ్మవనిపై నూహింప, హా! మంగళే
తరమౌ పల్కులనేటికిం బలుక నుత్కంఠన్ ధరాఖండలా!

రంగా.—తమ్ముఁడా! ఒకతల్లికడుపునఁ బుట్టినవారము. పెద్దవాఁడ నగుటం
జేసి నాకు రాజ్యము వచ్చినది కాని లేనిచో నీవే రాజవై యుందువు
కదా! రాజ్యగర్వమున నేను నీకేమయిన నపచారము చేసియున్నానా?
నాకన్న నెక్కుడుగఁ జూచికొనుచుండెడివాఁడను. ఒకవేళ నా కెఱుఁ
గరాకుండ నీకేమేని యపచారము చేసియున్నానేమో? వానినెల్ల
మన్నింపుమా!

సీ. అనుజుఁడా! నీయెడ నపచార మే దేని
నేఁ జేసియున్న మన్నింపుమయ్య!
అపుడప్డు నిన్నాగ్రహమ్మునఁ జూచినం
దులకు వేఱుగ మదిన్ దలఁపకయ్య!
యెఱిఁగి యెఱుంగక యేఁ జేసినట్టి దో
షముల కెంతయు నన్ను సైఁపుమయ్య!
చిఱుత వంచును పనుల్ చెప్పి చేయించితిఁ
గాన నందులకయి కనలకయ్య!
తే. ఒక్కతల్లిబిడ్డలము నేఁ డిక్క డుంటి
మింక తే పేడ నుందుమో యెఱుఁగమయ్య!
లీల నొకసారి నన్ గౌఁగిలింపుమయ్య!
మమ్ము నీమానసమ్మున మఱువకయ్య!

తమ్ముఁడా! నాయొద్ద కొకసారి రమ్ము. నాప్రేమ దీఱ నిన్నొకసారి కౌఁ
గిలించుకొననిమ్ము. నేఁటికి దైవము మనల నెడఁబాటు సేయ సంకల్పించి
నాఁడేమో?—తమ్ముఁడా! నీయుల్లాసమున కేమేని వ్యతిరేకముగఁ బ్రవ
ర్తించి యుండలేదుకదా?

వేంగ.—(ఏడ్చుచు) అన్నయ్యగారూ! మీ రేల నన్నిట్లు చేసెదరు? మీరు
నాయెడ నేమి యపచారముఁ గావించియున్నారు?

శా. ఏలా జాలినిఁ బెట్టెదన్న! మము నీవేలా వగంగుందె ది
ట్లేలా ధైర్యము తూలపుచ్చెద వయో! యీలీలగా నేల య
శ్లీలోక్తుల్ వచియించుచుండెదవు? మేలే యిట్టులాడంగ స
చ్ఛీలా! త్వాదృశులైనవారలె యిటుల్ చింతింపఁగాఁ జెల్లునే?
(ప్రవేశము పటాక్షేపంబుగ నెత్తుటం దోఁగుచు ధర్మారాయఁడు)

రంగా.—మామయ్యగారూ! ఏల మీరిట్లు ప్రళయకాలరుద్రునిభంగి వీరా
వేశంబున నెత్తుటం దోఁగుచు వచ్చినారు? మీరు పోయియుండినకా
ర్యము కాయా పండా?

ధర్మా.—ఎప్పుడేని పండగునని నేనుమాత్ర మనుకొంటినా?

వేంగ.—ఏమైనదో సంగ్రహముగఁ జెప్పుఁడు: పిదపఁ గర్తవ్యము నిర్ణయిం
తము.

ధర్మా.—మీరు చెప్పినచొప్పున నే నాపరాసువాని భేటికిం బోయి, బూసీ
దొరం గని నయవినయగతుల మాటలాడితిని. నే నెంత చెప్పినను వారు
వినక నాబలము మాన్పింపవలయు, కోట విడిచి పోవలయు. లేదేని యుద్ధ
ము తప్పదని చెప్పిరి: ఆయనయొద్దనుండి నేను మరలి వచ్చుచుండఁగా
దురాత్ముఁడగు నాహైదరుపంపునఁ గొందఱుతురకలు వచ్చి నన్నడ్డగిం
చిరి.

రంగా.—ఆక్రూరాత్ముల కాయువు మూఁడియుండనోపు! లేదేని యట్లొనరిం
తురా? అనంతర మేమిజరిగినది?

ధర్మా.—అంత నేను వారలదుర్మంత్ర మెఱింగి,—

చ. చటులగతిఁ గటారిఁ గొని, సాహసలీలఁ దురుష్కసేన ని
క్కటిగనుఁదాఁకి యాప్రళయకాలపురాంతకుఁడో యనంగని
క్కటముగ నాయరాతులనుఁ గూల్చితి: నడ్డినవారినెల్ల దోః
పటిమను జూపి చంపితిని, పాఱినవారిని వీడిపుచ్చితిన్.

ఇట్లు నేను విజృంభించుటఁ జూచి హైదరుజంగును, విజయరాముఁడును బలంబులఁ బురికొల్పుచు నాపైకి వచ్చిరి.

వెంక.—అదురాత్ముల కింతవెలమపోటు చవిచూపితి రదియే నాకుఁ బరమానందము. కాని, మిమ్ములఁ దాఁకిన యావిజయరామచండాలుని ధాత్రికి బలియిచ్చి వచ్చితిరా!

ధర్మా.—నాయనా! అట్లు కావలసినదే కాని, వాఁడు పలాయనుఁ డగుటఁ జేసి బ్రదుకఁగలిగినాఁడు. ఎంతమంది వచ్చినను లక్ష్యము సేయక వారల తలకాయలు వెలగపండ్లవలె రాల్చివచ్చితిని. ఎల్లవిధంబులఁగూడ యుద్ధమే నిశ్చయంబు! వారలకన్న మునుముందుగ మనమే యుద్ధప్రారంభ మొనరించితిమేని ముందుగ వారిం గొందఱఁ జంపఁగల్గుదుము.

రంగా.—మామయ్యగారూ! మిమ్ముల నియోగించితి మని యెంచక మనదళవాయుల నందఱ నొకపరి సభారంగమునకుఁ బిలిచికొని వచ్చెదరా? కార్యము చర్చింతము.

ధర్మా.—ఇట్టియవస్థలలో నాలోచించుట లెందులకు? అవశ్యమట్లే కొని వచ్చెదను. (నిష్క్రమించును.)

మల్ల.—నాథా! మీరింకఁ గార్యాలోచనమం దుండుఁడు: ఏనుం బోయి కుఱ్ఱవాని నవ్వుల కంపుయత్నంబున నుండెదను:—మనోహరా! నాజీవధనమా! నానోములపంటా! నాథా! మరల మీపాదాభివందనభాగ్యము లభించునో లభింపదో! ఇదే! నాతుదివందనముఁ గైకొనుఁడు. (భర్తకు ప్రణమిల్లి సాష్టాంగపడి పాదములు ముద్దుఁగొని కండ్ల కద్దుకొని నిలువంబడును.)

రంగా.—దేవీ! నీయునికి నాకు మఱింత దుఃఖహేతువు కావున సత్వరంబ నీవరుగుము.

మల్ల.—మీకులదేవతలు సహాయపడుదురుగాక: (నిష్క్రాంత యగును.)

రంగా.—తమ్ముఁడా! ఎంతని యూఱడించుకొంద మన్నను మన మూరట చెందకున్నది. అయ్యయో! ఇంకనుఁ బెండ్లిండ్లైనఁ బూర్తిగ కాలేదే? ఈపెండ్లికంకణమ్ములే నీకు వీరకంకణమ్ములయ్యెఁగా! హా! వధూవరులారా!

గీ. అకట! మధుపర్కముల్ విడువకయె నేడు
ఎల్లవరులు యుద్ధమునకు నేఁగవలెనె?
భావిగతి యేమి యానో? ఆహా! వివాహ
కంకణమ్ములె వీరకంకణము లయ్యె.

వెంక.—అన్నయ్యగారూ! మీ కాచింత యావంతయు నుండనక్కఱ లేదు. మా కీయుద్ధమే పెండ్లికన్న నానందజనకముగ నున్నది.

ధర్మారాయఁడు, బుచ్చన్న, వేంకయ్య, కొందఱు వీరులు ప్రవేశింతురు.

రంగా.—ఓ వీరవరేణ్యులారా! మిమ్మెల్లరఁ బిలిపించినకార్యము సావధానులరై వినుదురుగాక! ఎన్నివిధంబుల సంధి ననుసంధించినను సంధి కుదరక రంధియే పొసఁగినది: ఇఁక బొబ్బిలిపురనాశనంబు తప్పదు. భార్యాపుత్త్రులయందు మమకారము గలవారును, ఇంకనుఁ బెండ్లిపసుపుబట్టల నేని విప్పనివారును, అగువారి మాతోపాటు యుద్ధమున కూఁతము గం డని పిల్వ మన సొప్పకున్నది. కావున మమ్ములఁగూర్చి మీ కేల వైరుల ఫిరంగిపరంపరల మ్రగ్గెదరు? మీ రెందేనిఁ జని బ్రదుకుఁడు.

వెంక.—మహాప్రభూ! మాకు మీప్రాణములకన్న మాప్రాణములును, ఈపెండ్లిండ్లు నెక్కుడని తలంచుచున్నారా? అది కల్ల!

చ. తమరిడునన్నమున్ మెసవి, తామిడువస్త్రములన్ ధరించి, యు
త్తములగు తమ్ములం గలసి, ధర్మపథంబున సంచరించి, కా

లము నను డెంచినప్పుడు బళా! మీము వీడుచు నెందో పోయి జీ
వము నిలుపందలంచుటకు వందులమే? తినమే? ప్రసాదమున్.

బుచ్చ.—ఇంక మేము చచ్చిపోయెద మనియు, ఏమేమియో యనియు సెలవిచ్చుచున్నారు. అట్లే జరుగుఁగాక!

మ. మరణ మ్మెప్పటికైన నున్నదియె వేమాఱ్లుండునా? మేము దే
వరనుం గొల్చినవారమే కద! రణవ్యాసంగమున్ సల్ప డె
ప్పరమౌ తొందరఁ జెందెడిన్ మనముభూపా? 'మీరుపో పొండు సం
గరమున్ సల్పి జయంబుఁ గొండ' నుచుఁ బల్కం గూడదా పేరిమిన్.

వేఁగువాఁడు.—(ప్రవేశించి) దేవా! ఇంకేమున్నది? అప్పుడే పరిపంథి సైన్యంబు కోటముట్టడించి గోడలఁగూల్చుటకయి ఫిరంగులఁ బేల్చుచున్నారు. తొందరపడవలయు.

రంగా.—అన్నలారా! సమయ మాసన్న మయ్యె. అదిగో! ఫిరంగులచప్పుడు లెట్లు వినిపించుచున్నవో వినుఁడు. ఇదియే మన మందఱము తుదిసారి కలసికొనుట! రేపటిదినంబున నేమగుదుమో? ఇఁకఁ ద్వరపడవలయు. మనము కోటలోనుండియే యుద్ధముఁ జేయవలయును కాని, బయటి కేఁగిన వెంటనే హతుల మగుదుము. ఇఁక సైన్యవిభాగము చేసికొందము.

తూర్పుబురుజుపయినుండి మనజెండాను, నౌబతును కాపాడుటకును, ఆవంకవారితో యుద్ధము సేయుటకును బాపయ్యగా రేనూఱుకాల్బలముతో నుండవలయు. దక్షిణమువంకఁ బాణిద్వారముఁ గాపాడుచు వేంగళరాయఁడు నాల్గువందలబలంబుతో నుండు. పశ్చిమదిశ బుచ్చన్నగా రేనూఱుమందితో నావంకబురుజుఁ గాపాడవలయు. ఉత్తరమున మిగిలినసేనం గొని వెంకయ్యగారు సమర మొనరింతురు. తలుపు లొకవేళఁ దెఱవఁబడెనేని, యరిబలంబునం బడి మన మందఱము సంకులసమరంబుఁ జేయుదము. ధర్మారావుగా రీసేనకంతకు నధికారిగ నుందురు. ఏ నెల్లెడ

సంచరించుచు వలయుచోట సమర మొనరించెద. మామా! నాయూహ సరిగా నున్నదా!

ధర్మా.—మిగుల లెస్సగ నున్నది. అప్పుడే సమర మారంభ మగుచున్నది. త్వరపడకున్నఁ గోట భేదింపఁబడును. వత్సా! రంగరాయా! ఏ నా కాల వచ్చెడిసేనావారంబుతో,—

శా. బాహాబాహి కచాకచిన్ బెనఁగి దర్పమ్మెల్లఁ జూపించి సం
దేహమ్మించుకలేక యావిజయధాత్రీనేత సైన్యమ్ములన్
"త్రాహి త్రాహి" యొనర్చకున్న యెడ ధర్మారాయఁడన్ గాను; నీ
దేహమ్మంటి ప్రతిజ్ఞఁ గొంటిని ధరిత్రీనాథ వేయేటికిన్.—

(తెరదిగును.)

శ్రీ ర స్తు.

ఓంనమో మార్తండగురుపరబ్రహ్మణే.

శూర బొబ్బిలి.

చతుర్థాంకము.

రంగము-గోపాలాలయప్రాంతము.

మల్లమదేవి-వేంకట లక్ష్మి-చినరంగారాయ లుందురు.

మల్ల.—వేంకటలక్ష్మీ! నే నెంత వలదనుచున్నను వినక, యామూర్ఖుని చెంతకేల పంపితివే బాబు. దీనిం దొరగారు విందురేని యేమందురో కదా! ఎవరికయినను దయకలుగును కాని, యాఱాతిగుండెవానికి దయ కలుగునఁటే?

వేంక.—అమ్మా! నేనంపినసందేశము వినినపిదప నెట్టిఱాతిగుండెవానికయినను దయకలుగకపోవునా? నాపంపినసందేశము వినక యిట్లందువా?

మల్ల.—ఏదీ? ఒక్కసారి చెప్పుము. విందము.

వేంక.—వానికే నంపినసందేశ మిది:

చ. అనుజునివంటివాఁడవు కదన్న! సహోదరి నాదునన్న! నా
తనయునిఁ జూడుమన్న! దయఁ దప్పకుమన్న! వెడంగుచేష్టలన్
గొనఁజనదన్న! నాపసుపుకుంకుమ నిల్పఁగదన్న! నాపయిన్
గనికర ముంచుమన్న! కడకంటనుగాంచకుమన్న మ్రొక్కెదన్.

మల్ల.—వేంకటలక్ష్మీ! నీ వెంతదానవేని యగుదువే; కార్యసాఫల్యము కొఱకు మనయిలువేల్పగు గోపాలస్వామి నర్చించికొందము. ఇంతలో నీసందేశమునకుఁ బ్రత్యుత్తరముకూడ రాఁగలదు:

క. మనపాలిదేవదేవుఁడు
మనపాలిఁటికల్పకుజము మననిధి మనలన్
మనఁజేసెడిగోపాలుని
వినుతింపఁగ రాఁగదమ్మ; వేంకటలక్ష్మీ!

తెరనెత్తుసరికి గోపాలాలయము గోపాలస్వామి నుందురు.

మల్ల.—(చేతులు జోడించి)

శా. దేవా! ద్రోవది చింతలన్ బొగిలి నిన్ దీనాత్మయై "ప్రోవవే
రావే!" యంచని వేఁడ నామె నపుడే రక్షింపఁగా లేదె? నన్
గావన్ రావె? కృపన్ గనుంగొనవె? దీనన్ నన్నుఁ గాపాడవే?
నీవే దిక్కు కదయ్య వెల్మలకు, తండ్రీ! యాపదుద్ధారకా!

దేవాధిదేవా! మహానుభావా!

శా. మావంశోన్నతిఁ గోరి నీవ యెపుడున్ బాలించుచున్నావు; ని
న్నేవేళన్ మది భక్తిఁ గొల్చితిమి సామీ! నీవ కాకున్న మ
మ్మేవారల్ దయఁ జూచువార లిఁక రక్షింపవే! కావవే!
నీవే దిక్కు కదయ్య వెల్మలకుఁ దండ్రీ! యాపదుద్ధారకా!

వేంక.—(నిమీలితలోచన యయి)

శా. ఈవే సర్వము నిర్వహింపఁగల వీవే మమ్ముఁ బుట్టింపఁగాఁ
ద్రోవంగా, లయమున్ బొనర్పఁగ నినున్ బూజింతుమే వేళఁ గా
కోవే? మే మిడుసేవ లన్నియును గోర్కుల్ మీఱఁగాపాడవే?
నీవే దిక్కు కదయ్య వెల్మలకు దండ్రీ! యాపదుద్ధారకా!

వేంక.—అయ్యో! అయ్యో! సర్వము నాశన మైనది. ఇంకే మున్నది!

ఇంకేమున్నది ? మానోఁచిననోము లన్నియు నిష్ఫలము లయ్యెనా ? మస్తామెడివేల్పులందఱును ప్రతికూలు రైనారా ?

వేంక.—(విని) అమంగళము ; అమంగళము. దేవీ ! ఇఁక యుద్ధంబున సర్వబంధునాశన మగుటయు తప్పదు. మన మేమిచేసినను, అమంగళములు. అపశకునంబులుఁ బెక్కులు కన్పడుచున్నవి.

కమల:—(ప్రవేశించి) అయ్యో ! అయ్యో ! సర్వము నాశన మైనది. ఇంకేమున్నది? ఇంకేమున్నది ? మానోఁచిననోము లన్నియు నిష్ఫలము లయ్యెనా! మస్తామెడి వేల్పులందఱును ప్రతికూలు రైనారా?

వేంక.—కమలా! నీవు పోయియుండినకార్య మెట్లు పరిణమించినదో సంగ్రహముగ చెప్పుము.

కమ.—అమ్మా! వారికి మీరిచ్చినజాబీయఁగా మండిపడి "ఏమీ! మల్లి మాకు వర్తమాన మంపినదా" యని "పోనీ! చదివి చూచెదఁగాక" యని జాబు చదువుకొని "ఆహా! ఇది చాల మాయలమల్లివలె కన్పించుచున్నద" ని చెప్పి యిది లిఖించి మీ కిమ్మనినారు. (జాబందిచ్చును.)

మల్లి.—వేంకటలక్ష్మీ: అం దేమున్నదో చదువుము విందము.

వేంక.—(జాబు విప్పి చదువును.)

చ. చెలియల: నీదులేఖ నను చేరెఁగదమ్మ: ఇఁకేల నేఁడె బొ
బ్బిలి నశియించునమ్మ: దురపిల్లకుమమ్మ: మగండు పోవునం
దులకు విచార మేటికి? నిన్నుఁ గడుఁగొప్పగఁ గాంతునమ్మ: నా
వలసకు రాఁగదమ్మ: పగవాఁడను కానుగదమ్మ: మల్లమా!

కమ.—ఇది యిచ్చి యింకొకమాటకూడ చెప్పుమనినారు: "బొబ్బిలి జయించి, యాకోటలోఁ బాగాకుఁ బండించి, చుట్టకాల్చకపోయినచో ప్రాంతపగలు తీరవు. ఇందులకయి విచారింపకుము. నీకు భరణముగ మూఁడు గ్రామము లిచ్చెదను. నీ కిష్టమైనచో వెంటనే నాయొద్దకు రమ్ము: లేనిచోఁ గోటలోఁ జిచ్చిడికొని బలవంతముగఁ జావవలసినదే కాని, బొబ్బిలి నుపేక్షింపక మానము" అని.

వేంక.—అబ్బా ! మూర్ఖుఁడా ! ఇనుమునైనను కరఁగింపవచ్చును గాని, వజ్రసన్నిభమైన నీహృదయము కరఁగినది కాదురా ! మాప్రభువులఁ జంపి వారిరాణికి భరణ మిచ్చెద నని యూహించెదవురా!

మల్లి.—(శోకక్రోధములతో)

శా. నేనే నాపతిపాదపద్మముల హృన్నీరేజమం దుంచి, యా
భూనాథుల్ గడుఁ గొల్తునేని నృహరిన్ బూజింతునేనిన్ ననున్
హీనాలాపము లాడినట్టియరి సందేహమ్ము లేకుండఁ దాఁ
బ్రాణమ్ముల్ విడుఁగాక! స్వీయకులవిధ్వంసంబు నొఁ గావుతన్.

వేంకటలక్ష్మీ! నే నెందులకును విచారింపనుగాని,—

ఉ. రావుకులంబునం బొడమి, రాజితకీర్తి వహించునంచు నే
నీవెతితండ్రి నమ్మితిన: యిట్లుగ నౌనని యెంచనైతి నిం
కేవిధి వీఁడు దక్కు మనయెల్లరకున్ జల మీయ శత్రువుల్
వావిరి వీనిఁ గాంచి బలవంతము గా వధియింప కుందురే?

వేంక.—అమ్మా: సర్వము నశించుటకయినయే కదా! ఈఘోరయుద్ధము సంప్రాప్తించినది. ఈబాలుని జగ్గమదేవిగారియొద్ద కంపెదనంటిరే: పంపరాదా ?

మల్లి.—లక్ష్మీ! ఇఁక నీవు జాగుసేయక నాముద్దులయ్యం గొని, చామర్లకోటకుం జనుము. నే మందఱ మీయగ్గిం బడి మ్రగ్గెదము.—ఓసీ: మా తండ్రిని నీచేతులలోఁ బెట్టి యప్పగించుచున్నాను. మా నాయన నెట్లు బ్రదికించెదవో !

వేంక.—అమ్మా ! మీరందఱును గతించినపిదప నేనుమాత్ర మీభూమిపయి నుండుదాననా ? నేనుమాత్రము మీతోపాటిదాననుగానా ?

మల్లి.—ఓసీ ! అట్లనకు ! మానాయన యొక్కండేని బ్రదికియుండెనా, మనయెల్లరకుంగూడ తిలోదకము లిచ్చును. వాఁడుగూడ మనతోపాటైన నింక విజయరామునిపైఁ బగసాధించువా రెవరు ? — అదుర్తా

ర్గఁడు నాకుమారునిఁ గొనిపోవుచుండుట చూచెనేని బ్రదుకనీయఁడు కావున వీనికి బ్రాహ్మణవేషము వేసి తీసికొనిపొమ్ము. లక్ష్మీ! మానాయన మొగంబున నింతవిభూతి యలఁదవే? నాయనా! కుమారా!

సీ. కస్తూరి యలఁద నేఁ గాంక్షించితిని కాని
ఇటు విభూతి యలంది యే నెఱుంగ
తలనున్నఁ ద్రుప్వి పూవుల నుంచితిని కాని
కురులెల్ల నిటు చిక్కుపఱచి యెఱుఁగ
పట్టుదుకూలముల్ గట్టనిచ్చితిఁ గాని
ఇటు లంగవస్త్రమ్ము లిచ్చి యెఱుఁగ
చెలువారఁ జేరఁదీసితిఁ గాని యొరునింటి
కేఁగుమం చని చెప్పి యెన్నఁ డెఱుఁగ

ఆ. నన్నుఁ గన్నతండ్రి నాచిన్నకూన: న
న్నేలువాఁడ: నావరాలకొండ
చిన్నరంగరాయ: యున్న; నిన్నెన్నఁడు
విడిచి యెఱుఁగ నెట్లు విడువనేర్తు.

చిన్నరంగా.—అమ్మా! ఏడవకే? నేనూ యుద్ధానికెళ్లి అవిదయదాదుని, తురకల చిదగకొత్తేత్తాను. నువ్వేడిత్తే నా కేడుపొత్తుంది.

వెంక.—అమ్మా! మీరిట్లు శోకభారంబున మునింగియుండినచోఁ గార్య భంగ మగును. పిదప నేమిచేసినను లాభము లేదు.

మల్ల.—(ఏడ్చుచు) నాయనా! నన్నుఁ గన్నతండ్రీ! నాముద్దులయ్యా!

క. నాకడుపునఁ బుట్టక యిం
కేకడుపునఁ బుట్టితేని, యీయిడుమ లయో
లేకుండుఁ గదర, కొడుకా!
నాకడుపున నేల పుట్టినావుర! తండ్రీ!
కొడుకా! నిన్నొడఁబాసి యే నెట్టు లుండనేర్తు? హా తండ్రీ!

సీ. తలిదండ్రు లేరైనఁ దనయునిఁ జూడ నూ
హింతురు నా కట్టి దెట్లు కలుగు
కొమరునిముద్దువాక్యములు వింటకు నైనఁ
బెట్టిపుట్టఁగలేద పృథివియందు
గొడ్రాలినై యున్నఁ గొంత మేలుగ నుండు
నేల నా కీవుదయించినావు?
ననుఁ గన్నతండ్రి! నాయనుఁగుకుమార! నా
వరహాలకొండ! నిఁక బాయఁజాల!

గీ. చెనఁటిదైవము నిను వేఱుచేయుచుంట
పరులయింటికి నీరీతిఁ బంపుచుంటి
నెంతపగదాన నైతిరా! యేను నీకు
నిన్ను విడనాడి యెటులోర్తుఁ గన్నతండ్రి?

లక్ష్మీ! వీఁడు నీకొడుకు కాని, నాకొడుకు కాఁడుసుమీ? ఎట్లు శత్రువులవాతఁ బడకుండఁ దప్పించి రక్షించెదవో? అది యంతయు నీదే భారము.

చిన్నరం.—అమ్మా! నిన్నొదిలిపెత్తి నే నెల్లను. నా కేడుపొత్తాంది. (యేడ్చును.)

మల్ల.—(ఏడ్చుచు) నాయనా! ఏడ్చుచున్నావా! తండ్రీ! దుఃఖపడకుము.

గీ. దుఃఖపడకుము నాతండ్రి దుఃఖపడకు
నిన్ను నీపినతల్లి నాకన్న రెట్టి
కూర్మిఁ బ్రోచును మల్లమ కువలయమున
తల్లికాదుసుమీ! నీకు దాయకాని—

(వెంకటలక్ష్మికి బాలు నందిచ్చుచున్నది.)

వెంక.—(బాలుని చేకొని) అమ్మా! ఈముద్దులయ్యంగూర్చి నీవేమియు విచారింపకుము. నే నీబాలుని సురక్షితముగ చామర్లకోటకుం జేర్చెదను.

సీ. కరచూపులఁ జూచి క్రూరతురుష్కుల
మోహవారాశిలో ముగ్గఁ జేసి
దరహాసరుచులచే దొరలసేనల నెల్ల
నుక్కించి చరణదాసుల నొనర్చి
గజిబిజినడలచే విజయరాముని సేనఁ
గామాంధకారతఁ గన్నుఁ గప్పి
నునుఁబల్కుగమిఁ జిల్కు వినుచుండుకూళల
వారిలో వారికిఁ బోరుఁ గూర్చి
గీ. నమ్మకున్నట్టివారిపై నాకటారి
బఱచి చిత్రమ్ముగా భూతబలి యొసంగి
వగపగనుఁ బూని రక్షింతు వాస్తవమ్ము
నీకుమారు: విజితరూపమాకుమారు.

(బాలు నెత్తికొని నిష్క్రమించుచున్నది.)

మల్ల.—(విచారముతో) హా! కుమారా! చినరంగరాయా! నాముద్దులయ్యా! నన్ను విడిచి పోవుచున్నావా? నాయనా! న న్నెవ్వరి కప్పగించితివిరా! తండ్రీ! నీముద్దుముచ్చటలు చూచి యానందించుభాగ్యము నేఁటితో నాకుఁ దీరిపోయెనా!

శా. అన్నా! చిన్నికుమార రూపజితమారా! రావు సద్వంశసం
పన్నా! ముద్దులబిడ్డ! ఆకటికి దైవ మ్మెట్టియిక్కట్టు తె
చ్చె నన్నా నోములపంట! ఈపయిని నీచిన్నారిపొన్నారినున్
గన్నుల్ కన్నులతృప్తి తీరఁ గనుభాగ్యం బెల్ల హా చెల్లెనే!

ఓరీ! పాడువిధాతా! నీచేత లన్నిఁటికి నీవేమో కడు సంతసించుచుంటివి కాఁబోలు? ఇదిరోయిరా! నీసంతోషకారణము. నీకడుపు బిడ్డలఁ గన్నది కాదురా! తల్లిని, పిల్లలను, అన్నదమ్ములను, భార్యాభర్తల నెడఁ

బాపునీయద్భుతసృష్టికి నీవే యుపాంగవలయు. హా! కొడుకా! (మూర్ఛిల్లుచున్నది.)

వేంకయ్య.—(ప్రవేశించి శోకముతో) కటకటా! ఈశ్రవణపుటవిదారణమగు దుర్వార్త యేనెట్లు దేవిగారికి విన్నవించెదను?

మ. కలనన్ బాహువిదారితాఖిలరిపుక్ష్మానాథులౌ వెల్మవీ
రులు నేఁ డిట్టులు ధర్మయుద్ధమునఁ బేరుల్ నిల్పలేకుండి రె
ట్టులయేనిన్ రణమందుఁ జావులోనఁగూడన్ మాకు దుఃఖంప నం
దులకున్ గాంతల నెల్లఁ జంపువిధికై దుఃఖించెదన్ శ్రీహరీ.

అక్కటా! నా కిట్టిదురవస్థ సంప్రాప్తించినది? ఏ నెందుల కీస్త్రీహత్య నొనరించుపనికయి, నియోగింపఁబడితిని. పాడుదైవమా! నీకేని మాకయి నిసుమంత ప్రేముడి లేకపోయెనా!

చ. కటికితనమ్ముఁ దాల్చి కులకాంతలఁ బ్రాఁకెడిచంటిపిల్లలన్
పటిమ యొకింతలేని ముదివగ్గుల గర్భిణు లాదిగాఁగ న
క్కట వధియింపఁగా వలసె కాల మదెంతటిలోన మాఱె యి
ప్పటి కిది యెట్టులౌనొ? భగవంతునిచేష్ట లెఱుంగ శక్యమే?

అయ్యయో! మల్లమదేవి నన్నుం గని "వెంకయ్యా! కోట భద్రమా!" యని యడిగిన నేనేమని మనవిచేయఁగలను?

గీ. కోటఛేదింపఁబడె శత్రుకోటిచేత
రాఁ బ్రయత్నించుచుండెఁ బరానుమూఁక
యనుచుఁ జెప్పిన నాయమ్మ హా! యటంచు
నపుడె ధరఁ గూలుఁ దెగినపాదపముపోలె.

ఎట్టులైనను నాకార్య మొనరింపక తీఱదు. లేనిచో మేము బ్రదికియుండఁగనె రాణివాసమునకుఁ జేటు మూఁడునేమో?—తప్పదు. ఇంక కిట శోకించుచు మసలితినా కార్యభంగముకూడ నగు. ధైర్యము నవలంబించి కార్యము నిర్వర్తించెదఁగాక—(పైకి) తల్లీ! మల్లమాంబా! ఎట్టిగతి ప్రాప్తించినది?

మల్ల.—వెంకయ్యగారూ! ఈగడియవఱకు మనప్రభువులకుఁ గీడు వాటిల్ల లేదుకదా! సత్వరము చెప్పుఁడు.

వెంక.—అమ్మా! ఏమని చెప్పఁగలను తల్లీ!

మ. అకటా! నాలుక యాడకున్నయది; అమ్మా! చెప్పఁగా వెల్మనా
యకవాస మ్మగుకోట వ్రీలి పడెఁ;
మల్ల.— హా! హా! శ్రీహరీ! చెప్పఁ డే
లిక కింకర్ గుశలమ్మె కా;
వెంక.— అగును తల్లీ! ముం దిఁకే మౌనొ?
మల్ల. మా
మకభాగ్యమ్మిటులుండ నెట్లుసుఖముల్ మాకబ్బు యోజింపఁగన్.

అయినచో వెంకయ్యగారూ! మీరు వచ్చినపని శీఘ్రంబు నివేదించి యుద్ధరంగమునకుం జనుఁడు.

వెంక.—తల్లీ! మల్లమాదేవీ! నే నేమని మనవిచేయఁగలను? ఫరంగివారి ఫిరంగివాతలం బడి కోటతలుపు లెడమియు నంతఁ దురుష్కాధములు లోనం బ్రవేశింప యత్నించుతఱి, మనబలంబులు వారితో సంకులసమరంబు లొనరింపవలయు నని యానతీయఁబడినవి. అప్పుడు మత్ప్రభువరేణ్యుండు చిన్నదొరగారినిరప్పించి, వారికి రాజ్యాభిషేకంబుఁ గావించి, తాము యుద్ధంబునకుఁ జనుచు నన్నుం జేరఁబిలిచి “వెంకయ్యగారూ! అవరోధజనంబులమానంబుఁ గాపాడవలయుఁ గదా!” యని కన్నీరు గార్చుచు నొకింతసేపు మ్రాన్పడియుండి, తిరుగ దిటము వహించి, తల్లీ! ఆమాట చెప్ప నోరు రాకున్నది.

మల్ల.—అయ్యా! వారియభిప్రాయ మంతయు నాకెఱుంగవచ్చినది. భర్తగారు రాకముందు నేను స్వర్గంబునకుం జని వారికయి యెదురు చూచుచుండెద. సంగరరంగమధ్యంబునందు నిరంకుశలీల విహరించుమీయేలికతో, నాకడసారిమాటగ నిట్లు మనవిచేయుఁడు.

గీ. ఇంతచేసినయాకూళనృపునిఁ జంపి
యిలను రావుకులముకీర్తి నిలుపుమయ్య!
పగరఁ జెండాడుమయ్య! మాపైని బ్రేమ
మింతమఱవకుమయ్య! వెన్నీయకయ్య!

కమలా! స్త్రీజనంబు లంద ఱిండ్లలోనుండి, యాయిండ్లకగ్గి నిడి మ్రగ్గుఁడు. ముం దాపని కానిండు. వెంకయ్యగారూ! మీరు వచ్చి చాల తడవైనది. మీచేఁ గలకరవాల మొకసారి నా కిండు. (కత్తిఁ దీసికొని) హా! పరమేశ్వరా! మావంశంబుఁ గాపాడుభారంబు నీయది. (మేనఁ గ్రుమ్మికొని మరణించును.)

వెంక.—(ఏడ్చుచు) తల్లీ! ఆశ్రితజనకల్పవల్లీ! మమ్ముల బాసి వెడలిపోయితివా? నీమనోనాయకున కీదుర్మరణవార్త యే నెట్లు వినిపింపఁగలను? (దెసలు పరికించి) హాహా! ఎంతకష్ట మెంతకష్టము? బొబ్బిలిపురంబునం గలకాంతాలోక మాబాలగోపాలంబునుగూడ నిండ్లకుఁ జిచ్చిడికొని యందుం బడి మ్రగ్గుచున్నారు! (క్రోధముతో) ఓరీ! విజయరామనరాధమా! మాకింతయొగ్గుఁ గావించిన, నీ వింక నెన్నినాళ్లు భూమిపయి నుండఁగలవురా?

శా. కొండెంబుల్ వచియించియాతురకజంగుర్ జేబులోవైచి; మూ
ర్ఖుండా! యీగతి నేయఁబూనెద వె? లాడూయాదిగాఁ గల్గుదోః
శ్శౌండుల్ మామకవిక్రమానలమహాజ్వాలాళికిన్ దక్కఁ జా
కుండన్ నిల్చెడివార లెవ్వ రిదె? కన్గో వచ్చెదన్ తాళురా!
(సపటాక్షేపముగ నిష్క్రమించుచున్నాఁడు.)

రంగము-యుద్ధభూమి.

(తెరలో) ధర్మయుద్ధపారీణులగు నోదండనాథాగ్రణ్యాదిసకలాప్తసైనికులారా!

సీ. నిఖిలశాత్రవగర్వనిర్భేద మహాశేవ
వాయింపుఁ డయ్య నౌబతును విడక
నిస్తంద్రకీర్తిచంద్రిక లెల్లెడ వెలుంగ
ధను వూని యనికి సిద్ధమ్ము కండు
ఛురియ లీఁటెలు పటాల్ పరశు లాదిగ నెల్ల
యుద్ధోపకరణమ్ము లూని నిలుఁడు
తటి మైనతటి మహోత్తరబాహుశక్తిని
యుద్ధంబునకు నేని సిద్ధపడుఁడు
తే. వారులఁ గరుల శాత్రవపరంపరలపైని
పఱచి వారలఁ జీకాకుపఱచవలయు
పెద్దలు బలాఢ్యు లనునట్టి పేరు మీరు
కలన మీశక్తిఁ జూపించి నిలుపవలయు.

మఱియు నో శూరవరేణ్యులారా!

ఉ. పాఱినవారిఁ జంపకుఁడు పంతముగ్రా రిపురాజి నొంపుఁ డె
వ్వారిని లెక్కసేయకుఁడు వారక కీర్తి నిల్పుకొండు సం
సారముపై నిఁకాశల విసర్జన సేయుఁడు వెన్నుఁ జూడుఁ డె
వ్వారికి వెన్నుఁ జూపకుఁడు పౌరుషముగ్రా విడనాడఁబోకుఁడీ!

హుస్సేను.—(సప్రహారుఁ డయి ప్రవేశించి) హారే! అల్లా! అల్లా! మాఖు రొన్ని ఖోటల్కు ముట్టడించామ్! హెంద్రి రాజుల్కు సంప్నామ్! హిట్టా యుద్ధం మాఖు పుట్టినూడ్ లేవ్. లడాయికి మై జారుయేగా! ఖోడగోడ్కు నిఛ్నా రుయేసి మాఖు హెక్తాహుంటే భాల్లీహాడూ మీద్ నించి హంబ్లీ పోసేవ్! మాదీ హాఖీ రెండూ హంటూక్ పోయేవ్! మాదీఖుర్కు పరారీ సెప్తాహుంటే, ఖాగ్తా హుంది తేల్ హాదీ పోవి రోల్ఖి రోఖిల్కు మీధా రుయేసి మాఖీ సంప్తార్ హాళ్లూ! భాల్లీఖోట్టి హాఖ్డ మంచిఅవురత్కి నిఖా సేసి షాదీ హైదామ్ మాఖీ హాలో

స్నా! షాదీ గీదీ దైభంకి తెల్సు. మాదీ ఖత్కు హింట్కు పోతే షాల్!

శూరపరాజు (ప్రవేశించి) అహా! ఈవెలమలయుద్ధకౌశల మత్యద్భుతము కదా! వారిబాణముల కీతురకసేన గుటియగుచు గుదులుగుదులుగఁ గూలుచుండుట తక్క వీరి యాగ్నేయాస్త్రములకు వారొక్కరిర్వురు గుటి కాకున్నారు. ఫిరంగు లుండుటచేఁ గోట భిన్నంబైనది కాని, యింకను విజయముఁగూర్చి శంకిలవలసినదే? నలువంక లోకసారియే ముట్టడింపఁబడ, వారుకూడ నున్నసైన్యము విభజించి మున్మొదుర్కొని సరాసరిగఁ బోరుచున్నారు.

హుస్సే:—సూర్నారాజా! హెఖ్డానిండి వస్తావుంది. మీధీ లడాయిఖు రుల్లాలేద్! లేఖ్ పోతే పరారీ సెప్తార్.

శూర:—సాయెబులా! మీరుకూడ యుద్ధతలంబునుండి వచ్చి విశ్రమించుచున్నారు కాఁబోలును!

తెఱలో—

ఉ. బొబ్బిలివీరులార! తలుపుల్ పడె నంచు గణింపకుండు మీ
యబ్బలపేరు నిల్పుఁడు యశోర్థులు కండు రణంబునందు మీ
యుబ్బునుఁ జూపి శత్రువుల నుక్కడఁగింపుఁడు; ప్రబ్బువేదుకగ్రా
దుబ్బెలు కాఁగ జీవములతోఁ బురి శత్రులఁ జేరనీకుఁడీ!

హుస్సే:—సూర్నారాజా! బడామేఘుంలాగ షబ్దం సెప్తాహుంది. హాదీ ఖాత్ హింటే మాదీ గడ్గడా గడ్గడా హైతుంది. హాడూ హిఖ్డాఖు హాతాహై మాఖీ మార్నేకు నూస్తాడ్ తోస్తుంది. మంది ఖుర్మే పోతావ్. అవ్.

శూర:—ఇంతసేనన్ జించికొని వాఁడిచ్చటి కెట్లు రాఁగలఁడు? అందులకయి మనము భీతిల్ల నక్కఱ లేదు కాని నీవేమైన యుద్ధవిశేషములఁ గనిపెట్టితివా? ఇంతదనుక నీ వెవరితోఁ బోరాడుచుంటివి?

హుస్సే:—మాఖీ బకౌల్ పేట హుందీ లేవ్! హాఖ్డాఖు యుద్ధంఖు

పోయేవ్: బకాల్ బీబీ! వాడూ హేడ్డిహేడ్డి తేల్ తెచ్చి, మాదీ అప్కా రహోంక్షేథా యేస్తే, అం క్యాబోల్తా! సెప్తాన్కి పరవ్ హైతుంది.

శూర:—జరిగినది చెప్పుకొనుటకు మన కేమిసిగ్గు? చెప్పుము.

హాస్సే:—హోల్లూ తేల్ తెచ్చి పోసేవ్! హాంల్లీ పోసేవ్! కోకల్లూ తిర గల్లూ రోల్లూ హంతా పోసేవ్ హాడ్కీ ఖొట్టాల్‌మే బందూక్ హైత్రేమ్. ఏక్ బొమ్మారాక్ సీ హుందీ పిశాసీ చేరీరాంఖా, బడే రోఖ ల్కి పట్కోని లమ్కర్‌కి లట్‌పట్ సెప్పింది. ఖొట్టాహుంటే రఘుతం ఖాల్వా పారింది. ఏక్ బకాల్ బీబీ మాదీ ఆఖీమీధా హాంల్లీ పోసేవ్! వర్గుండా సల్లేవ్! మాదీ అఖీ హంట్కాపోతే హాఫ్డు ఖర్మే పరారీ సెప్పి మొఖ్ము ఖగ్డి హిఖ్డాఖి వచ్చేం.

శూర.—కోమటియాఁడువాండ్రే యీరీతిగఁ బోరినారా? అయినచో మాతోఁ బోరినకాపువాండ్ర పౌరుషముఁగూర్చి యబ్బురపడ నక్కఱలేదు.

హాస్సే.—ఖాపూవాడూ మీతో హెట్టా యుద్ధం సేసేడ్ బోలో.

శూర.—మేము కాపుగూడెమువంక వారితో యుద్ధము సేయుటకు నియోగింపఁబడి, యావంకకుఁ బోవుసరికి వారు నాఁగలి నక్కు మొదలగు కర్షకోపయోగమగు సామగ్రిఁ బూని తలపడిరి. ఆఁడువాండ్రు కోకలు పిరిచుట్టుగ మల్లఁగట్టి, మహిషాసురమర్దినినిఁ దలపించుచు, మనసేనఁ జెండాడినారు. వారిపయికిఁ బోయిన మనఅయిదువందల మందిలో, ఏ పదిమందిమాత్రమో బ్రదికినారు. తుపాకిమందు ప్రయోగంబున వారి నెట్లో చంపఁగల్గితిమి.

హాస్సే.—సూర్పారాజా! బకాల్ బీబీకి యుద్ధం సెప్పం మాఖు హొఖ్డా మాల్లేద్ హాండీ! బకాల్ పిర్కి సెప్తార్ మాఖీ షై బోల్తా మీదీ పిర్కి.

(తెరలో)

కోటలోను పేటలోనూ సాయేబయ్యా
మేం కూడుకొని తిరుగుతాము
చేతులైనా సూస్తాము సాయేబయ్యా
మంచి జ్యోతిషము సెప్పుతాము
పెద్దయింటిబిడ్డలము సాయేబయ్యా
మమ్ము కొద్దిగాను చూడకండి
ఉన్నమాట సెప్పుతాము సాయేబయ్యా
మేము లేనిమాట సెప్పఁ బోము.

హాస్సే.—సూర్పారాజా! దేఖ్ దేఖ్! సిల్కాఫిట్టాలాగా గిల్కుగిల్కు సప్డు సేస్తూ ఏక్ కంచెన్ వస్తావుంది. కోయ్లాలాగా కుయ్ కుయ్ హంటూ హచ్చా గానం సెప్తాది. హది యిన్నాం మాఖు సచ్చింది ఛత్కిందె తెల్వాద్? దాన్కి మాది నిఖా సేసి పాదీ హైతామ్జీ!

శూర.—దానివెంట నెందఱు వచ్చుచున్నారో చూడుము. ముందుగ వారి నందఱ సాగనంపితివేని యది నీకృత్యమున కనుమతించునేమో?

వేంకటలక్ష్మి బాలు నెత్తికొని ప్రవేశించును.

సొగసుకాఁడవు నువ్వు-సాయేబయ్యా
నన్ను వగ నేలికోవోయి సా.
నిన్ను విడువఁ జాల సాయేబయ్యా
నేను నిన్ను పాయఁ జాల
కన్నెపిల్లను కాని సాయేబయ్యా
నే నెన్న పెద్దదాన్ని కాను
తాళఁజాలను నేను సాయేబయ్యా
నేను బేలపిల్లను కాను
ముద్దిచ్చి పోవోయి సాయేబయ్యా
నీవద్దఁ జేర్చుకోవోయి
రవ్వ సేయకోయి సాయేబయ్యా
నాయవ్వనము నీదోయి సాయేబయ్యా.

వెనుక గంతులు వైచుచు యాకూబ్ జానూ ప్రవేశింతురు.

యాకూబ్.—దేఖో జానూ ఇది కంచెన్ మెల్లామెల్లా మన్కి తీవ్‌మాటా సెప్పి ఛల్నేకు సూస్తాది తోస్తావ్ భాయ్! హింక మన్మ ధీన్ని హొర్డి హెయ్కు నిఖా సేసి కంచెన్కి సెప్తామ్:

జానూ.—యాకూబ్! దేఖో హిఖ్డ హాస్సేన్ సూర్పారాజ్ హున్నాడ్: వాల్కి సూస్తే యిది మోఫిస్తార్ తోస్తావ్ నాఖీ!

హాస్సే.—సూర్పారాజూగారూ! దీంది సోక్ తమాసా దేఖో! షిల్కా లాగా రైకా తొడ్గి సెమ్లిపిట్టాలాగా ఖోకా కట్టి, ముఖుముత్తేం, అఖీకి ఖాట్కా సేత్కి ఘాజ్ నద్మాఖి హొడ్డాణ్ యేసి, మీదీ టెంహోదైభం మన్మధుడ్డూ ఖల్సి షింగారంఖుప్పా సేసి దీన్కి సేసేవ్: మీదీపామ్‌కి సలామ్ సెప్తామ్: మాఖి షాదీ సేస్కోధాన్కి సెప్పండి?

సూర.—మూఢుఁడా! నేనేమి నీకు కుంటెనకాఁడ ననుకొంటివా? ఇటు వంటిపనులకు నియోగించుచున్నావు. (నిష్క్రమించును.)

వేంక.—(తనలో) వీరందఱు నావిలాసవారాశిలో మునిఁగి యున్నారు. వీరి కిప్పుడు, మోహము తలకెక్కఁజేసి చతురగతిఁ దప్పించుకొని నిష్క్రమింతుఁగాక! సాభినయముగ నొకశృంగారగీతికఁ బాడి మైమఱపించెద. (ప్రకాశముగ.)

నీకు నాకు యీడు జోడుసాయేబయ్యా
    పలుగాఁకిమూఁకవంక చూడు సాయే.
అక్కుఁజేర్చి ముద్దుమోవి సాయేబయ్యా
    వేడ్క నొక్కి రుచి చూడుమోయి
మారుబారి కోర్వఁజాల సాయేబయ్యా
    నిన్ను కోరియున్నదాన చాల
ఏల ప్రేమ రాదు నీకు సాయేబయ్యా
    నన్నేలవేల జాలమేల

హాస్సే.—కంచెన్! నీదిపామ్కు సలామ్! మాఖి హిట్టా సూడు. నీఖి నిఖా హైతామ్. నీఖి షాదీ సెప్తామ్:

వేంక.—సాయేబుగారూ! నన్నేమి చేయుమందురు? వీం డ్రందఱు నన్నీరీతిఁ బొదివికొని యుండ నేనేమి చేయుదును? ఈతురకల ముందు ఘంపివేయుఁడు. నాకును మీకును—

హాస్సే.—క్యా యాకూబ్! నీఖి లడాయ్‌కి పోకా యిఖ్డాఖి హైకూ వఛ్నావ్! జావ్! బద్మాష్! మీదీ వచ్చి అవురత్‌ఖి హుల్రా సెప్తావ్:

వేంక.—ఏమండోయి సాయేబుగారూ! మీరు వచ్చుచున్నారని వచ్చుచుండ వీఁడిట్లనుచున్నాఁడు. ఏమైనను సరియేకాని, మీరు మమ్ములను వదలిపోకుఁడీ:

యాకూ.—హాస్సేన్‌సాబ్! మీది లడాయ్‌కి రొమ్లండి. మాదీ షాలా హాల్సి హుంది.

హాస్సే.—తుంబీ జావ్. (ఇరువురు కలియఁబడి కొట్టుకొనుచుండ వేంకట లక్ష్మి నిష్క్రమింప యత్నించును. జానూ అడ్డును. లక్ష్మి బాఁకుతో వానిఁ బొడుచును.)

యాకూ.—హల్లా హల్లా! హిది అడ్‌మన్సి కాద్రా బాబూ! డెక్కైపద్కొండుమంది మొగ్గిహుంది తోస్తుంది. హిది షంగ్తి బుస్సీకి షెప్పి, హిఖ్డాకి తెచ్చి హుస్సేన్‌గాడ్కి షంపిస్తామ్: హీడ్మీదా దీస్మీదా కుట్టర్ షెప్పి హైవ్‌సెయ్‌వాలా. (నిష్క్రమించును.)

హాస్సే.—హామ్మా! హీల్లు పరారీ సెప్నార్! ఆవ్! మంది ఖుర్మేపోదామ్:

వేంక.—ఒరనుండి బాఁకు దూయనేదూసితిని. వీనిఁ దెగటార్చి నాదారి నిరాటంకముగ చేసికొనియెదను. సాయేబుగారూ! రండు. (పొడిచి చంపును.)

తెరలో.—పిషానీ హాడ్డీ హాంద్రీఖి షంపి పోతాహుంది. పగడో! పగడో!

వేంక.—వీండ్రందఱు నన్నుఁ బట్టుకొనుటకయి వచ్చుచున్నారు. అదిగో! బూసిదొరకూడ వచ్చుచున్నాఁడు. ఇంక నేనెట్లును తప్పించుకొనఁజాలను కాన, యిందుండి నిజము నివేదించెదను. పైని దైవ మున్నాఁడు.

హైదరు. బూసి. విజయరామరాజులు ప్రవేశింతురు.

బూసి.—ఈఁడుదిరయే యింతమందినిచంపినదా? అయినచో నామె యెట్టిదో; ఏపనికయి పోవుచున్నదో కనుఁగొని తీఱవలయును ?

హైద.—వాళ్లూ మంత్రాంగం చెప్పి బచ్చాఖు తీష్కుపోతార్ తోస్తుంది. హేల్నివారూ వాది పరీచ్ఛ సేసి సంస్థాన్కి హుకుం దేదియా.

బూసి.—(చూచి) ఔరౌరా! జగాకడానివెలుంగు డీలువడఁజేయుచు విండుచందురు గేరుమోము ముద్దులు మూటఁ గట్టునీకుఱ్ఱఁ డెవ్వఁడై యుండు. ఆహా! ఇట్టివానిం గన్నవాఁ డెంతపున్నెము చేసినాఁడో కదా!

వేంక.—(తనలో) ఇతఁడే బూసిదొర యయి యుండు. (పైకి) సలామ్! మూవాబూసిదొరవారికి; నాయనా! చినరంగరాయా! దొరగారికి సలాము చేయుము.

హైద.—హిది ఛిన్ రంగ్రావ్ హుంది. బొబ్లీఖ బచ్చా:

చినరం.—బూచీ దొలగాలికి తలాం.

బూసి.—అమ్మా! మీ రెవ్వరు? ఏమికతంబున నీబుడుతనిఁ దీసికొని యిట్లేఁగుచున్నారు? మిమ్ములనుఁ జూచినకొలఁది జాలి వొడముచున్నది. దాఁచక చెప్పుఁడు.

వేంక.—అయ్యా! ఇంతకు వచ్చినపిదప నిఁక దాఁచ నేమిటికి? నిజము చెప్పెదను. పిదప మీయిచ్చకు వచ్చినరీతిని చేయుఁడు. ఈకుఱ్ఱవాఁడు బొబ్బిలిపురీశ్వరునికుమారుఁడు. నేను వారిదాదినగు వేంకటలక్ష్మిని.

బూసి.—అయినచో వీని నెక్కడకుఁ గొంపోవుచున్నారు ?

వేంక.—మావగనులగు మావా రపజయము శంకించి, కొంతఅన్న,వృద్ధులను,

బాలురను ఇండ్ల నుంచి చిచ్చంటించి చంపిరి. వీనిం జామర్లకోటకుం గొంపొమ్మని నా కొసంగిరి. నేను గూఢభంగిఁ బోవుచుండ నిట్లైతి. (దుఃఖించుచు) తండ్రీ! ఎటులేని యీబాలుని రక్షింపవలయు నని మీపాదము లాశ్రయించుచున్నాను.

చినరం.—లచ్చిమీ! యేదవకే మనకేంబయం.

బూసి.—బిడ్డా! నీ వెవరికొడుకవు ?

చినరం.—నేను దంగాదావుగాలికొదుకిని.

బూసి.—నీ వెక్కడకు పోవుచున్నావు ?

చినరం.—మానాన్నగాలూ, అమ్మగాలూ యుద్దానికి పోవద్దని చామ్లకోత పంపుతున్నాలు.

బూసి.—నాయనా! రమ్ము! ఈయరటిపండుం గొనుము.

చినరం.—అలితిపం దెందుకు నాకు? కత్తియ్యంది.

విజ.—దొరగారూ! బొబ్బిలివారివిక్రమ మిప్పుడేని మీ కెఱుంగవచ్చుచున్నదా ?

బూసి.—బిడ్డా! బాలుఁడ వగుని వాకత్తితో నేమి చేసెదవు?

చినరం.—బూసీదొలగాలూ! మానాన్నగాలిమీదికి యిదయదామలాజా యుద్దానికొచ్చేత! అంచేత ఓచిన్నకత్తితే ఆలాదుని చంపేసి వొత్తాను. చిన్నకుల్లాల్లాగ అరితిపందు నాకెందుకు ?

విజ.—తెలిసినదా? వీనియభిప్రాయము. ఇఁక వీని నొకరయేనుఁగకాలిక్రిందఁ ద్రొక్కించవలయు. బ్రదికియుండెనా మనకే మోసమగును.

బూసి.—(కోపముతో) ఓరోరి రక్కసీ! నీది బిడ్డలఁ గన్నకడుపు కాదురా! ఈకసికందు నీ కేమిచేసె నని చంపు మనుచున్నావు? ఇటు లాడ నీకు నో రెట్లు వచ్చినది? ఇంకిటు లంటివా నీనాలుక చీలికలు చేయింతును.—దాదీ! నీ వేమియు నడలకుము. ఈబుడుతని కేమియుఁ గీడు రానీకుండ

నాగుడారమునం దుంతు! సేవకా! ఒక యందలమ్మున నిబిడను, ఈకుఱ్ఱ వాని నుంచి నాగుడారమునం దుంచుము. జాగరూకతఁ జిరఁ గాపాడు చుండవలయు. (తెరదిగును.)

రంగము - యుద్ధభూమి.

నాగోజీరావు, హైదరుజంగు ప్రవేశించుచున్నారు.

నాగో.—యవనేశ్వరా! ఇం దింతవిశేషముగ నబ్బురంపడ నక్కఱలేదు. ఎన్నఁడేని బులికడుపునఁ బులిపిల్ల కాక పిల్లిపిల్ల జన్మించునా?

హైద.—హాఁడూ సూట్టాన్కి హేల్డు హున్నాడ్ లేవూ! కత్తిహియ్! మాఖి హిజ్యాఖి సంత్తే హంటా హెంత జల్దీ హోచ్చేడ్ హోయ్: పిస్తోల్ ఖడ్డు ఫిరంగ్ ఫుట్టింది తోస్తాది మాఖీ.

నాగో.—కుఱ్ఱవాఁడైనను సాహసముఁ గొనియాడఁదగినదే? అందుచేతనే కదా! రాజు వానిఁ జంపుమని చెప్ప దొరగా రగ్రహించి వానిం దిట్టుచు బాలకునిఁ దమసొంతగుడారమునం దుంచికొనినారు..

రంగారావు రక్తసిక్తాంగుఁడై కత్తిఁ దూసికొని ప్రవేశించుచున్నాఁడు.

రంగా.—(క్రోధఘూర్ణితుఁడై) ఓరోరి తురుష్కహతకులారా! ఏడీ! దుర్మార్గుఁడగు హైదరుజంగు మీప్రభుం డెందున్నాఁడో నాకుఁ జూపుఁడు. వానిం దెగ నేసినదాఁక నా కీరణోత్సాహము తీఱకున్నది. (అటు నిటుఁ దిరుగుచు హైదరును గాంచి) ఓరోరి యవనహతక! దుర్మంత్రాభిలాషీ. నా కగపడకుండ నీ వెందడఁగి యున్నావురా?

శా. ఓరోరీ! యవనాధమా! చటులసారోగ్రాజిలో నుండ కీ
వేరా మాటున డాఁగి యుండితివి? నీకే శౌర్యమే యున్న రం
గారాయాగ్రణి వచ్చినాఁ డతని సంగ్రామమ్మునం దోర్చి నీ
బీరమ్ముం నిలఁబెట్టికొ మ్మవనిలో విఖ్యాతి తీండ్రిల్లఁగన్.

సీ. ఎదిరిశక్తి యెఱుంగక కేతెంచులాడూను
కుంతధారాహతిఁ గూల్చినాఁడ
బిరుదు లగ్గించి పైఁ బఱచులానూఖాను
నతనికిఁ దోడుగా నంపినాఁడ
అద్దిరా! యని వచ్చుసిద్దీబిలాలుపైఁ
జెండి భూమీస్థలిఁ జేర్చినాఁడ
బంద్రాయివలె వచ్చుజంద్రాల్మహమ్మదు
నీల్గించి భూబలి యిచ్చినాఁడ
తే. పూని షుకురుల్లఖాను హుస్సేను మొదలు
తురకజోదులఁ బెక్కండ్రఁ ద్రుంచినాఁడ
హైద రొక్కండె మిగులఁ బో లాతఁ డెందు
నక్కియున్నాఁడొ యెఱిఁగింపుఁ డుక్కడంతు.

నాగో.—పారశీకేశ్వరా! అడిగో! హరిణముపైకి దూఁక లంఘించు బెబ్బులియబ్బున బొబ్బిలిబెబ్బులి, కనుల నిప్పులుఱుల, దుశ్శాసనవధావసరంబున దీపించుభీమసేనునిపోల్కి మిమ్ముఁ దాఁకుటకయి వచ్చుచున్నాఁడు.

హైద.—నాగోజీరావ్! మేరాదిల్ హంతా ఘుందర్ గోలం హైండి. ఇచ్చాన్ ఖి సంపేం హాంగే వంకాయ్ వస్తావ్! వంకాయ్‌కి సంత్తే మత్తేల్ పాపయ్ హంటావ్! హాడ్కి మర్గయా సెప్పే దమ్మాయ్ వస్తావ్! హెంద్రూ హెంద్రూ హున్నార్ హోయ్ భొబ్లీవాళ్లూ! యెంక్టాలచ్చీ హోచ్చి హికై వ్యాడైఖైమంది సంపింది. హాడోదూ యుద్ధం సెప్పి బెంగ్డి యుద్ధం సెప్పి మాఁఖీ సంహ్తార్ తోస్తుంది. హోంటినిండా రఖుతం యేస్కొని ఖుర్రాఖుర్రాహోస్తాడ్ ఖానంలాగా యీడు. సిద్దీబిలాల్, మానేసవాల్, షుకురల్లీ, హుస్సేన్, లాడూలానూహీడ్కి యెద్రి సొచ్చి మర్గయా సెప్పేర్ బోల్తా హిక మాది హోంతు వొచ్చింది. మాఖీ పోవాల:

జాగ.—యవనేశ్వరా! నేను మొదటనే మనవిచేసి యుండలేదా? వెలమల కారవము.

గీ. మత్తపరివంథిభూమీధరా త్తసర్వ
గర్వనిర్వాపణోద్యోగదోర్వ్విదళిత
శీర్ష భవర క్తమజ్జనామర్ష లరయ
రావువా రని చెప్పనే వేవిధముల:—

రంగా.—(హైదరుజంగునుఁ గాంచి) ఓరీ! వృథాశ స్త్రబలభరా!
శా. ఏమీ! భీతిని నక్కియుంటి విట! ర ణ్మిత్తుల్ నీబీర మ
త్యామోదంబున; అన్న పాలునకు మూఢా! కోట యిప్పింతు వే
మీ! మాటాడక యుంటి వేమి? నృపులో నేమేమి యోయంటకా
దీమా వెల్మలక త్తిదెబ్బ లనఁగా నెట్లాఁగెదో కాంచెదన్:—
మూర్ఖా! రణవిహారంబు సల్పక యింకను తాళియుంటి వేమి? రారమ్ము:

హైద.—యెల్లామస్సి! నీకు పౌరుసం హుంటే లడాయీకు నూవ్ హోయ్; పెద్దపెద్దాఖబూరి నేస్తావ్. మాదీపటాణిదెబ్బలికి నీకు మాలుంహైతో తుంది. హవీరిధగ్రాకు పోయ్ హద్దు:

రంగా.—(హేళనముగ) మాకుఁ దెలియకపోయినచోఁ గదా! ఎవరియొద్ద కేఁ బోయి కనుఁగొనుట; నీబలవిక్రమంబులు మాయెల్లరకుంగూడ కరతలామలకంబులే? నీ వప్పుడే మఱచిపోయితివి కాఁబోలును! తెలియఁ జెప్పెద నుండుము.

సీ. ఆనదలై యుండెడియవనీశ్వరుల నెల్ల
జంకక తృటిలోనఁ జంపఁ గలవు
శీల నీయానతి మాళిఁ దాల్చెడునట్టి
పుడమిఱేనిపై దాడి విడియఁగలవు
మానమే ధనమైన మానినీమణులఁ జి
క్కులు పెట్టి వారితోఁ గలియఁగలవు

నింద్యకర్మముల నెన్నిటినేనిఁ గావించి
లంచముల్ పెక్కుగా లాగఁగలవు
తే. అనృతవచనము లెన్నేని యాడఁగలవు
బిడియమును సిగ్గు నీ రెండు విడవఁగలవు
చెనఁటికార్యము లెన్నియేన్ జేయఁగలవు
ఈవు సలుపఁగలేనిదుష్కృతులు కలవె?
మఱియు నోరిగోమాంసభక్షకుఁడా!

కవి. తగుదు నటంచును ప్రేవిడి మమ్ములఁ
దాఁకఁగ వచ్చితివా యిటు బల్
మగఁటిమి యించుక కల్గినచో నను
మార్కొని సంగరరంగమునం
దగవడఁ జేయుము నీబల మంతయు
నంతియె కాని యిటుల్ వదియిం
పఁగ నిసుమంతయు లాభము లేదిఁక
వాగక నూరక యుండుమురా!

హైద.—(కోపముతో) నీకు నోటికి హింతావస్తే హంత పేల్తావ్ బద్మాష్! మాదీ పటాణిభీరం నీకు హేమ్ తెల్దు! హై అబీ బోల్తా! సునో:

గేయము.

ఖల్బగ్గి ఖోట్టేం ఖటాకునికి నెట్టేం
హోర్కాటు పట్నానికి హగ్గిలా ఫెట్టేం
ఫాల్కొండ ఖాల్చేం ఘోల్కొండ పేల్చేం
హైద్రా బాద్ హూల్లో మేం హంతట్లో నిల్చేం
ధోడ్డోర్ని సూసేం ధోర్లాకు నేసేం
మామాట యినోర్ని మట్టీలో యేసేం

నిన్ను పట్టీస్తాం నీఖ సంపేస్తాం
నీరాజ్జెం మావిజ్యరాజాఖ యిస్తామ్.

దేఖో: మాది తుర్కీపాడితడాఖా :

రంగా.—(మహాగ్రహముతో) ఔరౌరా! ముష్కరతురుష్కాధమా! ఎదిరితరంబును నీతరంబునుగూడఁ దెలిసికొననేరక మాటలాడుచున్నాఁడవురా! తాళుము తాళుము. తాళఫలంబుభాయ నీశీర్షంబుఁ ద్రవ్వనేయుచున్నాను. నన్ను నిర్జించి నారాజ్య మావిజయరామహతకున కిచ్చెదవో? ఓరీ! మహాపాతకవర్తీ!

(ముందునకు హైదరును లాగుచు) అసంబద్ధప్రలాపీ! రారా! కొందువుగాని,—

క. తురకలకుఁ బుట్టితేనిన్
బిరుదించుక యుండెనేని బిరుతివియక సం
గరమున నన్నోర్చుము నీ
బిరుదుమగంటిమిని నేఁడు వీక్షింతు నిటన్.

(హైదరురంగారాయల ద్వంద్వయుద్ధము, కొందఱు తురకవీరులు వచ్చి రంగారాయనిఁ దాకఁ, గొందఱఁగూల్చిరంగారావు మూర్ఛిల్లి తెప్పిరిలి.)

రంగా.—తమ్ముఁడా! వేంగళరాయఁడా! ఎదుంటివోయి?

శా. ఏ డీకొంటిని హైదరున్ గదనమం దెంతేని నాశక్తిఁ బో
రాడం గల్గితిఁ బ్రాణముల్ నిలుపఁగా నాసింపకుండంగ వే
రా! డీకొమ్ము జయమ్ముఁ గాంచు మిదె! వీరస్వర్గముఁ జేరుచు
న్నాఁడన్! నీవును ధైర్యమున్విడకసంధానింపుమా యుద్ధమున్.

(ప్రాణములు విడుచును.)

హైద.—(కాలఁదన్ని) బద్మాష్‌రాజా! మాఖి లుచ్ఛామాటల్కి బోల్తావ్: మాదీ ముసల్మాన్కే హచ్చా పోరుస్ నీఖి హిమ్మ మాలుమ్. (నాగోజీరాయనితో నిష్క్రమణము)

వేంగళరాయఁడు.—(నెత్తుటఁ దడసినబట్టలతో బీభత్సముగఁ బ్రవేశించి) ఆహా! ఈప్రాంతముల నెచ్చటనో యన్నగారియాక్రందనతుల్యమగు కంఠధ్వని వినవచ్చినది. వినినవెంటనే వచ్చెదమని యెంతతొందరపడినను నడుమనడుమ నన్నడ్డగించువారల నెల్లఁ గెడపి వచ్చుట కింతతడవైనది. వారి కేమేని హాని వాటిల్లి యుండదుకదా! (శవములఁ గాంచి) కొండలవలెఁ దండోపతండములుగఁ బడియున్న యీశవములయందు జీవంబులు కలవా రొక్కరును లేరే? ఒకనిముసముక్రిందట నున్నవారెల్ల నేమైనారు? (అటు నిటు తిరిగి మృతినొందియున్న యన్నను గాంచి అఁపరానిదుఃఖముతో) అన్నా! సోదరవత్సలా! రంగరాట్ప్రభూ! రణరంగస్వేచ్ఛావిహారా! సోదరా! పలుక వేమి? మాటాడ వేమి?

శా. రంగారాయనృపాల! రూపజితమారా! ధైర్యహేమాద్రి! సత్
సంగా! మాధవపాదపద్మయుగళీధ్యానైకహృత్పంకజ! నే
వేంగళ్రాయఁడ! నీసహోదరుఁడ! నన్ వీక్షింపుమా! యన్న! ఈ
భంగిన్ నాపలు కాలకింప విది నాప్రారబ్ధమా! సోదరా!

అయ్యో! అయ్యో! నిర్భాగ్యుఁడ నగునాకు నిన్నుం జూచి యానందించు భాగ్య ముండునా? అన్నా! ధైర్యగుణసంపన్నా!

శా. అన్నా! మమ్ముల వీడి నీవొకఁడ వయ్యయ్యో! దివిన్ జేరఁగాఁ
జన్నే! ధర్మవిదుండ వీ వెఱుఁగవే? సైరింపఁగాఁజాల నే
నిన్నున్ బాసి వియోగవేదన: అయో: నీయొద్ద కేనిన్ ననున్
గ్రన్నన్ జేర్పఁగ రాదె? సోదరుఁడ! రంగారాయభూమీశ్వరా!

అగ్రజా! నీ వీఘోరసంగ్రామంబునం దొంటరివై యేరీతి విహరించితివో, అదియైనఁ గన్నారఁ గాంచుభాగ్యము నాకు లభింపదయ్యె! హా! బొబ్బిలిపురాధీశ్వరా! రంగరాణ్ణృపశశాంకా!

మ. కనకక్ష్మాధరధీర! నీ వొకఁడవే కయ్యమ్మునన్ బెక్కురౌ
ధనికాయమ్ములతోడఁ బోర మిగులన్ దర్పించుచో నెల్లరో

కన్నీళ్లపై వేకురియించుగుండ్ల జడికాఁగఁ లేక నన్ 'దమ్ముఁడా!'
యనుచున్పిల్చితో? దుఃఖ మొందితివో? ఆయాసమ్ము నొందితో
అన్నయ్యా! పుట్టినదాది యెఱుఁగియుండని నీవియోగభార మే నెట్లు స
హింపఁగలను? హా! సహోదరా!

సీ. ఈనాఁటితోఁ దీఱెనే? నీకు నాకును
  దనరుఋణానుబంధమ్ము లెల్ల
నేఁటితోఁ దీఱెనే? నినుఁ గన్నులారంగఁ
  గాంచఁగాఁ గల్గుభాగ్యంబు నాకు
అకట! యీనాఁటితో నంత మొందెనె? బొబ్బి
  లిపురమ్ము నీవు పాలించు టెల్ల
శ్రీహరీ! నేఁటితోఁ జెల్లెనే? నీ మ్రోల
  వసియించుమామకభాగ్యగరిమ

తే. అక్కటా! సహజన్మ! రంగావనీశ
  నీవె గతియింప నాకు నీనేల యేల?
  వేడుక లవేల? యింక నీవిభవ మేల?
  పాడుబొబ్బిలి యేల? యీప్రాణ మేల?

(మూర్ఛిల్లుచున్నాఁడు)

వేంకయ:—(ప్రవేశించి విచారముతో) అక్కటా! నే నీఘోరవార్త రాయనింగారి కెట్లెఱిఁగింతును?

చ. అతులితసచ్చరిత్ర! మహిమాన్విత! నాయకపాదపద్మముల్
  మతినిఁ దలంచుతల్లి! జనమాన్యశిరోమణి! మల్లమాంబ! భూ
  పతిసతి! నీకు వారు బలవన్మృతి నొందినవార లంచు నే
  గతి, ధరణీశులోఁడఁ బలుకఁ గలవాఁడను? పాడుదైవమా!

ఈప్రాంతమ్ములనే మాప్రభుండు యుద్ధము చేయుచున్నాఁ డని విని యిందు వచ్చితిని కాని, వా రెందునుఁ గానరారు? (వెదకుచుండును.)

వేంగ.—(తెప్పిరిలి శోకముతో) హా! సోదరా! నన్నుం బాసి దివంబున కేఁగితివె?

ఉ. ఎవ్వని కప్పగించితివి? ఈవు సదా దయఁ జూచునన్ను నిం
  కెవ్వని కప్పగించితివి? ఈవు వధూనికః నీకుమారు నిం
  కెవ్వని కప్పగించితివి? ఎల్లపుడుం నినుఁ గొల్చువారి నిం
  కెవ్వని కప్పగించి దివి కేఁగితివో వచియింపు మగ్రజా!

వేంక.—(విని శోకముతో శవముపైఁ బడి) హా! బొబ్బిలిపురసింహాసనాధ్య క్షా! రంగారాయనృపాలచంద్రా! హా పద్మనాయకవంశమణీ! హా! మ మ్మెల్లరఁ దిక్కుమాలినవారిం జేసి పోయితివా!

సీ. మా కేమిగతి చెప్పి మ మ్మెల్లరఁ వీడి
  దివి కేఁగినాఁడ వుదీర్ణచరిత!
చెల్లఁబో! బొబ్బిలిసింహాసన మ్మెరి
  కప్పగించితివి? తుభ్యద్విరోధి!
ఆప్తబంధువుఁడ! నీయుండ జేరితి మాఱు
  పలుక వేమిటికి? భూపాలచంద్ర!
అరుల నుద్ఘాటింప నరుగు దేరక యిట్లు
  పడి యుంటి వేల? దిగ్వ్యాప్తకీర్తి!

తే. వెడలి రావేల? శత్రులఁ గడపవేల
  కరుణ రాదేల? మామీఁదఁ గలితశీల!
  వినుతగుణజాల! మామొఱ్ఱ వినవదేల?
  ఏల యీలీల? లేచిరావేల? మేల?

వేంగ.—వెంకయ్యగారూ! ఏమి చెప్పుదును? మాయన్నగారు మనలం బాసి దివం బలంకరింపఁబోయిరి సుఁడీ! హా! మనదౌర్భాగ్యము.

గీ. అస్తమించెను బొబ్బిలియంబరమణి
  అస్తమించెను పద్మనాయకవిభూష

అస్తమించెను వెల్మలనిస్తులయశ
మస్తమింపవె? మాయన్న యస్తమింప:—

అయ్యా.—వెంకయ్యగారూ! రాజకులబడబానలం బగు నావిజయరామనృపాలకుండు తెచ్చిపెట్టిన యకారణదారుణయుద్ధనామక మహానలంబునఁ బడి యన్నగారు దగ్ధులైరి కదా! ఇఁక మన మెవరికొఱకై యుద్ధము చేయుట? జయంబు వడసితిమే యనుకొనుఁడు. ఇం కెవరినిఁ జూచి బొబ్బిలికోటలో నడుగు వెట్టుట? "మఱఁదీ! నీయన్నగా రెచ్చట" యని అడిగినచో వధూనిక కేమిప్రత్యుత్తర మీయఁగలను? అట్టి యన్నను బోఁగొట్టుకొన్న పిదప నేనుమాత్ర మేల జీవించియుండవలయు? ఇదిగో! అయనచెంగటనే స్వఖడ్గప్రహారమ్మునఁ బరిత్యక్తజీవుఁడ నయ్యెదను.

వెంక.—వేంగళరావుగారూ! పురము తురకలవశ మగునేమో యని యన్నగారు శంకించి, కాంతాజనంబుల నెల్లఁ ద్రవ్యనేయ నాకాజ్ఞాపించిరి. విధిలేమి వారియానతి నెఱవేర్చి వచ్చితి. ఇఁక, బొబ్బిలిపురిలో నాఁడుపురుగైనను మిగిలియుండలేదు.

వేంగ.—(దుఃఖముతో) హా వధూనికా! హా బొబ్బిలిపురకాంతలారా! మీయెల్లరిభాగ్యములుకూడ నీరీతిగ నున్నవా!

మ. అకటా! యెంతటిఘోరవార్తయిది? మాయన్నయ్యె నేపద్మనా
యకవంశమ్మొకలిప్తలోన నిటు లన్యాయమ్ముగా నేఁడు పెం
డ్లికి నేతెంచినయెల్లబంధుగులతో? నే నేల? యీనేల నూ
రక జీవించుట సిగ్గుమాలి: ఇదె? నే ప్రాణమ్ములన్ బాసెదన్

(పొడిచికొన నుద్యమింప వెంకయ్య వారించును.)

వెంక.—వేంగళరావుగారూ! మనల నింతగా చేసినయావిజయరామచండాలుని, అతురుష్కాధమునింగూడఁ దెగటార్చినపిదప మనము మృతిఁ జెందవచ్చును. లేనిచో జగము లుండుదాఁక జనములు మనలఁ బౌరుషహీను లనరా!

చూడుఁడు: తగుచమూనాయకుఁడు లేఁడని తురకబలంబులు పెల్లుబ్బి మనకోటలోని కిట్లు ప్రవేశించుచున్నవో!

వెంగ.—(చూచి కోపచిత్తుఁడయి) ఏమేమి! నేను జీవించి యుండఁగ నీయవనాధములు బొబ్బిలికోటలోనికిఁ జొరఁబడుటరయే?

శా. రేరే! యుష్కరపారశీకపశువా! రే హైదరా! మూర్ఖ! రం
గారాయప్రభుమౌళిసోదరుఁడు వెంగళ్రాయఁ డుద్దండచం
డారాతిప్రకరోత్తమాంగవిలుఠత్ప్రావీణ్యదర్పోగ్రవి
స్ఫారుం డీడెన నున్నవాఁ డనుచు నెంచన్ లేదొకో బాలిశా!

ఓరోరీ! తురుష్కవంశసంభూతా! లంచగొండీ! హైదరా! రేరే! యవనచమూనాయకులారా!

శా. అన్నన్ సద్గుణగణ్యు జంపినమిమున్ హాహారవంబుల్ సెలం
గ న్నిర్జీవులఁ జేయ నేను బ్రతినన్ గైకొంటి: మీలో నెవం
డున్నన్ మేటిమగండు న న్నెదురుఁడీ! యుగ్రాజి మీబాహుద
ర్పోన్నత్యంబులఁ జూడ డెందమున నాహ్లాదంబు వాటిల్లెడిన్.

[పటాక్షేపముగ నిష్క్రమించుచున్నారు.]

శ్రీ రస్తు.

ఓంనమో మార్తాండగురువరబ్రహ్మణే.

శూర బొబ్బిలి.

పంచమాంకము.

రంగము-యుద్ధభూమి.

(విజయరామరాజు-హైదరుజంగు నుందురు.)

హైద.—హేటి యిజ్యరాజా! నీదీబాత్ నమ్మి యుద్ధం సెస్తే మాఖీ సాలా మోషం హైంది. లాడూ మర్గయా. లానూ మర్గయా. ఖుకరల్లీ హౌస వల్లీ మర్గయా: మాది అష్కర్ మే మంచిమంచ్ వస్తాద్ హుంది హోళ్లంత షచ్చిపోనార్! హెంతఘోరం హైంది.

విజ.—అయ్యో! నేను తమతో మొదటనే మనవిచేసి యుండలేదా!

చ. వెలమ లమేయవిక్రములు వెఱ్ఱియె కాని రణాంగణంబునం
దలఁపరు మిమ్ము నం చననె? దానియథార్థ మెఱింగినారలే
పలుచగ నాఁడు చూచితిరి వారల: నేమని యెంచినారు? బొ
బ్బిలిని జయించు టన్నఁ బృథివీస్థలి సర్వము గెల్చుటే సుఁడీ!

చాలమంది నిహతులైరి కాని, యింకను శత్రుశేష ముండకపోలేదు. వెంగళరాయఁడు చనిపోయినజాడ కానరాకున్నది. చెలికాని వెంకయ్యకూడ నింక నున్నాఁడేమో?

హైద.—హోళ్లూ హింకా హున్నార్ బోల్తావ్: పంతేంబుచ్చాయ్ యిన్గా వర్సడ్ మూత్తేల్ పా యిన్గాదమ్మాయ్ రంగ్డూ దమ్మం యెంకం హుం

దూని మర్గయా సెహ్నార్: యెంకాం యెంగ్డూ సచ్చేడ్ లేద్ బోల్తా—హిజ్యరాజా! మాదీ బారాలాక్ రుఫియాకే దేవ్:

విజ.—అచిరకాలములో మాకు బొబ్బిలి పట్టాభిషేకము జరుగునుకదా! అప్పుడే యాధన మంతయు నొసంగెదను.

హైద.—రాజా! నీఖీ సాలా దోఖుం సేసింది వోయ్: భొబ్లీవాడోళ్లూ భిడ్లూ హంతా హగ్గిలో పడి మర్గయా సెహ్నార్! హై బోల్తా! హిది పాపం హంతా నీది.

విజ.—ఈకృత్య మొనరించినవారు మీ రగుటచే నీపాప మంతయు మీది కాని నాది కాదు. అంచముఁ గొనకుండినచో నాదియే యగును.

హైద.—(కోపముతో) బద్మాష్ మాటల్ సెప్తావ్ మాఖి! నీఖి సెస్తే మాఖి నేసేవ్! మాఖీ పాపం హొందుక్ వస్తావ్ మియ్యా! ముళ్లా హిట్లాబాత్ బోలో: నీఖి సంపేస్తామ్!

వెంగ.—(తెరలో)

శా. ఏడీ హైదరుఁడెందు డాఁగొనియొ? వాఁడెచ్చోటనున్నాఁడు మా
త్రాడం జాలక యుండె నేమిటికి? మాయాయుద్ధమం దగ్రజన్
పాడిన్ దప్పి వధించినట్టిఖలు నస్మత్ఖడ్గధారాహతిన్
బీడింతున్ బ్రహరింతుభూతములకున్ మృష్టాన్నముల్ పెట్టెదన్.

విజ.—అదిగో! వెంగళరాయనిగొంతువలె నున్నది. అతఁడు మిమ్ముల వెదకికొనుచు నాయాప్రాంతములఁ దిరుగుచున్నాఁడు. ఇటకు రాకుండఁగనే మీరు పోయి వానిన్ దలపడుఁడు.

హైద.—హింకా యెంగ్డూ భత్కే హున్నాడ్ హోయ్:—మాఖీ హిద్ధం సెప్పి సాలా హల్పింది. మాఖి రంగ్డీఖి సంపింది. నీఖి యెంగ్డీఖి సంపు.

విజ.—వలదు వలదు! మీరే యన్నదమ్ముల నిరువురంగూడఁ జంపుఁడు: నే నింధుండి చూచుచుండెదను.

హైద.—(కోపముతో) లుచ్ఛారాజా! బద్మాష్‌రాజా! సిది ధొంగమాటా యిన్కోని మాది యెంతదోఖం సేసింది. భొబ్లీవాడూ సిఖీ డబ్బా యిస్తావ్ సంధి సేస్కో సేస్కో వంటూ యెంకంపంపి దమ్మయ్ పం పె సెప్నా యిన్కా హెంతాదోఖం సేసేమ్: హచ్ఛాహచ్ఛా యీ ర్లు హంతా మర్గయానే సేర్ : నాదీ మర్గయాఖి సిది హిస్తు నూస్తావ్! జావ్ జావ్! లడాయ్కి జావ్! హంత యుద్ధం నూ స్తే భయ్యాం సెస్తే కైకూ రాజ్యా హైసావ్ నివ్వు: సిది భల్నా వాడ్కి నూపించు. మై దేక్తా!

విజ.—(తనలో) అక్కటా! ఈతురకవానిమాటలు భరింప శక్యము కాకున్నవి. ఎట్లయినను బోరక తీఱదు. పోరినచోఁ బరాజయమే నిశ్చయము. ఏమైనను దైవ మున్నాఁడు. (పైకి గంభీరముగ) సాయిబేంద్రా! ఇదె నా ప్రతాపముఁ జూపెద నాతఁడు రానిండు.

వెంకయ్య.—(తెరలో) హతశేషులగు నస్మత్సైనికులారా! ఏల మీరిటు మాఱుపలుకక యూరకుండెదరు?

ఉ. రాయనిగారిపైన నపరాధములన్ వచియించి ధూర్తులన్
సాయముఁ గొంచు వచ్చిననృశంసుఁడు బొబ్బిలికోటపాలనన్
జేయుద మంచు నెంచునవినీతుఁడు నావిజయేశుఁ డేడి? నే
నాయనతోడఁ బోరుటకునై చనుదెంచుచునుంటిఁ జూపుఁడీ!

హైద.—(భయము నటించుచు) హిజ్యరాజా! హెదిబాత్ వంకాయ్ సెప్తాడ్ హుంది: హేమాకూడా హింకా భత్కిహున్నాడ్ హోయ్: మర్గయా సెప్లేద్: లేఖ్ పోతే భొబ్లీవాళ్లూ ముందు వచ్చి మళ్లా పుట్టి మాఖీ మార్నేఖు వస్తార్ బోలో.

పిదప రౌద్రాకారముతో ఖడ్గధరుఁడగు వెంకళరాయఁడు
ప్రవేశించుచున్నాఁడు.

వెంగ.—ఓహో సైనికులారా!

సీ. బొబ్బిలికోటలోఁ బాగతోట వేయించి
చుట్టుఁ గాల్పఁగ నున్నశూరవరుఁడు
దురమున మా కోడి తురకలపాదమ్ము
లాశ్రయించినమహాహావబలుండు
పద్మనాయకనామవంశమ్ము నిర్వంశ
మును జేయఁ బ్రతినఁ బూనినఘనుండు
నిర్హేతుకమ్ముగా నేఁటియీయాకయ్యమ్ముఁ
దెచ్చిపెట్టినమహోద్యచ్చరిత్రుఁ

తే. డస్మదన్వయపరిపంథి యగునృపుండు
విజయనగరమ్ముఁ బాలించువిభువరేణ్యుఁ
డైనవిజయేశుఁ డేమూల నడఁగియుండె
తెలుపుఁడా నాకుఁ బోర నేతెంచినాఁడ!

హైద.—(విజయరాముని ముందునకుఁ ద్రోయుచు) హరేఃయెన్కాయెన్కా పోతావ్: ముంద్కి యెల్‌పోయ్: సిఖి యుద్ధంసెయ్ పిలుస్తాడ్:

వెంగ.—(హైదరుం గాంచి విషాదాగ్రహములతో) ఓరీ! యవనచండాలా! ఎంతపని తెచ్చిపెట్టితివిరా!

గీ. కోట బంధులు సుతులు మాకోమలాంగు
లవుర నీమూలమునఁ గాదె? యగ్గిఁ బడిరి
మావిరోధి వచించినమాయమాట
లెల్ల నమ్మి నీ విటు చేసి తేర క్రూర!

కాని కాని! నీ కిది యంతయు దైవము కట్టికుడుపక పోఁడు. దైవమును స్మరించికొని చచ్చుటకు సిద్ధముగ నుండుము. ఇదే చూడు: నాకతారిచే నీకంఠచ్ఛేదన మాచరించెదను. (కత్తిసాము ప్రదర్శించుచున్నాఁడు.)

హైద.—క్యా హిజ్యరాజా! ముద్దులాగా మాటసెప్కి హెన్కా హెన్కా పోతావ్: తుంకు షరమ్ నహీహై యెంగ్డీఖి మారోమారో!

విజ.—(తనలో) ఇంకెట్లును నా కిది తప్పదు. (పైకి) ఓరీ! పరుషప్రలాపీ! వెడఁగువేడబములఁ గొన్నిఁటిఁ బచరించి మమ్ముఁ మార్కొన వచ్చితివిరా?

కవిరాజ. గరువమె యున్న ముఖాముఖిఁ బోరుము
కారుప్రసంగము లేటి కిటుల్
పరుసఁదనంబునఁ బల్కఁగ? నీదుప్ర
భావము చూపుము కల్గినచో
దురమున నన్ను నెదుర్కొని పోరుము:
దుర్మద! నిన్ను వధింతు మహా
త్తర మగునాతరువారున నీతల
ధారుణిఁ గూల్చెదఁ! దాళుమురా!

వేంగ.—ఓహో! విజయరామరాజుగారా! వీరే కాఁబోలు బొబ్బిలి గెల్చి యందు సింహాసనంబు నధిష్ఠింప సంకించు బుద్ధిబృహస్పతులు? (కోపముతో) చండాలుఁడా! నీమూలమున మారాచకొలమ్మున కెల్ల నపయశంబు వచ్చినదిరా? ఓరీ!, మూఢుఁడా! నన్ని నోర్వ నూహించుచున్నావురా?

కవిరాజ. సరిసరి! నీవన చాల నెఱింగితి
సంతస. మయ్యెను మూఢుఁడ! సం
గరమున మానరి కాకయె చింతిలి
గౌరవమున్ విడనాడి యిటుల్
తురకలపాదములం దలఁ దాల్చితె?
తుచ్ఛుఁడ! చాలుఁ బ్రతాపము లె
వ్వరిడెసఁ జెప్పఁగ బూనితి వోర! భ
వద్భుజసాహస మెల్ల ఖలా!

నీవింత నిర్భయముగ నాయెదుట నిల్చి నాతో మాట లాడఁ గలవనియే నే

ననుకొనలేదు. నీప్రతాపము చూచుటకయినయే యేనుం దొందరపడుచున్నాను. ఏదీ చూపుము. (వేంగళరాయ విజయరాముల ద్వంద్వయుద్ధము.)

హైద. హిది పమ్యంలో మాం హింట్కి ఫరారీ సెప్పి మాది షేనల్కి పంప్ తామ్: లేఖ్ పోతే హెంగ్డా హిజ్యాఖి షంపి మాదీ మార్నేఖు వస్తే మై క్యా కరుమ్. (పాఱిపోవును.)

(కొంతవడి పోరి విజయరామరాజు పాఱిపోవును.)

వేంగ.—ఓరీ గౌరవహీనుఁడా! తుదకు పలాయనపరాయణుఁడ వైతివేమిరా!

ఉ. సిగ్గఱి పాఱె దేల? చలచిత్తుఁడ! సంగరసీమ కాని, నీ
వగ్గనుఁ జూపి కొండెములు పల్కుట కా దిది: శత్రు లన్నఁ బై
జగ్గులఁ గాంచి భీతిలరు చంపుట చచ్చుట సేయుకున్న నాఁ
డగ్గులఁ బల్కనట్లె యిది యేఁగు నటంచుఁ దలంచి వచ్చితే?

మ. పరువా రాచకొలమ్మునందు జనియింపన్ లేదె! యీరీతి సం
గరభూమిన్ విడి పాఱుపిరుఁడ వహో! కయ్యమ్ము చేయంగ ము
మ్మరవృత్తిన్ చను దేర నేల? ధృతి వీడన్ వీడఁగా నేల? దు
శ్చరితా! తూత్రము వీటఁ బుచ్చితివి నీజన్మం బిఁకన్ గాల్పనే?

గీ. చెలఁగి మాపైనిఁ గొండెముల్ చెప్పఁగలవె?
సాయెబుల కింతొ లంచమ్ము లీయఁగలవె?
ఓరి! అస్మత్కరాళధారారభటికి
వీఁగి పోకుండ నిల్వలేవే? దురాత్మ!

ఉ. పోకుము పోకు మోయినృపపుంగవ! నీయసువుల్ గ్రహింప న
త్యాకులపాటుఁ జెంది భయ మందకు పాఱెడివారిఁ జంపుదు
ర్ధీరులు కారు వెల్మలరరే? యిసిరో! యిటువంటివాఁడ వే
లా! కడు నల్కఁ బూని యనికై చనుదెంచితి వోరి దుర్మతీ!

ఈతండు మత్ప్రహారణంబుల కాఁగఁజాలక పలాయితుఁడైనాఁడు. ఈ పిఱికితురకకూడ నాకగపడకుండ నెందేఁగినాఁడో:- అందఱును మ్రందినపిదప నేనుమాత్ర మేల జీవింపవలయు? ఈ హైదరుఁ జంపి యేనుగూడ బలవన్మృతి నొందెదఁగాక! ఓరీ! హైదరూ! నీ వెందడంగి యుండినను విడువక యీ వెంగళరాయఁడు పట్టి వధించునురా? మూర్ఖాగ్రేసరుఁడా!

వనమయూరము. సుందరులు మ్రందిరి విశుద్ధతరవహ్నిన్
అందఱును జచ్చిరి మహారణమునందున్
సందియు మిఁకేల నినుఁ జంపుటకునై నే
నిం దరుగుదెంచితి నిసీ! యిటకు రారా!

డాఁగక బయటవడి రమ్ము.

(కొందఱు తురకజోదులు ప్రవేశింతురు.)

తురక.—రొంగ్లారాయ్‌కి పట్కో సంపూమే మాదీ హైదర్ ఫర్మానా హైంది. హైట్టా పగడోకి మాఖి మాలుమ్ నహీ:

వెంగ.—(కోపములో నట్టహాసము చేయుచు.) దురాత్ములారా! మీ రెల్లరు నాతో యుద్ధ మొనరింప నేతెంచినారురా! రండురా! రండు. మీతల లెల్ల వెలగపండ్లవలె భూమిఁ బడఁగొట్టెదను.

మ. వెలమల్ పౌరుషశాలు లంచవనిలో విఖ్యాతి దోపింప ని
స్తులదర్పోన్నతిఁ జావువాఁడ నిదె! యిచ్చో మత్కఠారమ్ము
గలనన్ వీరల నెల్లఁ గూల్చెదను వీఁకన్ లేనిచో వీరిచే [చేఁ
తులలోఁ జచ్చి మదగ్రజుల్ గలసికొందున్ స్వర్గలోకమ్మునన్.

(చిత్రముగ సాము చేసి పెక్కండ్రఁ గూల్చి మూర్ఛిల్లుచున్నాఁడు.)

బూసిదొర.—(ప్రవేశించి) అక్కటా! నే నెంత చెట్టఁ గావించితిని? వెలమలు కడుబలము కలవా రనియు, చెట్టలు సలుప రనియు వినుటయే కాక, యొజ్జలు వ్రాసిపంపినకమ్మఁ దిలకించి, మది మార్చికొని, లంచగొండి

యగు హైదరునిచేఁ దిరుగ మోసగింపఁబడి బొబ్బిలిపయి దాడి వెడలితిని. ఎంత మోస మయ్యెను. ఎంతమందిజోదులు సమసిరి. గెల్పునుగుఱించి దిగు లొంది బొబ్బిలికోట నంతయు మంటఁబెట్టించికొని, యందలి జవరాండ్రు, బిడ్డలు, ముదుసళ్లునుగూడ నాయగ్గిం బడి మ్రగ్గిరి. ఏమైననుఁ గోట దొరకినదా? ఎందఱనో నేలపాలుఁ జేసి యీబొబ్బిలిబిఱుదుమగ లందఱు సమసిరి కాని, యింకను వెంగళరాయం డున్నాఁడఁట! విజయరామునిఁ బాఱఁదోలి, హైదరుజంగుం దాఁకుటకయి యెంచుచుండెనఁట.—(మూర్ఛపడియున్న వెంగళరాయుఁ జిలకించి) అదిరా! ఈజోదెంతమందినిఁ గూల్చి తాను సొమ్మసిల్లినాఁడు. అహా! ఈతనిపస యెంతయో నిఁ బొగడ్తకుం దగినది. మున్ను విన్నదానికిని, నేఁడు కనుఁగొన్నదానికిని సరిపోయినది.—కొలువుడు కాఁడా! ఈ వీజోదుని నాగుడారమునకుఁ దోడ్కొనిపోయి నాసొంతవెజ్జుచే నీతనిగాయంబులకుఁ గట్టుఁ గట్టింపుఁడు. నేనుగూడ వచ్చుచున్నాఁడ: (నిష్క్రమించును తెరదిగును.)

రంగము - బయలు.

శోకనిమగ్నుఁ డగు పాపారాయఁడు ప్రవేశించుచున్నాఁడు.

పాపారాయఁడు.—అక్కటా! ఎంతలో నెంతగతి ప్రాప్తించినది? ఎఱిఁగి యెఱింగి, యిది యంతయు మేమే మనసారఁ దెచ్చికొంటిమి: నన్ను రాజామున కేఁగు మని చెప్పినపుడే వైరిసేన యాదారింబడి వచ్చునో, రాదో యని సందేహపడి యుంటి: మనమునం దాసందేహము పాదుకొని యున్నను, బావగారియానతి యనుల్లంఘ్య మగుట, విధిలేక, పురి వీడి పోవుటకుం సమ్మతించితిని. రాజామునం దుండి, యే నేమేనిఁ జేయఁ గలిగితినా?—అయ్యో! శత్రువు లాదారింబడి వచ్చియుండినచోఁ గదా! వారలఁ దాఁకి, మత్ప్రతాపంబుఁ జూప నవకాశము కల్గియుండును. ఎంతటిబాహుబలము కలిగి యుండినను, ఎంతవిక్రమము కల్గియుండినను అది యెల్ల నేఁ డక్కఱకు వచ్చినది కాదుకదా! సమయమున కక్కఱకు

రాని పనికిమాలినపౌరుష ముండిన నేమి? మండిన నేమి?—నిన్నటి సాయంకాలమువఱకు యుద్ధము జరుగుచునేయుండెనఁట? ఆసంగతి సుంతయేని నా కెఱుఁగవచ్చినదికాదే?—అక్కటా! ఇట్లగునని నా శోకించుట ముందుగ తెలిసియుండెనా! ఏ నిక్కడనే యుండి, సకలశత్రుపరంపరఁగూడ నొక్కరుండఁ దాఁకి రణరంగంబున వారల నెల్ల భూతబలి యొసంగి యుండనా! ఆయవనహతకుల నెల్ల మామకవిక్రమానలంబునకు శలభంబులఁ జేసియుండనా! ఎట్టికష్టకాలమందైనను, ఎంతటెంతటేని యాపదలు వచ్చి మమ్మొడఁబాపుఁ జేయ సంకించినను, తుద కీవిజయరామనరపాలకుండే మారాజ్యమునం దిదివఱకు కల్లరులఁ జేయించి మమ్ముఁ బెక్కుచిక్కులపాలు పఱచినవుడైనను, ఒకనిమిసమేని విడిచి యెఱుఁగని నాభావమఱఁది నాపంచప్రాణములుకూడ నతఁడే యని యూహించువాని నాపద్మనాయకవంశశిరోవిభూషణమును, నాబాహువిక్రమవిదారితసకలశత్రుసేనావారనిచయము, నా నాఁడే యకారణంబుగ విడిచి పోయితినే?—అకటకటా! ఇంకను వెంగళరాయనివివాహమునకు రాఁ జాలనైతిఁ గదా యని యింతదనుక, విచారించుచుంటి: అయ్యో! నాయట్టివిచార మట్లుండ, నేఁడు మిమ్మెల్లర జీవించియుండ నొకసారియైనఁ జూడఁజాలనైతిని కదా! యని విచారింపవలసి వచ్చెనే?

ధిరగుణశేఖరా! బావా! రంగావనిపాలా! రణరంగంబునం దెల్లర నోర్చి శత్రుపరంపరం బరిమార్చి, విజయలక్ష్మిపరివృతుండ వైతివా యని పలుకరించుటకు మాఱుగ, అయ్యో! నీమరణవార్తయా విని విచారింపవలసివచ్చినది. ధనుర్మాత్రసహాయుఁడవై, శత్రుసేనావారంబునఁ జొచ్చి యవక్రపరాక్రమము చూపుతఱి, ప్రళయకాలోదితమధ్యందినతీవ్రచండగభస్తిబింబప్రతిమానభీకరంబగు నీయాకారంబు చూచి యానందింపనైతిఁగా:—బావా! నాయం దెంతయో నమ్మకము కలిగి యే నొక్కరుండఁ బరిపంథికులంబు నెల్లఁ బరిహరింపఁగలనని మది నభిలాషఁ బూని యుంటివే? అట్టినేను బ్రతికియుండియుఁగూడ నీకు మర

ణము తటస్థించుతఱి ధీరులగతి నేమూలనో యడఁగియుండి సమయమునకు లేనివాఁడనైతినిగా!—తురకబలంబులు వచ్చి కోట ముట్టడించినవని నాకు సుంత వార్తయేనిఁ బంపియుంటివా! ఱెక్కలఁ గట్టికొని వచ్చి యప్పుడ నీపదసమీపమున వ్రాలియుండనా! సకలశత్రుపరంపరం గూడఁ జీకాకుపఱచి నీయొడకు వారినిఁ గొనితెచ్చి యుండనా! ఇట్లుగ పుత్త్రమిత్త్రకళత్రాదులతో మృతియే లేకుండునే? నిర్భాగ్యులమగు మన కది యెట్లు ప్రాప్తించును? ఈగతి విచారింపవలసియుండఁగ నీకా యూహ యేల జనించును? అటులే జరుగవలసియుండినచో నన్ను రాజామున కనుపక యిచ్చటనే యునిచియుందువే?—అయ్యో! ఎంతలోఁ బొరపడి యిట్లనుచున్నాను? దండు విడిసినతోడనే నన్నుం దోడ్కొని రమ్మని రామయ్యగారి నంపియున్నావఁట! దారిలో నాతని విజయరామునిసైనికు లరికట్టి రహస్య మెఱుఁగఁజేయమిఁ బిరంగివాతఁ బెట్టినారఁట! అదురాత్ముఁడగు విజయరాముఁడు మనకు సర్వవిధముల నపకారము సేయుచునే యున్నాఁడు. వెంకటలక్ష్మి నీకుమారునిఁ జామర్లకోటకుం గొంపోవుచుండ వారిం జంప యత్నించినాఁడఁట!—అయ్యయ్యో! మీరెల్లరకయి యిటు విచారించుచుండుటకే నా యీ సంకసు చావక బ్రతికియుండినది? అక్కటా! మత్పూర్వకృతకర్మవృక్ష మిట్లు పూచి ఫలించియుండఁగా, తత్ఫల మనుభవింపక తీఱునా!

కట్టా! మిమ్ముం బాసి పోవ నొల్లక యప్పగారిచేతను, బావవెంగళరాయగారిచేతను గూడ ననేకవిధముల మీకుం జెప్పఁజేసి, నాప్రయాణ మాఁప యత్నించితినే! 'వెంగళరాయనివివాహమునకు నే నుండవలదా! నాకుమాత్ర మది సంతోషజనకము కాదా!' యని యెన్నియోవిధంబుల మిమ్ముం బ్రతిమాలితినే! మా వేఁడికో లెల్లఁ జెడచెవినిఁ బెట్టి రాజాము ప్రయాణము విధిలేదని శాసించి, పట్టుఁబట్టి నన్నచట కంపితివి కదా! అయ్యయ్యో! మీరెల్లరిముఖములేనిఁ గన్నులకఱవుదీరఁ జూడఁ జాలనైతినే. అక్కటా! నాఁటిచూపులే మనకుఁ గడసారిచూపు లయ్యెనా!

అక్కా! ఈదుఃఖసముద్రము తరించుటకు నాకేది దారి? ఇలపయి నేను జీవించియుండి యింక నేమి చేయవలెను?

అప్పా! మల్లమాంబా! బావగారు నన్ను రాజాజ్ఞను కంపుచున్నా రని నీతో మనవిచేసినపుడు; ఎన్నఁడుగాని కంటఁ దడిపెట్టియెఱుంగని నీవు నాఁ డేల దుఃఖించితి వమ్మా! "తమ్ముఁడా! శత్రుకులము నున్మూలించి శీఘ్రముగ మఱఁది పెండ్లికి రావలెను సుమీ! నా కది విచారకరముగ నుండు" నని యేమేమియో చెప్పితివే? అవియన్నియు మఱచిపోయితివా! నీమఱఁది పెండ్లియేని సాంతముగ చేయక నీ వరుగుట యుక్తమమ్మా?— అయ్యో! పెండ్లి పెండ్లి యని కలువరించుచున్నాను. పెండ్లికి వచ్చిన యెల్లరుబంధుగులు నిహతు లైరే? స్త్రీజనంబు లెల్లరును దారుణాగ్నిం బడి తమజీవంబులఁ బాసిరే?—అక్కటకటా! ఏ నింక నెన్నికోట్ల జన్మము లెత్తినను నా కట్టియప్పయు బావయు దొరకుదురా! ఏ నేమి చేసినను మీరు నా కగపడరు కదా!

హా! అక్కా! బావా! బొబ్బిలిపురవీరులారా! కాంతాజనంబులారా! మీరు నా కొక్కసారి కనపడరాదా! కాదేని మీరెల్లరుండెడితావున కీనిర్భాగ్యునిఁగూడఁ గొనిపోయియుండరాదా! నన్నొక్కని నిందువిడిచి మీరెల్లరేఁగుట చాల నన్యాయ మగుఁజుండీ!—అయ్యయో! మీరెల్లరు గతించినపిదప నేనుమాత్ర మీభూమి నేల మనియుండవలయు? ఉండఁజాల నుండఁజాల! నా కీప్రాణమును వలదు. పట్టణమును వలదు. వెంగళరాయచినరంగరాయలఁ జూచుటయు వలదు. ఈపరాభవము సహించుటయు వలదు. ఏమియు వలదు. ఏమి యుండినను, ఏమిలేకపోయినను మాయక్కయు బావయు నాకు లేకుండిరి కదా! కావున మాబావ పడియుండినచోటికరిగి, వారి కగ్నిసంస్కారంబు గావించి ఆయగ్గింబడి మ్రగ్గెదను. లేదా! ఈచురికం గొని కంఠచ్ఛేదన మాచరించికొని జీవంబులఁ బాసెదను. ఏనూతనో పడి పరిత్యక్తజీవుఁడ నయ్యెదను. కాని జీవించియుండఁజాల! నిక్కముగా నీప్రాణముల భరించి యుండఁజాల!

అక్కటా! దుర్భరము-దుర్భరము - ఘోరము - విచారము-వియోగము- అయ్యో! నే నేల జీవించియున్నాను? నాకేల మృతి కలుగకున్నది? హా! అక్కా! బావా! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

(కలఁగని లేవకయే) ఏమనుచున్నావమ్మా! మనల నింతగాచేసిన యా విజయరామాధముని జంపినఁగాని, నాకును మీబావకును పరాభవాగ్ని చల్లాఱదని చెప్పుచున్నావా! (దద్దరిలి లేచి నలువంకలు కలయఁజూచి శోకముతో)

శా. అమ్మా! మల్లమదేవి! కోటపయి సైన్య మ్మట్టు లేతేర, నీ
వెమ్మాడ్కిం మది దుఃఖ మందితివో నీయారూపమే చెప్పు. నీ
తమ్ముం బాపయు నెంచి యెంతవలవంతం బొందినావమ్మ! జీ
వమ్ముం బాయఁ గడంగువేళను నెటుల్ వాపోయినా వప్పరో!

హా! బొబ్బిలిపురీశకాంతా! నీ కెంతవంత ప్రాప్తించినది?

ఉ. రంగనృపాల! ధీరగుణరాజిత! నిత్యయశోవిశాల! నా
కుం గడుఁగూర్చుబావ! రణకోవిద! క్రూరపరాసుమూఁకచే
భంగము నొందితే? హితుల బంధుగులం మము నెల్ల వీడి: దు
స్సంగుఁడు రామభూపతినృశంసునిమాయలఁ జిక్కి యక్కటా!

హా! రంగారాయా! సుకవిగేయా!

శా. శ్రీరేచర్లకులాబ్ధిచంద్ర! గుణరాశీ! సర్వదిగ్వ్యాప్తవి
స్ఫారోదంచితకీర్తిసాంద్ర! నిహతప్రత్యర్థి! యానాఁడు దో
స్సారమ్మెంతగ చూపితో కనునదృష్టమ్మేనియుం లేదె? రం
గారాయప్రభుమౌళి! నీదగువియోగమ్మెట్లు సైరించెదన్.

ఏ నిందు లేనితఱి యోజించి తురకలసాయముం గొనివచ్చి మాప్రభువులఁ బరిమార్చినాఁడుకదా! ఈవిజయరామరాజు. కాని!—వీని నేనొక్కరుండఁబోయి చిత్రముగ భూతబలి యిచ్చి యానెత్తుట మాబాంధవశ్రేణికిఁ దర్పణంబులఁ జేసెదఁగాక!

స్రగ్ధర. చండత్వమ్మూని మాపై సవనవవిజయత్వావరుండించు నే తే
కుండన్ వీక్షించి మారాడుడుపతిని మహాయుద్ధమందుర్ వధించె
గ్గుండం బిండిన్ర్వెన ర్త్సుగ్గులగులనడఁతున్గుండియల్ వ్రక్కలింతు
న్గుండింతుర్ గండడంతుర్ ఖలుఁడగునతనిర్ గండకండల్ విడంగన్.
ఆవిజయరామునితో పాటు పారశీకాధముండగు నాహైదరుసుంగూడఁ
బరిమార్చి శూరబొబ్బిలివిక్రమంబు దిక్కుదిక్కులకుం జాటెద.

వెంకయ్య.—(ప్రవేశించి) అయ్యా! అగుడారమునం దెల్లరు గాఢనిద్రా
పరవశులై యున్నారు. ఒకకంచుకిమాత్ర మపుడపుడు కునికిపాట్లుపడు
చున్నను పహరా యిచ్చుచున్నాఁడు.

పాపా.—ఏమిరా! విజయరాముఁడుకూడ నిద్రలో మునింగియున్నాఁడా!

వెంక.—చిత్తము. అయినను నిద్రించుచునేయున్నాఁడు దేవా!

పాపా.—ఇప్పట్లు నేనేమి యొనరించిన బాగుగ నుండును!

సీ. ఇది యేటి కంచు నే నేగుదునా?—మల్ల
మాంబదుగఖాగ్ని యెట్లారిపోవు?
తెలవాఱుపిదప వారలఁ దాఁకి కూల్తునా?
ఎవరిది జయము? యెల్లర్పడింతు?
ఎల్లరన్ లేపి నే నిపుడు డీకొందునా?
నృపుఁడు డాఁగున్న నా కేమిఫలము?
మఱుఁగునఁ బోయి యాధరణీశుఁ ద్రుంతునా?
అక్రమ మ్మౌను నావిక్రమమ్ము.

తే. అక్కటా? ఇట్టియెడల నేమైనఁ గాని
చేయ మన సొప్ప కుండెను నూయి యొకట
నొకట గోయి యటన్నయ ట్లుండె నాకు
నెట్టు లాక్రూరనృపు వధియింతు నిపుడు.

అన్నిటికన్నఁగూడ నొకటియాచరించిన బాగుగ నుండునని పొడకట్టు
చున్నది. అది యించుక ధర్మయుద్ధవిరుద్ధంబే యైనను మహాసియులు మని
పేరుపొందినవారిచేఁగూడ నాచరింపఁబడకపోలేదు.

శా. వాలిం బొంచి వధించె దాశరథి; యశ్వత్థామ కౌంతేయభూ
జాలమ్మున్ మడియించె ధాత్రి;నరుఁడుర్ జానొంచె దేవవ్రతుర్
లీలన్ డాఁగొని; వారికన్న బలశాలిర్ గాను తద్ధారుణీ
పాలుర్ గూల్పకయున్న నీధరణి జీవ మ్మేటికిర్ బూనఁగర్.
వెంకయ్యా! ఆవిజయరాముఁడు నిదురించియున్న గుడారమునకు దారి
చూపుము.

(తెర యెత్తుసరికి నిదురించుచున్న విజయరామరాజును, కునికిపాట్లు
పడుచున్న కంచుకియు నుందురు. పాపారాయఁడు లోనికిఁ బరిక్రమిం
చుట నటించి, కంచుకిర్ జంపి విజయరామరాజుచెంగట కేఁగును.)

పాపా.—(క్రోధముతో బిగ్గరగ) చ॥ పులిపులి...

విజ.—(తెలివితెచ్చుకొని లేవకయే ఆత్రముతో) చ॥.....కొట్టు కొట్టు

పాపా.—(రాజుగుండెలపయిఁ గూరుచుండి, యొకచేత వానిగొంతు నొ
క్కుచు, రెండవచేత బాఁకుఁ బూని)

చ. (పులి! పులి! కొట్టుకొట్టు:)మిది బొబ్బిలిబెబ్బులి: కాదు గహ్వర
మ్ములఁ దిరుగాడుపెద్దపులి; పూనికమై నినుఁ జంపి నీదుప్రే
వులు మెడఁ దాల్ప వచ్చినది; పుష్కలమౌ భవదీయరక్తముర్
లలిఁ జవిఁ గాంచ వచ్చినది;లక్ష్యము లేనిది;దీనిఁ జూడుమా!

విజ.—వాఁడురా! అక్కడ! తాండ్రపాపయ్య వచ్చి నన్నుర్ జంపయత్నిం
చుచున్నాఁడు. సైనికుల హెచ్చరించి తోడ్కొని రమ్ము.

పాపా.—ఓరోరి దుర్మార్గానువర్తీ! నీ పని యైనదఁటరా! ఇఁక సైనికులపని
కావలసియున్నదా! నా రేవులకే కడతేరినా రని నీ వెఱుఁగవు కాఁబోలు!
ఓరీ! దుష్పథగామీ!

మ. పలుకొండెమ్ములు బూసికీ నొడివి మాపైఁ గిన్కఁబుట్టించి త
ద్బలమున్ సాయముఁ గొంచువచ్చితివిరా! వాజిమ్ము! మాపైకిఁ బొ
బ్బిలిని గెల్చితి నంచు నుబ్బకుము; నీబీరమ్ముఁ దూలింప ని
స్తులదర్పోన్నతుఁడైన, తాండ్రకులుఁడిచ్చోవచ్చియున్నాఁడురా?

శా. పాపారాయఁడఁటన్న నెవ్వఁ డనుచున్ భావించుచున్నావు? నీ
పాపమ్ముల్ ఫలియించె నేఁడిటుః భవత్ప్రాణానిలంబుల్ వెసన్
బాపన్ వచ్చినవాఁడః నాతురకనే ప్రార్థింతువో? బూసినే
కాపాడంగను రమ్మటందువా? యెదో కావింపుమా మూర్ఖుఁడా!

ఉ. ఏ నిట లేనివేళఁ గుమతీ! చనుదెంచి వధించితే ప్రభున్
చీః నిను ముక్కముక్కలుగఁ జెక్కెద మచ్ఛురికా ప్రయుక్తి ని
ష్ఠని హరిన్ స్మరించికొనుమీ! తురకాతని మాని, నీవు న
జ్ఞానముచేఁ బొనర్చునపచారములన్ స్మరియించు దుర్మతీ!

మఱియు నోరి ద్విపాదపశువా!

క. మా రాజధాని యేలెద
వేరా! నరిః యుండుముండు మేలించెద; ధీ
దూరా! అదియో కాలుని
యూరో! రెండింటిలోన నొం డేదైనన్.

ఔనయ్యా! నన్నుం జూచినతోడనే ప్రాణము లెడలినవా! లేక, మా
టాడ గొం తెడమీయకున్నదా!

విజ.—పాపయ్యగారూ! నిశివేళ నిద్రాణులఁ జంపునంతటియయోగ్య యుద్ధ
పరాయణు లని మి మ్మనుకొనలేదు. మీరే యిట్టియధర్మమున కొడిఁగట్టి
కొందురా!

పాపా.—(హేళనగ) ఓహో! నీ కిప్పుడు ధర్మమార్గములు కావలసివచ్చె
నుగా!

చ. సరిసరిః ధర్మమార్గములు చాల నెఱింగితి వోరి మూర్ఖ! హై
దరునకు లంచ మిచ్చుటలు ధర్మమొ? కొండెము చెప్ప ధర్మమే?
చిఱుతని రంగరాట్తనయుఁ జెండఁ దలంచుట ధర్మమే? మహా
త్తరమగు పోరుఁ గూర్చుటలు ధర్మమొ? నీవధయే యధర్మమే?

విజః—(లేవ నుంకించుచున్నాఁడు.)

పాపా.—ఓరీ! చావక యింకను లేవ యత్నించుచున్నావా! ఇదిగో!
నిన్నున్ దుదముట్టించుచున్నాఁడఁ జూడుము:

సీ. ఇది కాచికొమ్ము నీహృదిఁ జిల్చు రంగరా
ట్ప్రభు మహాళిరిపు కేళి వంతుపోటు
ఇది తప్పుకొమ్ము దుర్మదహారి దామెర్ల
వంశవార్ధిశశాంకు వంతుపోటు
ఇది యోర్చికొమ్ము నెమ్మది భీతిఁ జెందక
పాపయ్యదొరగారి వంతుపోటు
ఇది తాళికొమ్ము దోర్వ్యదళితచండోగ్ర
పరిపంథి వెంకయ్య వంతుపోటు

తే. ఇదియు కాపాడుకొమ్ము నీ వదరకుండ
బాహుబలశాలిబుచ్చన్న వంతుపోటు
ఇంక రుచిఁ జూడ రమ్ము నిశ్శంకఁ దాండ్ర
పాపరాయండు రుచి చూపుబాఁకుపోటు.

విజ.—(దీనముగ) అయ్యా! పాపయ్యగారూ! నన్ను మీ రీరీతిగఁ జిత్ర
వధ గావింపకుండ నొక్కమ్మడిఁ గుత్తుకఁ గత్తిరింపరాదా! ఈబాధ
భరింపఁజాలకున్నాను.

పాపా.—(బాఁకు నేలఁ బడవైచి క్రిందకు దిగి విచారముతో) ఆహా! విజ
యనగరసింహాసనాధీశ్వరా! విజయరామరాజా! నీ వెట్టిసంకటమందుఁ

జిక్కికొన్నావు! అక్కటా! ఇట్టిదురవస్థ శత్రుకోటికేని వలదు. ఇట్లుగ నీవృత్తి వ్రాసియుంచినాఁడా! భగవంతుఁడు.

సీ. నలకూబరాదులఁ దులకించురూపసం
పద నొప్పునీకు నియ్యది ఫలంబె?
భోగభాగ్యముల నావురుహూతు మఱపించు
విదితభోగునకు నియ్యది ఫలంబె?
రంతిదేవాదిభూకాంతుల శేవ నొ
ప్పిద మైననీకు నియ్యది ఫలంబె?
వసుమతీతలపరిపాలనాధౌరేయ
ఇభవైరిశౌర్య నీ కిది ఫలంబె?
తే. ఎల్ల నీచేసినట్టిదుష్కృతులె నీకు
నిట్టిదుర్గతిఁ దెచ్చె రాజేంద్ర నీకు
నిట్టిదురవస్థ వచ్చునం చెన్నఁ డెఱుఁగ
విజయనగరపురీపాల! విభవలోల!

విజ.—(సాయాసముగ) పాపయ్యగారూ! ఆయాసము హెచ్చగుచున్నది. నాయొనర్చిన పాపకృత్యములే మిమ్మిధార్త్యమునకుఁ ద్రేరేచినవి: లేనిచో మీరిట్లు చేయుదురా! శీఘ్రింబ తెగ నేయకున్న నేనిబాధ భరింపఁ జాలకున్నాఁడ :—

ఆ. వె. ఎదిరివచ్చు కౌర్వ్య కీరీతి మీకెల్ల
నగ్గుఁ దెచ్చినాఁడ హీనుఁడ నయి
అట్టినాకుఁ గీర్తి యెట్టిఁక నిల్చుఁ జే
రెట్టు లుండు బ్రదుకు టెట్టు కలుగు.

ఇంక నాకాల మంతమగునట్లు భగవన్నామస్మరణంబుఁ గావించికొందును. మీపనిఁ గానిండు. నారాయణ! నారాయణ!! నారాయణ!!!

పాపా.—విజయరామరాజా! వగఁ దక్కియుండుము. బ్రదికియుండి నన్నినాళ్లు నిరంకుశలీలఁ బ్రభుత్వంబు నెఱపి యష్టైశ్వర్యంబుల ననుభవించి యపరదేవేంద్రుఁడ వనియు, విద్యాభోజుఁడ వనియు విఖ్యాతిఁ గాంచితివి. అట్టినీవు మరణించినను గూడ మృతజీవుఁడవు కాని,—జీవన్మృతుఁడవు కావు.—మఱియు మాకింత యొగ్గొనరించిన యాదూదేకుల సాయెబును బరిమార్చి నేనుఁగూడ మీయొల్లర చెంతకే వచ్చెదను. (విజయరాముని విగతజీవునిఁ జేసి) ఓరోరి హైదరుజంగా! దొంగా! ఎందు నిదురించి యున్నాఁడవో కాని, బయలువడి రమ్మురా! నేనెవ్వండనో నీ కెఱుఁగ రాకున్నది కాఁబోలు! ఇదిగో! యెఱిఁగించుకొనుచున్నాఁడ వినుము.

గీ. విజయరామునిఁ గాలునివీఁటి కనిపి
తచ్ఛరీరక్షతజరక్తధారలందు
స్నాన మాడినవాఁడ! నిన్ జంపుటకును
వేడ్కపడువాఁడఁ బాపయ్యపేరి వాఁడ!

మఱియు నిది యొక ప్రతాపముగాఁ జూడరేని, యొండొకటి చెప్పుచున్నాఁడ:

శా. ముక్కల్ ముక్కలు కాఁగ, నీవిజయరామున్ జెక్కితిన్ సేనలోఁ
జెక్కం ద్రన్ బరిమార్ప నెంచితిని: దోర్వీర్యంబు చూపించి యే
నొక్కండై యెదురంగడంగుటకునై యొక్కండు లేకుంట నా
కిక్కయ్యెమ్ముముదమ్ముఁ గూర్ప దెదురై యేతెందు మీ రెవ్వరేన్.

(ఎవరును మాటాడకుంట నుపలక్షించి) ఏమిది? ఒక్కఁడును జాకు బదులు చెప్పఁడు. మీరందఱుఁ బనికిమాలినభీరువులురా!—అంతకంతకు మనమ్మున నేమేమియో యాందోళన మధిక మగుచున్నది. ఒక్కరును నా కెదురై పోరక పోయినచో నిది తీరుట యెట్లు? (యోజించి)

ఈవిజయరామరాజుమాత్రము నా కెదురై పోరినాఁడా యేమి ? వీనిం డెగటార్చినట్లే, యాహైదరుగానిఁ గూడ నిల్గించివచ్చెదను. అప్రక్క నున్నగుడారములో నేకదా వాఁడున్నాఁడని వింటి: ఓరీ! హైదరుఁడా! ఇదిగోనురా! నిన్నుఁ జంపుటకయి వచ్చుచున్నాఁడను. (ఇంచుక పరిక్రమించి, దిక్కులు కలయఁ జూచి) ఏమీ! వెలుతురు కానవచ్చుచున్నది. కోలాహలము వినవచ్చుచున్నది. అప్పుడే భగవానుండగు భాస్కరుం డుదయించుతటి యైనదా !—కాలేదే ?—అదిగో! ఈ జోదులందఱు మేల్కాంచి తమతముయుద్ధపరికరములను సమకూర్చుచున్నారే ! వీరిబోడిగుండ్లఁ బరికించి చూడ వీం డ్రాహైదరుగానిసేనలలోఁ జేరినవారై యుందురు. నేను వచ్చినసంగతి వీరల కెట్లు తెలియవచ్చినది?—ఆహా! నాయార్భాటములు కేకలు విని వీం డ్రందఱు మేల్కాంచి యుందురు. ఈయందఱితోఁ గూడ ముందుగ నేనే తలపడుదునా ? లేక యాదూదేకులవీరుని వెదకుదునా !—కాని! అతురక నే వెదకెదఁగాక !—

వానిని:—

ఓరిదురాత్ముఁడ! హైదర! యెచ్చటనుంటివి రా! భయమందిమహా
శూరుఁడవే! రణభూమిని డాఁగినఁ జూచెద నీబల మెల్లను నేఁ
బాలక నాయెదుటం బడిపోరుము: పౌరుష మించుకయుండిన ధీ
దూర! నినుఁగనఁ బాపమువచ్చెను త్రుంపకమానఁడునిన్ను ఖలా!

కొందఱు యవనయోధులు ప్రవేశింతురు.

పాప.—ఓహో! ఈబలంబులెల్ల నన్నుం దాఁకుటకయియే కాఁబోలును? వచ్చుచున్నవి. హైదరుగాని వెదకకుండ నన్నరికట్టవలయుననియే వీరల యభిప్రాయమై యుండుఁ. సరియే! అదియునుఁ జూచెదను. (సేనల దిక్కుయి) ఓరీ! పూర్వసువాసినులారా! ఇంకను నన్నెదిరింపక యచ్చటనే నిలిచి యుంటిరేమి ? రక్తసిక్తాంగుఁడ నగునన్నుఁ గాంచినంతటనే నేనొకభూతము నని పరిభ్రమించుచున్నారు కాఁబోలును ?

నాటకములు * న-63 2210

రచయిత నారాయణశర్మ, జనయజ్ఞ

పుస్తకము శూర బొబ్బిలి ౧.

ఈయవలసిన తేది.	ఈయవలసిన తేది.	ఈయవలసిన తేది.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము

సుల్తాన్‌బజారు - హైదరాబాదు

ఈ దిగువ పేర్కొనబడిన తేదినాడు కాని అంతకు పూర్వము కాని ఈ పుస్తకము వాపసు చేయవలెను. (తిరిగి ఈయవలెను)

END OF
TITLE